www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 261 | సోమవారం | 12 మార్చి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

రాజ్యసభకు వీరే

సంతోష్‌కుమార్, లింగయ్య యాదవ్, ప్రకాశ్ ముదిరాజ్

టిఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రకటించిన సిఎం • రెండు సీట్లు బిసిలకే 3లో



సంతోష్ కుమార్ | లింగయ్య యాదవ్ | ప్రకాశ్ ముదిరాజ్

మోడీ మళ్లీ రాడు

మనది థర్డ్ ఫ్రంట్ కాదు, ఫస్ట్ ఫ్రంటే, 2019 ఎన్నికల తరువాత జాతీయ రాజకీయాల్లోకి



- గవర్నర్ ప్రసంగానికి అడ్డుతగిలితే సెషన్ మొత్తానికి సస్పెన్షన్
- ముగ్గురు, నలుగురికి తప్ప సిట్టింగ్‌లందరికి వచ్చే ఎన్నికల్లో టికెట్లు
- 106 సీట్లల్లో గెలుపు మనదే
- రిజర్వేషన్లపై తగ్గేదే లేదు
- బడ్జెట్ సమావేశాల తరువాత ఢిల్లీలో ధర్నా
- టిఆర్‌ఎస్‌ఎల్‌పి సమావేశంలో ఎంఎల్‌ఎ, ఎంఎల్‌సిలు, ఎంపిలనుద్దేశించి ముఖ్యమంత్రి కెసిఆర్

మన తెలంగాణ/ హైదరాబాద్: 'రాష్ట్రంలో రాజకీయ వాతావరణం మనకే అనుకూలంగా ఉన్నది. భయపడాల్సిన పనే లేదు. దాదాపు సిట్టింగ్ ఎంఎల్‌ఎలందరికీ టిక్కెట్లు ఇస్తా. నలుగురైదుగురు ఎంఎల్‌ఎలు తీరు మార్చుకోవాలి. అందరూ మరింత కష్టపడాలి. 2019 ఎన్నికల వరకూ రాష్ట్రంలోనే ఉంటా. ఆ తర్వాత దేశ రాజకీయాలపై దృష్టి పెడతా. కేంద్రంలో మళ్ళీ మోడీ వచ్చే అవకాశాలు లేవు. అందరు థర్డ్ ఫ్రంట్ అంటున్నారు. కానీ, మనదే ఫస్ట్ ఫ్రంట్' అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఎంఎల్‌ఎలు, ఎంపిలు, ఎంఎల్‌సిలతో వ్యాఖ్యానించారు. సోమవారం నుంచి రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో సిఎం అధ్యక్షతన ఆదివారం తెలంగాణ భవన్‌లో టిఆర్‌ఎస్ శాసనసభా పక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకున్నట్లయితే సభా సమావేశాలనుంచి సస్పెండ్ చేయడమేనని వ్యాఖ్యానించారు. మైనారిటీ రిజర్వేషన్లపై వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని, బడ్జెట్ సమావేశాల తర్వాత ఢిల్లీలోనే ధర్నా చేద్దామని స్పష్టం చేశారు. ప్రస్తుత సిట్టింగ్‌లలో ముగ్గురు, నలుగురు మినహా అందరికీ మరోసారి టికెట్లు ఇస్తానని సిఎం కెసిఆర్ వెల్లడించినట్లు తెలిసింది. మిగిలిన ఆ నలుగురు కూడా తమ పద్ధతులను మార్చుకోవాలని సూచిస్తూ వీరిపై తాను ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి గెలిపించుకోవడానికి చొరవ తీసుకుంటానన్నట్లు సమాచారం. సమావేశంలో ఎంఎల్‌ఎలు బొడిగె శోభ, గంగుల కమలాకర్‌లపై కెసిఆర్ కొంత అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. వచ్చే ఎన్నికల్లో 103 నుంచి 106 సీట్లు వస్తున్నాయని, వారం

తరువాయి 6లో

కేంద్రంలో సంతోష్ కీలకపాత్ర 3

నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు 3

కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థి **బలరాం నాయక్**


వ్యాధులపై సర్కార్ సమరం : మంత్రి లక్ష్మారెడ్డి



మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాల వ్యాధులపై సమరం ప్రకటించిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి తెలిపారు. రోగాలు వచ్చిన తర్వాత ఆధునిక చికిత్సను అందించడంతో పాటు రాకుండా ఉండేందుకు ముందుజాగ్రత్త చర్యలను కూడా తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగానే ఇంటింటి కంటి వైద్యంతో పాటు ఇతర వ్యాధుల నిర్ధారణకు పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ వేసవిలో నెల రోజుల పాటు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేస్తామన్నారు. గ్లకోమా నివారణకు నడుం బిగించాలని సూచించారు. హైదరాబాద్ అప్తమాలజిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ సైట్ ఎడ్యుకేషన్ సహకారంతో స్టాప్ తేఫ్ట్ సేవ్ – సైట్ లెఫ్ట్ అనే కాన్సెప్ట్‌తో గ్లకోమాపై ప్రజల్లో అవగాహన పెంచడానికి ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజారోగ్యం పట్ల ప్రభుత్వం బాధ్యతతో వ్యవహరిస్తుందన్నారు. ఇప్పటికే అనేక సదుపాయాలు పెంచి, ప్రభుత్వ సౌకర్యాలను ఆధునీకరించిందన్నారు. అత్యాధునిక పరికరాలు కూడా అందజేశామన్నారు. త్వరలోనే పదివేల ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వివరించారు. ఇక కేసీఆర్ కిట్లు, గాంధీ ఆసుపత్రిలో 60 పడకల ఐసియూ, 40 సింగిల్ యూజ్డ్ డయాలసిస్ కేంద్రాల ఏర్పాటు చేశామన్నారు.

‘సహకార సమాఖ్య’ స్ఫూర్తికి తూట్లు

42% పన్నుల వాటాలో కోత విధించిన కేంద్ర ప్రభుత్వం



మన తెలంగాణ / హైదరాబాద్ : ‘సబ్ కే సాథ్, సబ్ కా వికాస్’ నినాదంతో అన్ని రాష్ట్రాల అభివృద్ధిని కాంక్షిస్తున్న కేంద్ర ప్రభుత్వం తరచూ ‘సహకార సమాఖ్య’ స్ఫూర్తి గురించి వ్యాఖ్యానిస్తూ ఉంటుంది. కానీ రాష్ట్రాల నుంచి వసూలవుతున్న పన్నుల్లో ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు కేటాయింపులు చేయడంలో మాత్రం కేంద్రం విఫలమైంది. పదమూడవ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు పన్నుల వాటాల్లో రాష్ట్రాలకు 32% అమలైనా ఆ తర్వాత వచ్చిన పద్నాల్గవ ఆర్థిక సంఘం (2015–20) మాత్రం పది శాతం వాటాను పెంచుతూ 42% వాటాను రాష్ట్రాలకు కేటాయించాలని సిఫారసు చేసింది. దీన్ని యధాతథంగా ఆమోదించిన కేంద్ర ప్రభుత్వం 42% వాటాను చెల్లించనున్నట్లు హామీ ఇవ్వడంతో పాటు అనేక సందర్భాల్లో దీన్ని గొప్పగా చెప్పుకుని రాష్ట్రాలకు చేయూతనిస్తున్నట్లు వ్యాఖ్యానించింది. కానీ ఆచరణలో మాత్రం ఇది గరిష్టంగా 36% దాటలేదు. కేంద్ర ఆర్థికమంత్రిత్వ శాఖే స్వయంగా ఈ అంశాన్ని వెల్లడించింది. పద్నాల్గవ ఆర్థిక సంఘం సిఫారసులు 2015–16 నుంచి అమల్లోకి వచ్చాయి. ఆ సంవత్సరం రాష్ట్రాలకు ఇచ్చిన పన్నుల వాటా కేవలం 34.77% మాత్రమే. కొత్తగా ఏర్పడిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు పన్నుల వాటాల్లో కోత పెట్టకపోయినప్పటికీ అన్ని రాష్ట్రాల గణాంకాలను పరిశీలించినట్లయితే మొత్తం వాటా 34.77% మాత్రమే. ఆ తర్వాతి సంవత్సరం (2016–17)లో 35.43% వాటా మేరకు చెల్లింపులు చేయగా, 2017–18 ఆర్థిక సంవత్సరంలో 35.70% మేరకు చెల్లించింది. అంటే రాష్ట్రాల నుంచి వసూలవుతున్న పన్నుల్లో దాదాపు రెండు వంతులు తన దగ్గర పెట్టుకుని ఒక వంతు మాత్రమే పంచుతోంది. గ్రాంట్లు, ఇతర రకాల ఆర్థిక సాయంతో సంబంధం లేకుండా కేవలం పన్నుల్లో వాటాను 42% మేరకు రాష్ట్రాలకు పంచాలని ఆర్థిక సంఘం సిఫారసు చేయడం, కేంద్ర ప్రభుత్వం దాన్ని ఆమోదించడం జరిగినా ఆచరణలో మాత్రం ఆ స్ఫూర్తి ప్రతిబింబించడం లేదు. అయితే గతేడాది జూలై నుంచి జిఎస్‌టి అమల్లోకి రావడంతో కొన్ని రాష్ట్రాలకు నష్టపరిహారం రూపంలో చెల్లిస్తున్నట్లు పేర్కొన్న కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఆ వివరాలను మాత్రం వెల్లడించలేదు. 2017–18 సవరించిన అంచనాల ప్రకారం జిఎస్‌టి నష్టపరిహారం రూపంలో వివిధ రాష్ట్రాలకు రూ. 61,300 కోట్ల మేరకు చెల్లించనున్నట్లు అంచనా వేసింది. దీన్ని కలుపుకున్నా కూడా రాష్ట్రాలకు చెల్లించే పన్ను వాటా 38.95% దాటడం లేదు. ఆ రకంగా చూసినా ఆర్థికసంఘం సిఫారసు మేరకు అందాల్సిన 42%తో పోలిస్తే సుమారు 3% తక్కువే. పద్నాల్గవ ఆర్థిక సంఘం రాష్ట్రాలకు పన్నుల వాటాను 32% నుంచి 42%కి పెంచినా తెలంగాణ రాష్ట్రానికి మాత్రం నష్టమే జరిగింది. పదమూడవ ఆర్థిక సంఘం సిఫారసుల ప్రకారం చూస్తే తెలంగాణ వాటా 2.899% ఉండేది. ఆ ప్రకారం తెలంగాణ ఏర్పడిన తొలి సంవత్సరం (2014–15)లో పన్నుల వాటాగా రూ. 9,795.40 కోట్లు లభించింది. కానీ పద్నాల్గవ ఆర్థిక సంఘం సిఫారసుల ప్రకారం చూస్తే రాష్ట్ర వాటా 2.437%కు తగ్గిపోయింది. అంటే 0.462 తగ్గింది. ఆ మేరకు ఆర్థికంగా రాష్ట్రం నష్టపోయినట్లే. పదమూడవ ఆర్థిక సంఘం సిఫారసుల ప్రకారం (2010–15)లో రాష్ట్రాలకు 32% వాటాను పంపిణీ చేయాలని సిఫారసు చేసినా, దాన్ని అప్పటి యుపిఏ ప్రభుత్వం ఆమోదించినా గరిష్టంగా 28.14% దాటలేదు. అప్పుడు కూడా కోతపడింది. గడచిన ఐదేళ్ళ గణాంకాలను చూసుకుంటే కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు చెల్లింపులు చేయడంలేదని స్పష్టమవుతోంది. సహకార సమాఖ్య స్ఫూర్తి గురించి మాట్లాడే కేంద్రం రాష్ట్రాలకు పన్నుల వాటా చెల్లించడంలో మాత్రం ఆ తీరులో వ్యవహరించడంలేదు. ఇలాంటి లోపాల కారణంగానే సిఎం కెసిఆర్ ఇటీవల సహకార సమాఖ్య స్ఫూర్తి వాస్తవంలో ప్రతిబింబించడంలేదని వ్యాఖ్యానించారు. రాష్ట్రం నుంచి సుమారు రూ. 50 వేల కోట్లను పన్నుల రూపంలో తీసుకుంటున్న కేంద్రం కేవలం రూ. 14 వేల కోట్లు కూడా ఇవ్వడంలేదని వ్యాఖ్యానించారు. ఆ వ్యాఖ్యలను బలపరిచే తీరులో సాక్షాత్తూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖే ఇటీవల లోక్‌సభలో టిఆర్ఎస్ ఎంపి అడిగిన ప్రశ్నకు సమాధానంగా లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చింది.

2015-16

మొత్తం రెవిన్యూ : రూ. 14,55,648 కోట్లు
రాష్ట్రాలకు చెల్లించిన వాటా : రూ. 5,06,192 కోట్లు (34.77%)
తెలంగాణ వాటా : రూ. 12,350 కోట్లు (2.43%)


2016-17

మొత్తం రెవిన్యూ : రూ. 17,15,822 కోట్లు
రాష్ట్రాలకు ఇచ్చిన వాటా : రూ.6,08,000 కోట్లు (35.43%)
తెలంగాణ వాటా : రూ. 14,876 కోట్లు (2.44%)

2017-18

మొత్తం రెవిన్యూ : రూ. 18,84,788 కోట్లు
రాష్ట్రాలకు ఇచ్చిన వాటా : రూ. 6,73,005 కోట్లు (35.70%)
తెలంగాణ వాటా : రూ. 16,420 కోట్లు (2.44%)

గ్రామాలలో విత్తనోత్పత్తి యూనిట్లు



మన తెలంగాణ/ హైదరాబాద్ : విత్తనోత్పత్తికి, ప్రాసెసింగ్‌కు దేశవ్యాప్తంగా 500 యూనిట్లను గ్రామ పంచాయతీ స్థాయిలో ఏర్పాటు చేయాలని కేంద్ర వ్యవసాయ శాఖ నిర్ణయించింది. ఇందుకు సంబంధించి రాష్ట్రాలు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని ఆదేశించింది. తెలంగాణలో 24 యూనిట్లు ఈ ఏడాది ఏర్పాటు చేయాలని ఆదేశించింది. గ్రామ పంచాయితీ స్థాయిలో ఏర్పాటు చేసే విత్తన యూనిట్లలో 500 మెట్రిక్ టన్నుల స్టోరేజి గోడౌన్‌లు ఒక్కొక్కటి రూ. 60 లక్షలతో నిర్మించనుంది. దేశవ్యాప్తంగా మొత్తంగా రూ. 300 కోట్లు ఖర్చు కానుండగా రాష్ట్రానికి సంబంధించి ఇప్పటికే రూ. 14.40 కోట్లు విడుదల చేసినట్లు తెలిసింది. రైతు ఉత్పత్తి సంస్థలు (ఎఫ్‌పిఒ), రైతు విత్తన ఉత్పత్తి సంస్థలు, స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో విత్తనోత్పత్తి యూనిట్లు పనిచేయనున్నాయి. యూనిట్ల ఏర్పాటుకు ముందు రైతులకు విత్తనోత్పత్తి, ప్రాసెసింగ్, స్టోరేజ్‌లపై అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనుంది. తొలుత వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాలలో రైతు ఉత్పత్తి సంస్థలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ విత్తన, సేంద్రియ ధృవీకరణ అథారిటీ ఆధ్వర్యంలో విత్తనోత్పత్తి కేంద్రాలను ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తును ఇప్పటికే ప్రారంభించింది. అలాగే పప్పు ధాన్యాలలో స్వయం సమృద్ధి సాధించేందుకు, మెరుగైన, హైబ్రీడ్ విత్తనాల వినియోగం పెంచేందుకు 150 విత్తన హబ్‌లను ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఒక్కొక్క విత్తన హబ్ 1000 క్వింటాళ్ల చొప్పున 1.50 లక్షల క్వింటాళ్ల పప్పు ధాన్యాల విత్తనాలను ఉత్పత్తి చేయనుంది. అగ్రికల్చర్ టెక్నాలజీ అప్లికేషన్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్స్ ఈ పథకం అమలునకు సహకరించనున్నాయి.

కొత్త ఎఫ్‌పిఒల ఏర్పాటులో మతలబేంటి?

రైతు ఉత్పత్తి సంస్థ (ఎఫ్‌పిఒ)ల ఆధ్వర్యంలో గ్రామ పంచాయితీ స్థాయిలో ఏర్పాటు చేసే విత్తనోత్పత్తి యూనిట్లు నడవాలని కేంద్రం రాష్ట్రానికి సూచించింది. రాష్ట్రంలో దాదాపు 75 ఎఫ్‌పిఒలు పనిచేస్తున్నట్లు నాబార్డు అధికారులు 'మన తెలంగాణ'కు చెప్పారు. అయితే రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రస్తుతం ఉన్నవాటికి కాకుండా రాష్ట్ర విత్తన ధృవీకరణ సంస్థ ఆధ్వర్యంలో కొత్తగా 10 ఎఫ్‌పిఒల ఏర్పాటు చేసి వాటి ఆధ్వర్యంలోనే విత్తనోత్పత్తి చేపట్టేందుకు అనుమతివ్వడంపై విమర్శలు వస్తున్నాయి.

నగర పోలీసు కమిషనర్‌గా అంజనీకుమార్

• రాష్ట్రంలో 38 మంది ఐపిఎస్‌ల బదిలీలు

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలో భారీ స్థాయిలో ఐపిఎస్‌ల బదిలీలు జరిగాయి. అదనపు డిజిపి మొదలు జిల్లా ఎస్పి వరకు మొత్తం 38 మందిని బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్‌గా 1990 బ్యాచ్‌కు చెందిన అంజనీకుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్ కె జోషి ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అంజనీకుమార్ ప్రస్తుతం అదనపు డిజిపిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. పూర్తి అదనపు బాధ్యతలతో ఈ బాధ్యతలు నిర్వహిస్తున్న అదనపు కమిషనర్ వివి శ్రీనివాసరావును తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్‌గా నియమించారు. స్పెషల్ ఇంటెలిజెన్స్ ఐజిగా ఉన్న విసి సజ్జనార్‌ను సైబరాబాద్ పోలీసు కమిషనర్‌గా నియమించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేస్తున్న సందీప్ శాండిల్యను రైల్వే, రోడ్డు సేఫ్టీ అదనపు డిజిపిగా నియమించారు. ఆ స్థానంలో ఉన్న కృష్ణప్రసాద్‌ను రోడ్డు సేఫ్టీ అథారిటీ డిజిగా బదిలీచేశారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్నసంతోష్ మెహ్రాను రాష్ట్ర పోలీసు అకాడమీ డైరెక్టర్‌గా బదిలీ చేసి అక్కడ ఉన్న జితేందర్‌ను శాంతి భద్రతల విభాగం అదనపు డిజిపిగా నియమించారు. అనిల్‌కుమార్‌ను హైదరాబాద్ నగర ట్రాఫిక్ విభాగం అదనపు కమిషనర్‌గా నియమించారు. డిఎస్ చౌహాన్‌ను హైదరాబాద్ నగర అదనపు పోలీసు కమిషనర్‌గా నియమించారు. వరంగల్ నగర పోలీసు కమిషనర్‌గా ఉన్న జి.సుధీర్‌బాబును రాచకొండ సంయుక్త పోలీసు కమిషనర్‌గా బదిలీ చేశారు. అక్కడి తరుణ్‌జోషిని నగర స్పెషల్ బ్రాంచ్ సంయుక్త కమిషనర్‌గా నియమించారు. సిద్దిపేట పోలీసు కమిషనర్‌గా పనిచేస్తున్న శివకుమార్‌ను ఇంటెలిజెన్స్ ఎస్పిగా బదిలీ చేశారు. ఆ స్థానంలో హైదరాబాద్ సెంట్రల్ జోన్ డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న జోయల్ డేవిస్‌ను నియమించారు. నగర ట్రాఫిక్ సంయుక్త పోలీసు కమిషనర్‌గా ఉన్న రవీందర్‌ను వరంగల్ నగర పోలీసు క మిషనర్‌గా బదిలీ చేశారు. అక్కడి సుధీర్‌బాబు రాచకొండ సంయుక్త కమిషనర్‌గా బదిలీ అయ్యారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా ఉన్న శివధర్‌రెడ్డిని రాష్ట్ర పోలీసు అకాడమీ అదనపు డైరెక్టర్‌గా నియమించారు. ఎస్పి శ్రీనివాసులును సిఐడి ఎస్పీగా, రమా రాజేశ్వరిని గద్వాల జిలిలా ఎస్పీగా బదిలీ చేసి అక్కడి విజయకుమార్‌ను గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్‌గా బదిలీ చేశారు. ఆ స్థనంలో ఉన్న రమేష్‌ను హైదరాబాద్ ఈస్ట్ జోన్ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఆ స్థాన ంలో ఉన్న శశిధర్‌రాజును చీఫ్ ఆఫీస్‌లో రిపోర్టు చేయాల్సిందిగా పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా ఎస్పీగా ఉన్న అనంతశర్మను రాష్ట్ర పోలీసు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. పోలీసు సంక్షేమ విభాగ ఐజి సౌమ్యా మిశ్రాను కొన్ని బాధ్యతలు తగ్గిస్తూ అక్కడే ఉంచారు. అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్‌గా ఉన్న రాజీవ్ రతన్‌ను పోలీసు ఆర్గనైజేషన్ అదనపు డిజిపిగా బదిలీ చేయగా ఆ స్థానంలో ఎం. గోపీకృష్ణను నియమించారు. క్రైమ్స్ ‘సిట్’ అదనపు కమిషనర్‌గా ఉన్న స్వాతి లక్రాను మహిళా భద్రత, ‘షి’ టీమ్, భరోసా విభాగాలకు ఐజిగా నియమించారు. ఆ స్థానంలో సిఐడి ఐజి శిఖా గోయల్‌ను నియమించారు. వెస్ట్‌జోన్ డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న వెంకటేశ్వరరావును మాదాపూర్ జోన్ డిప్యూటీ కమిషనర్‌గా నియమించి, విశ్వప్రసాద్‌ను సెంట్రల్ జోన్ డిసిగా నియమించారు.

ఎంఆర్‌పిఎస్ బంద్ వాయిదా

మన తెలంగాణ/ హైదరాబాద్ : ఎస్‌సి వర్గీకరణ డిమాండ్ చేస్తూ ఈ నెల 13న తలపెట్టిన రాష్ట్ర బంద్‌ను వాయిదా వేస్తున్నట్లు ఎమ్‌ఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తెలిపారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. బంద్ రోజు జిల్లా, మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహిస్తామన్నారు. అంతకుముందు మంత్రి కడియం శ్రీహరి బంద్‌ను వాయిదా వేసుకోవాలని కోరారు.

పెళ్లి చేసుకున్న రెండు నెలలకే తలాఖ్

మన తెలంగాణ/ చార్మినార్: దేశంలో ట్రిబుల్ తలాఖ్ విషయం చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో పాతబస్తీకి చెందిన ఓ వ్యక్తి పెండ్లి చేసుకున్న రెండు నెలలకే తన భార్యకు విడాకుల నామా సమర్పించడంతో ఒక్కసారిగా కలకల రేగింది.మహిళా సంఘాలతోపాటు భాదితురాలు రెయిన్‌బజార్ పోలీసులను ఆశ్రయించారు. విచారణ చేపట్టిన అతనిపై కేసులు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ మహ్మద్ జావిద్ తెలిపిన వివరాల.. అమాన్ నగర్‌కు చెందిన బాబుమియా కుమార్తె ఇర్ఫాన్‌బేగం(26)కు యాకుత్‌పురా జఫర్ రోడ్డుకు చెందిన మహ్మద్ ఖాదర్(30)తో డిసెంబర్ 11వ తేది 2017లో వివాహం జరిగింది. వివాహం జరిగిన వారం రోజుల నుంచే భార్యపై మానసిక ఒత్తిడి చేయడంతోపాటు శారీరకంగా హింసిస్తున్నాడు. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో ఖాదర్ గత ఫిబ్రవరి నెలలో 25వ తేదిన భార్య ఇర్ఫాన్‌బేగంకు ఖాజీ సంతకంతో విడాకుల పత్రాన్ని పంపించగా ఆమెకు ఈ నెల 7వ తేదిన అందింది. దీంతో ఆమె 9వ తేదిన షాహీన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో కలిసి రెయిన్‌బజార్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు భర్త ఖాదర్‌ఖాన్‌ను విచారించగా పెండ్లి జరిగిన సమయం నుంచే ఇర్ఫాన్‌బేగం తాను నచ్చలేదని చేతులు కోసుకోవడంతోపాటు ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తుంటే వారి తల్లిదండ్రులకు సమాచారం అందించానని అతడు తెలిపాడు. వారి అనుమతితోనే డైవర్స్ డిక్లరేషన్ (విడాకుల పత్రం)పై ఇర్ఫాన్ బేగంతోపాటు ఆమె తండ్రిబాబుమియా, తల్లి కౌసర్‌బేగంతో పాటు సోదరుడు కూడా సంతకాలు చేశారని ఆయన పోలీసులకు తెలిపాడు. వారి అంగీకారంతోనే విడాకులు తీసుకున్నట్లు అతడు తెలుపగా, ఇర్ఫాన్‌బేగం ఆమె కుటుంబ సభ్యులు మాత్రం మాయమాటలు చెప్పి తమతో సంతకాలు తీసుకున్నారని తెలిపారు. దీంతో పోలీసులు ఖాదర్‌పై 498, 417, 420 కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వచ్ఛ గ్రామీణం దిశగా అడుగులు



- **బహిరంగ మలమూత్ర విసర్జన నుంచి 1,192 గ్రామ పంచాయతీలకు విముక్తి**
- **రూ.191.86కోట్లతో మరో 1,38,982 మరుగుదొడ్ల నిర్మాణం**

మన తెలంగాణ/ హైదరాబాద్ : స్వచ్ఛ గ్రామీణం దిశగా సర్కారు వడివడిగా అడుగులు వేస్తోంది. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఆవాసాలన్నింటిని బహిరంగ మల మూత్ర విసర్జన నుంచి విముక్తి కలిగించే పనిని రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. గ్రామాల్లో ఆరుబయట మలవిసర్జన అవసరం లేకుండా పంచాయతిరాజ్ శాఖ ద్వారా బహిరంగ మలవిసర్జన రహిత (ఓడిఎఫ్) గ్రామాలుగా తీర్చిదిద్దే పనిపై దృష్టి పెట్టింది. రాష్ట్రంలోని మొత్తం 8684గ్రామ పంచాయతీలలో ఇప్పటి వరకు 1,192 గ్రామ పంచాయతీలు ఓడిఎఫ్‌గా మారాయి. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి సౌకర్యాన్ని కల్పించింది. మిగిలిన గ్రామపంచాయతీలను కూడా ఓడిఎఫ్‌గా తీర్చిదిద్దే కార్యక్రమం వేగంగా జరుగుతోంది. గ్రామపంచాయతీలలో సర్కారు ప్రాంతాలలో మరుగుదొడ్ల నిర్మాణం పనులను చేపడుతున్నారు అధికారులు. మరో 1,38,982 మరుగుదొడ్లను నిర్మించాల్సి ఉందని గుర్తించి వీటి నిర్మాణాలకు రూ. 191.86 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటిలో మరుగుదొడ్లు లేని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో రూ.1.26 కోట్లతో 79,078 మరుగుదొడ్లు, మండల ప్రజాపరిషత్ కార్యాలయాల్లో రూ.1.63 కోట్లతో 247, తహసిల్దార్ కార్యాలయాల్లో రూ.1.10 కోట్లతో 287, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రూ.5.89 కోట్లతో 912, ఆరోగ్య ఉపకేంద్రాల్లో రూ.8.23 కోట్లతో 1,603 మరుగుదొడ్లను నిర్మించాలని ప్రతిపాదించారు. అలాగే సంక్షేమ హాస్టళ్లలో రూ.24.12 కోట్లతో 2,165 మరుగుదొడ్లు, బస్‌స్టేషన్లలో రూ.8.36 కోట్లతో 51,462, మార్కెట్లలో రూ.4.56 కోట్లతో 730, గ్రంథాలయాల్లో రూ.2.32 కోట్లతో 485, ఇతర ప్రభుత్వ భవనాల్లో రూ.9.65 కోట్లతో 2,103 మరుగుదొడ్లను నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధంచేశారు.

70 ఏళ్లలో దళితుల పరిస్థితి మారలేదు

• ఐక్యంగా ఉద్యమిస్తేనే రాజ్యాంగ ఫలాలు అందుతాయి: కేంద్ర, రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్లు

మన తెలంగాణ / హైదరాబాద్ : స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లైనా దళితుల పరిస్థితిలో మార్పు రాలేదని జాతీయ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ సభ్యుడు రాములు, రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ ఎర్రోళ్ళ శ్రీనివాస్ అభిప్రాయం వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో దళితులకు కల్పించిన హక్కులు, ఫలాలు సాకారం కావాలంటే అంబేద్కర్ ఉద్యమ స్ఫూర్తితో యువత ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ‘భారత రాజ్యాంగం–ఎస్‌సి, ఎస్‌టి సామాజిక, ఆర్థిక సమానత్వం’ అనే అంశంపై జరిగిన సదస్సుకు జాతీయ ఎస్‌సి కమిషన్ సభ్యులు రాములు మాట్లాడుతూ, గతంలో ఎస్‌సి, ఎస్‌టి కమిషన్లు కేవలం సర్వీస్ మ్యాటర్‌లకే పరిమితం అయ్యేవని, అయితే ప్రస్తుత కమిషన్ దళితుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాయని అన్నారు. అంబేద్కర్ ఆలోచనా విధానంతో పనిచేస్తున్నామని చెప్పినప్పటికీ ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా దళితులకు నిధులు ఖర్చుపెట్టడంలేదని అన్నారు. ఏ సమస్య ఉన్నా తన దగ్గరకు రావాలని, 24 గంటల్లో పరిష్కరిస్తానని చెప్పారు. సమాజంలో మార్పు తేవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ ఎ ర్రోళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ దళితులకు రాజ్యాంగపరంగా రావాల్సిన హక్కులు, ఫలాలు రావడం లేదని, యథేచ్ఛగా చట్టాల ఉల్లంఘన జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కులాలను సమాజం పెంచి పోషిస్తోందని, అంటరానితనం, అత్యాచారాలు, దాడులు ఇప్పటికీ జరుగుతూనే ఉన్నాయన్నారు. రాజ్యాంగం, చట్టాలు అమలు కావడం లేదని, చట్టాల ఉల్లంఘన యథేచ్ఛగా జరుగుతోందని దళితుల్లో ఐక్యత లేక కులాలు, వర్గాలుగా విడిపోవడమే ఇందుకు ప్రధాన కారణమని అన్నారు. సబ్‌ప్లాన్ నిధులు 100 శాతం అమలైతే దళితులు గర్వంగా తలెత్తుకొని జీవిస్తారన్నారు. సమైక్య రాష్ట్రంలో కమిషన్ ఉందనే విషయమే చాలా మందికి తెలియదని అన్నారు. జెబి రాజు మాట్లాడుతూ పాలకుల డివైడ్ అండ్ రూల్ కారణంగా దళిత ఉద్యమాలు బలహీనపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మాల మాదిగలు విడిపోయి అనేక సంఘాలు పుట్టుకొచ్చాయని, దీని వల్ల ఐక్యత లేకుండా పోయిందన్నారు.



బాల నేరస్థులకు పునరావాసం : దీపక్ మిశ్రా

కటక్: బాల నేరస్తులకు సమాజం సరైన పునరావాస కార్యక్రమాలు కల్పించడం ద్వారా వారిని జన జీవన స్రవంతిలోకి తీసుకు రావొచ్చని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా పేర్కొన్నారు. ఆదివారం కటక్‌లో జరిగిన 'జువెనల్ జస్టిస్: ఇష్యూ అండ్ చాలెంజెస్' రాష్ట్రస్థాయి సదస్సులో ఆయన మాట్లాడారు. కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, సమాజం తమను సరిగా చూడరని బాల నేరస్థులు అనేకసార్లు భావిస్తారన్నారు. బాల నేరస్థులకు కుటుంబం, ఎన్‌జిఒలు, సంబంధిత అధికారులు పునరావాసం కల్పించి వారిని జనజీవన స్రవంతిలోకి తీసుకురావాలని ప్రధాన న్యాయమూర్తి నొక్కి చెప్పారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వానిది కూడా ప్రధాన పాత్ర అని పేర్కొన్నారు. బాల నేరస్థుల చట్ట నియమ, నిబంధనలను ఒడిషా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వినీత్ సరన్ వివరించారు.

జైలులో ఖైదీల సెల్ఫీ

ముజఫర్‌నగర్ : ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లా జైలులో విచార ణ ఖైదీలుగా ఉన్న ముగ్గురిపై మరో కేసు నమోదయింది. జైలు ఆవరణలోనే వారు మొబైల్ ఫోన్‌లో సెల్ఫీ దిగి ఆ చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో ముగ్గురు విచారణ ఖైదీలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఖైదీలు జైలులో స్మార్ట్ ఫోన్‌ను ఉపయోగిస్తూ ఫొటోలు తీసుకుంటూ శనివారం ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేశారని, వాటిని సీజ్ చేసినట్లు మేజిస్ట్రేట్ తెలిపారు. ఖైదీలపై కేసు రిజిష్టర్ చేశామన్నారు.

కేంద్రంలో సంతోష్ కీలక పాత్ర

● సిఎం కెసిఆర్‌కు అత్యంత విశ్వాసపాత్రుడు ● ఫ్రంట్ ఏర్పాటు, సమన్వయ కమిటీలో ప్రధాన భూమిక?



మన తెలంగాణ / హైదరాబాద్ : ఊహించినట్లుగానే అత్యంత సన్నిహితుడైన జోగినపల్లి సంతోష్‌కుమార్‌ను సిఎం కెసిఆర్ రాజ్యసభకు పంపుతున్నారు. ఇటీవలి కాలంలో తెలుగు రాష్ట్రాల తరపున రాజ్యసభకు ఎంపికైనవారిలో అతి పిన్న వయస్కుడు సంతోషే. ఆత్మీయుడిగా, విశ్వాసపాత్రుడిగా గుర్తింపు పొందిన సంతోష్ ఇకపైన ఢిల్లీలో కెసిఆర్ పాత్రను పోషించనున్నారు. కెసిఆర్ ఆదేశాలను తు.చ.తప్పకుండా అమలుచేసే వ్యక్తిగా ఢిల్లీ స్థాయిలో సంతోష్ నిలవనున్నారు.త్వరలో జాతీయ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించనున్నట్లు, ప్రబల మార్పు దిశగా చొరవ తీసుకోనున్నట్లు ముఖ్యమంత్రి ఇటీవల ప్రకటన చేసిన నేపథ్యంలో సంతోష్‌కుమార్‌ను రాజ్యసభకు పంపాలని నిర్ణయం తీసుకోవడం గమనార్హం. కాంగ్రెసేతర, బిజెపియేతర పార్టీలతో ఫ్రంట్‌ను ఏర్పాటు చేసే దిశగా ఒక సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని భావిస్తున్న కెసిఆర్ అందులో సంతోష్‌కు కూడా భాగస్వామ్యం ఇవ్వాలని భావిస్తున్నట్లు సమాచారం. సరిగ్గా ఇదే సమయంలో ఆయనను రాజ్యసభ సభ్యుడిగా పంపి ఫ్రంట్ ఏర్పాట్లలో ఆయనకు బరువైన బాధ్యతలను అప్పజెప్పే అవకాశాలున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. కేంద్రానికీ, రాష్ట్రానికీ మధ్య వారధిగా మాత్రమే కాకుండా ఫ్రంట్ రాజకీయాల్లో జాతీయ స్థాయి, ప్రాంతీయస్థాయిల్లో ఆయన సేవలు ఎంతగానో ఉపయోగపడతాయని పార్టీ భావిస్తోంది. దీర్ఘకాలంగా కెసిఆర్‌కు సన్నిహితంగా ఉంటూ ఉద్యమం సమయంలో ఆయన ఆలోచనలకు అనుగుణంగా వ్యవహరించడంలో సంతోష్‌కుమా ర్ విశ్వసపాత్రుడిగా గుర్తింపు పొందారు. 'పార్టీలో దీర్ఘకాలం నుంచి నాతో ఉన్నాడు. ఎన్నో అంశాల్లో నాకు చేదోడువాదోడుగా ఉన్నాడు. 2009లో ఉద్యమం ఉధృతంగా నడుస్తున్నప్పుడు, ముఖ్యంగా దీక్షా సమయంలో నాకు ఎన్నో రకాలుగా సహాయపడ్డాడు. సమయానికి మాత్రలు ఇవ్వడం మొదలుకుని ఎంతో సేవ చేశాడు..' అని టిఆర్‌ఎస్ ఎమ్ఎల్‌ఎలు, ఎమ్ఎల్‌సిలు, ఎంపిలతో సమావేశం సందర్భంగా కెసిఆర్ వ్యాఖ్యానించినట్లు తెలిసింది. కెసిఆర్ ఆలోచనలను అదే స్థాయిలో అర్థం చేసుకుని అమలుచేయడంలో సంతోష్ తనదైన సామర్థ్యాన్ని చాటుకున్నారు. జాతీయ రాజకీయాలపై కెసిఆర్ దృష్టి సారిస్తున్న సమయంలో వివిధ పార్టీలతో సమన్వయం చేయడంలో, కెసిఆర్ ఆలోచనలకు అనుగుణంగా కార్యాచరణ చేపట్టడంలో ఇకపైన సంతోష్ క్రియాశీలకంగా వ్యవహరించనున్నారు. కుమార్తె కవిత ఇప్పటికే ఎంపిగా ఉన్నప్పటికీ నియోజకవర్గంపై దృష్టి సారించాల్సిన నేపథ్యంలో రాజ్యసభ సభ్యుడిగా సంతోష్ ఇకపైన కెసిఆర్ ఆదేశాల మేరకు పనిచేయనున్నారు. దీర్ఘకాలంగా కెసిఆర్‌తో సన్నిహితంగా ఉంటూ అతి దగ్గరి నుంచి ఆయన ఆలోచనలను గమనిస్తూ ఉన్న సంతోష్ ఏ సమయంలో ఎలా వ్యవహరించాలో, అప్పజెప్పిన కర్తవ్యాన్ని ఏ విధం గా పూర్తిచేయాలో, ఆయన మనసులోని ఆలోచనను సరి గ్గా అదే స్థాయిలో అర్థం చేసుకోవడంలో దిట్ట. రాజ్యసభ లో పోషించే పాత్రకంటే పార్టీకి ఢిల్లీ స్థాయిలో, ముఖ్యం గా ఫ్రంట్ రాజకీయాల్లో పోషించాల్సిన పాత్రే ఎక్కువగా ఉంటుందని పార్టీ వర్గాల అభిప్రాయం. ఢిల్లీ, కోల్‌కతా, ముంబాయ్, చెన్నయ్, బెంగుళూరు తదితర నగరాల్లో ఫ్రంట్ సమావేశాలను నిర్వహించనున్నట్లు కెసిఆర్ ఇప్పటికే ప్రకటించినందున ఆ వేదికల్లో ప్రాంతీయ పార్టీలతో సంబంధాలను ఏర్పర్చడంలో, సమావేశాల నిర్వహణలో సంతోష్ 'ఫ్రంట్ సమన్వయకర్త'గా ఇకపైన భిన్నమైన పాత్రను పోషించనున్నారు. పార్టీకి దీర్ఘకాలంగా సేవలందించిన సంతోష్‌ను తగిన గౌరవంతో గుర్తించాల్సిన అవసరంపై పార్టీలో చర్చ జరిగినప్పుడు చాలా మంది సంతో ష్ పేరును ఏకగ్రీవగంగా ప్రతిపాదించినట్లు ఇటీవలి వార్తలు వచ్చాయి. వివాద రహితుడనే గుర్తింపుతో పాటు పార్టీలో అందరితో కలుపుగోలుగా వ్యవహరిస్తారనే గుర్తింపు కూడా ఉంది. కెసిఆర్ హైదరాబాద్‌లో ఉన్నప్పటికీ ఆయన ఆలోచనలకు అనుగుణంగా ఉండే సంతోష్ ఢిల్లీలో ఉండడమంటే అక్కడ కూడా కెసిఆర్ ఉన్నట్లేనని పార్టీ నాయకులు వ్యాఖ్యానించారు.

నేడు గుత్తా బాధ్యతల స్వీకరణ

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్‌గా నియమితులైన గుత్తా సుఖేందర్ రెడ్డి సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నారు. బషీర్‌బాగ్‌లోని వ్యవసాయ కమిషనరేట్‌లో కార్యాలయంలో ఆయన కోసం ఏర్పాటు చేసిన చాంబర్‌లో బాధ్యతలను తీసుకోనున్నారు. ఈ కార్యక్రమానికి సిఎం కె.చంద్రశేఖర్‌రావు హాజరు అయ్యే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి.

నామినేషన్లకు నేడు ఆఖరి రోజు

మన తెలంగాణ / హైదరాబాద్ : రాజ్యసభ నామినేషన్ల పర్వానికి నేటితో గడువు ముగియనుంది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటి (మార్చి 5న) నుంచి ఆదివారం వరకు ఒక్కరు కూడా నామినేషన్‌ను దాఖలు చేయలేదు. సోమవారంతో నామినేషన్ల ప్రక్రియకు చివరి రోజు కావడంతో తప్పనిసరిగా నామినేషన్లను దాఖలు చేయాల్సి ఉంటుంది.మూడు స్థానాలకు సంబంధించి ప్రధాన రాజకీయ పార్టీలు ఆదివారం తమ పార్టీ అభ్యర్థులను ప్రకటించడంతో చివరి రోజు నామినేషన్ల జోరుగా సాగనున్నాయి. తెలంగాణలో రాజ్యసభ సభ్యులైన సీఎం రమేష్, రాపోలు ఆనంద్‌భాస్కర్‌ల గడువు ఏప్రిల్ 2నతో ముగియనుండడం, అనారోగ్య కారణాల వల్ల పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి మృతి చెందడంతో ఈ ఖాళీలను భర్తీ చేయడానికి కేంద్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. టిఆర్‌ఎస్ ముగ్గురు అభ్యర్థులను ఆదివారం సాయంత్రం ప్రకటించింది. కాంగ్రెస్ కూడా అభ్యర్థిని బరిలోకి దింపనున్నట్లు ప్రకటించి అభ్యర్థి పేరును ఆదివారం పొద్దుపోయిన తర్వాత ప్రకటించింది. కాంగ్రెస్ తన అభ్యర్థిని రంగంలోకి దించకపోయినట్లయితే టిఆర్‌ఎస్ తరపున పోటీ చేస్తున్నముగ్గురు అభ్యర్థుల ఎన్నిక ఏకగ్రీవమయ్యేది. టిఆర్‌ఎస్ అభ్యర్థి సంతోష్ అసెంబ్లీ ఎదురుగా ఉన్న అమరవీరుల స్మారక స్థూపాన్ని సందర్శించి అమరులకు నివాళులర్పించి నామినేషన్‌ను దాఖలు చేయనున్నారు.

నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగం



మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగించనున్నారు. రాష్ట్ర అసెంబ్లీలో ఉదయం పది గంటలకు గవర్నర్ ప్రసంగం అయిపోయిన తర్వాత ఈ సమావేశాలను ఎన్ని రోజులు నిర్వహించాలనే అంశంపై బిజినెస్ అడ్వయిజరీ కమిటీ (బిఏసి) సమావేశమై నిర్ణయం తీసుకుంటుంది. ఈ నెలాఖరు వరకు సమావేశాలు జరిగే అవకాశం ఉన్నట్లు అధికార పార్టీ వర్గాలు తెలిపాయి. గవర్నర్ ప్రసంగం ముగియగానే తొలిరోజు సమావేశాలు వాయిదా పడతాయి. ఆ తర్వాత రెండు రోజుల పాటు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరగనుంది. గవర్నర్ ప్రసంగానికి అడ్డు తగిలిన విపక్ష సభ్యులను ఈ సెషన్ మొత్తానికి సస్పెండ్ చేయనున్నట్లు ముఖ్యమంత్రి కెసిఆర్ వ్యాఖ్యానించడం గమనార్హం. గవర్నర్ ప్రసంగం చేసే సమయంలో అడ్డుకునే తీరులో వ్యవహరించినట్లయితే సస్పెండ్‌కు గురై ప్రభుత్వాన్ని నిలదీయడానికి అవకాశం ఉండదన్న ఉద్దేశంతో విపక్షాలు ఒకింత జాగ్రత్తగా వ్యవహరించే అవకాశం ఉంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు జరుగుతున్న తొలి పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాలు కాబట్టి ఈ నాలుగేళ్ళలో సాధించిన ఫలితాలను ప్రభుత్వం వివరించనుంది. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలతో పాటు గత అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఇచ్చిన హామీలపై ప్రభుత్వాన్ని నిలదీయడానికి విపక్షాలు సన్నద్ధమవుతున్నాయి. అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో నాలుగు కి.మి. మేర నిరసనలు, ర్యాలీలు, ఆందోళనలు జరగకుండా పోలీసులు నిషేధాజ్ఞలు విధించారు.

ఉత్కంఠభరితంగా సాగిన 'స్పెల్ బీ'

సత్తా చాటిన నారాయణ విద్యార్థులు

మనతెలంగాణ/హైదరాబాద్ : 'స్పెల్ బీ' కాంటెస్ట్‌లో నారాయణ విద్యార్థులు అడుగడుగునా ఆసక్తి ప్రదర్శించారు. నారాయణ స్కూల్స్, ఓరియంట్ బ్లాక్ స్వాన్ ఆధ్వర్యంలో అతిపెద్ద స్పెల్ బీ కాంటెస్ట్ శిల్ప కళావేదికలో అట్టహాసంగా జరిగింది. ఈ కాంటెస్ట్‌లో సీనియర్ విభాగం నుంచి శ్రీజ(విజయవాడ) మొదటి బహుమతి గెలుచుకోగా, మనోజ్ఞ(సికింద్రాబాద్) రెండవ బహుమతి, తన్విక్ రెడ్డి(కూకట్‌పల్లి) మూడవ బహుమతి కైవసం చేసుకున్నారని నారాయణ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.సింధూర నారాయణ తెలిపారు. జూనియర్ విభాగం నుంచి హాసిని(హైటెక్ సిటి) మొదటి బహుమతి గెలుచుకోగా, దనుష్(సికింద్రాబాద్) రెండవ బహుమతి కైవసం చేసుకున్నారన్నారు. అలాగే శ్రీహర్ష(నారాయణగూడ) మూడవ బహుమతి దక్కించుకున్నారని తెలిపారు. సబ్ జూనియర్ విభాగం నుంచి శ్రీవర్ష(గూడూరు) మొదటి బహుమతి, కృష్ణకౌశిక్(నారాయణగూడ) రెండవ బహుమతి, డి.సంజన(భీమవరం) మూడవ బహుమతి దక్కించుకున్నారన్నారు. ఈ కాంటెస్ట్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని నారాయణ స్కూల్స్ నుంచి సుమారు 600 మంది విద్యార్థులు పాల్గొన్నారని పేర్కొన్నారు. రాష్ట్ర, జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో ఏ పోటీ పరీక్ష నిర్వహించినా నారాయణ విద్యార్థులు ముందువసరుసలో ఉంటున్నారన్నారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించిన క్రికెట్ వ్యాఖ్యాత హర్ష బోగ్లే విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో నారాయణ డైరెక్టర్ కె.పునీత్, డీన్స్, ప్రిన్సిపాల్స్, టీచర్స్, సిబ్బందితో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



టిఆర్‌ఎస్ రాజ్యసభ అభ్యర్థులు వీరే

మన తెలంగాణ/హైదరాబాద్: టిఆర్‌ఎస్ రాజ్యసభ అభ్యర్థులుగా జోగినిపల్లి సంతోష్‌కుమార్, బండ ప్రకాశ్ ముదిరాజ్, బడుగుల లింగయ్య యాదవ్ పేర్లను సిఎం కె.చంద్రశేఖర్‌రావుప్రకటించారు.తెలంగాణభవన్‌లో ఆదివారం జరిగిన శాసనసభాపక్షసమావేశంలో కెసి ఆర్ ఆ ముగ్గురు అభ్యర్థులను ఎంపిలు,ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలకు పరిచయం చేశారు. రాజ్యసభ ఎన్ని కల ఏర్పాట్ల బాధ్యతలను మంత్రులు కడియం శ్రీహరి, కెటి ఆర్, ఈటల రాజేం దర్, జగదీశ్‌రెడ్డిలకు సిఎం అప్ప గించారు. అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను సోమవారం దాఖలు చేయనున్నారు. కెసిఆర్ సన్నిహితుడైన సంతోష్ కుమా ర్‌కు రాజ్యసభ అవకాశం లభిస్తుందని ముందు నుంచే ప్రచారం జరుగుతున్నా మిగిలిన ఇద్దరు అభ్యర్థులెవరనేదానిపైఉత్కంఠ కొనసాగింది. యాద వు లకు చెందిన ఒకరికి రాజ్యసభ అభ్యర్థిగా అవకాశం ఇస్తామని సిఎం కెసిఆర్ ఇప్ప టికే హామీ ఇవ్వడంతో ఆ సామాజికవర్గానికి చెందిన నలుగురైదుగురి పేర్లు విని పించాయి. మరోస్థానాన్ని ఏసామాజిక వర్గానికి అప్పగిస్తారనే అంశంపై ఉత్కంఠ నెలకొన్నది.ఒక దశలో కొందరు నేతలు తాము నామినేషన్ వేసేందుకు సిద్ధంగానే ఉన్నామనే సంకేతాలు కూడా ఇచ్చారు.కానీ చివరి నిమిషంలో ఎవరూ ఊహించని తరహాలో అనూహ్యంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి బడుగుల లింగ య్య యాదవ్, వరంగల్ జిల్లా నుంచి బండ ప్రకాశ్ పేర్లు తెరమీదకు వచ్చాయి.టిఆర్‌ఎస్ ఆవిర్భావం నుంచీ జోగినిపల్లి సంతోష్ కుమా ర్ కెసిఆర్ వెంటే ఉన్నారు. కెసిఆర్‌కు వ్యక్తిగత సహాయకునిగా ఉంటూ పార్టీ అంతరంగిక వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించారు.కెసిఆర్ వ్యూహాలను, సూచనలను అమలు చేసేవారు. పైగా పార్టీకి, కార్యకర్తలకు కెసిఆర్‌కు మధ్య సమన్వయ కర్తగా వ్యవహరించారు. ఉద్యమ సమయంలోనూ కెసిఆర్‌ను అంటి పెట్టుకుని ఉన్నారు. తనను రాజ్యసభ అభ్యర్థిగా ప్రకటించడం పట్ల సంతోష్ కుమార్ సిఎంకెసిఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.టిఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వరంగల్ జిల్లాకు చెందిన డా.బండ ప్రకాశ్ ముదిరాజ్ 1981–84లో వరంగల్ మున్సిపల్ వైస్ ఛైర్మన్‌గా పనిచేశారు.కాకతీయ పట్టణాబివృద్ధి సంస్థసభ్యులుగాను, అజాం జాహి మిల్స్ వర్కర్స్ యూనియ న్ వరంగల్ అధ్యక్షునిగాను పనిచేశారు. అలాగే తెలం గాణ ముదిరాజ్ మహాసభ అధ్యక్షులుగాను,తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నారు. మూడవ అభ్యర్థిగా ప్రకటించిన నల్లగొండ జిల్లా కు చెందిన బడుగుల లింగయ్య యాదవ్ సుదర్ఘీకా లం టిడిపిలో పనిచేశారు.1982 సంవ త్సరంలో టిడిపి ఆవిర్భావం తో రాజకీయ ప్రవేశం చేసి 1985–87కేతేపల్లి మం డల తెలుగు యువత అధ్యక్షుడిగా వ్యవహరించారు. సుమా రు 11ఏళ్ల పాటు టిడిపి నల్లగొండ జిల్లా అధ్యక్షునిగా పనిచేశారు. 2009 లో మహాకూటమి తరపున స్థానిక సంస్థల నియోజకవర్గ ఎంఎల్‌సిగా పోటీచేసి26ఓట్లతో ఓటమి చెందారు.అనంతరం2015మార్చి16నటిఆర్‌ఎస్‌లో చేరారు.

కెసిఆర్‌కు రుణపడి ఉంటాం : తమను రాజ్యసభ అభ్యర్థులుగా ప్రకటించడం పట్ల అభ్యర్థులు బండ ప్రకాశ్, బడుగుల లింగయ్య యాదవ్‌లు సిఎం కెసిఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కెసిఆర్ భారతదేశ దిక్సూచి అని, రెండు సీట్లను కూడాబిసిలకు కేటాయించడం సామాజిక న్యాయానికి గొప్ప ప్రతీక అని చెప్పారు.

కాంగ్రెస్ అభ్యర్థి బలరామ్‌నాయక్



తెలంగాణ రాష్ట్ర కోటాలోజరగనున్న రాజ్యసభ ఎన్నిక ల్లో కాంగ్రెస్ తరపున మాజీ కేంద్ర మంత్రి పి.బల రామ్‌నాయక్ పోటీ చేయనున్నారు. ఈమేరకు ఎఐ సిసి ఆదివారం ప్రకటన విడుదల చేసింది.తమకు తగిన సంఖ్య బలం లేక పోయినా అభ్యర్థిని నిలబెడతామని మూడు రోజుల క్రితమే పిసిసి అధ్యక్షులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఆ పార్టీలో సుమారు డజను మందికి పైగా ఆసక్తి చూపారు.ప్రధానంగానల్లగొండజిల్లాకు చెందిన సీనియర్ నేత గూడురు నారాయాణరెడ్డి పేరు దాదాపు ఖరారు అవుతుందని ప్రచార జరిగింది. కాని చివరి నిమిషంలో కాంగ్రెస్ అధిష్టానం బలరామ్ నాయక్ పేరును ఖరారు చేసింది.

అభ్యర్థుల బయోడేటా

పేరు: జోగినిపల్లి సంతోష్‌కుమార్
భార్య: జోగినిపల్లి రోహిణి
పిల్లలు: ఇషాన, శ్రేయాన్
వయస్సు : 42 సంవత్సరాలు
చదువు : ఎంబిఎ,
ఊరు : కొదురుపాక, బోయినపల్లి, చొప్పదండి నియోజకవర్గం, కరీంనగర్ జిల్లా,

పేరు: డా. బండ ప్రకాశ్ ముదిరాజ్
ఊరు: నందిని హిల్స్, హంటర్ రోడ్, హన్మకొండ వరంగల్
చదువు: పిహెచ్‌డి
వయసు: 63 సంవత్సరాలు

పేరు : బడుగుల లింగయ్య యాదవ్
భార్య నాగమణి, కొడుకు డాక్టర్ యశ్వంత్, కూతురు దీప్తి
వయస్సు: 58 సంవత్సరాలు
చదువు: బి.ఎ, బిఇడి
ఊరు: బీమారాం కేతేపల్లి, నల్లగొండ జిల్లా

మూడింట రెండు బిసిలకే!

కెసిఆర్ వ్యూహాత్మక నిర్ణయం

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలో ఖాళీ అవుతున్న మూడు రాజ్యసభ పదవులకు టిఆర్‌ఎస్ తరపున పోటీచేస్తున్న ముగ్గురు అభ్యర్థుల్లో ఇద్దరు వెనకబడిన కులాలకు చెందినవారే. రాష్ట్ర బి.సి. జనాభాలో గణనీయ స్థాయిలో ఉన్న యాదవులకు ఒక రాజ్యసభ పదవి ఇస్తామని హామీ ఇచ్చినట్లుగానే సిఎం కెసిఆర్ నల్లగొండ జిల్లాకు చెందినబడుగుల లింగయ్య యాదవ్‌ను అభ్యర్థిగా ప్రకటించారు. మొదటి నుంచి ఊహిస్తున్నట్లుగానే సన్నిహితుడైన సంతోష్‌కుమార్‌ను కూడా అభ్యర్థిగా ప్రకటించారు. ఇక మూడవ అభ్యర్థి ఏ సామాజికవర్గానికి చెందినవారిని ప్రకటిస్తారోననే ఉత్కంఠ కొనసాగింది. కానీ దీన్ని కూడా బి.సి.లకే చెందిన బండి ప్రకాశ్ ముదిరాజ్‌కు ప్రకటించడంతో సస్పెన్స్ తొలగిపోయింది. రెడ్డి లేదా మైనారిటీ వర్గాలకు చెందినవారికి టికెట్ ఇచ్చే అవకాశం ఉందని వార్తలు వచ్చినా చివరకు రాష్ట్ర జనాభాలో ఎక్కువగా ఉన్న బి.సి.లోని ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన వ్యక్తినే అభ్యర్థిగా ప్రకటించడంతో విమర్శలు చేసే బి.సి. సంఘాల నేతల నోళ్ళకు తాళం వేసినట్లయింది. ఎవ్వరి ఊహకు అందని తీరులో కెసిఆర్ నిర్ణయం తీసుకున్నారు. నిజానికి లింగయ్య యాదవ్‌గానీ, ప్రకాశ్ ముదిరాజ్‌గానీ రాజ్యసభ టిక్కెట్ ఇవ్వాలని కెసిఆర్‌ను అడగనేలేదని, అలాంటి అవకాశం వస్తుందని ఊహించనూలేదని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. లింగయ్య యాదవ్ పేరు తొలుత వినిపించినా ఊహాగానంగానే ఉండిపోయిందని, అధికారికంగా ప్రకటించేంతవరకు పార్టీలో ఎవ్వరికీ తెలియదని పేర్కొన్నాయి. పదవులు వాటంతట అవిగానే వచ్చాయని ఆ ఇద్దరూ వ్యాఖ్యానించారు. ఇద్దరికీ రాజకీయ పూర్వ నేపథ్యం ఉన్నప్పటికీ రాజ్యసభ రేసులో ఉంటారనే చర్చలు కూడా పెద్దగా జరగలేదు. రాష్ట్రంలో ముదిరాజ్ సామాజికవర్గం కూడా బలమైనదిగానే గుర్తింపు ఉండడంతో ప్రకాశ్ ముదిరాజ్‌ను రాజ్యసభకు ఎంపిక చేయడం విశేషం. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ దాదాపు కనుమరుగైపోయినప్పటికీ అనేక జిల్లాల్లో క్షేత్రస్థాయిలో బిసి ఓటర్లు ఆ పార్టీకి కార్యకర్తలుగా ఉన్నందున ముగ్గురు అభ్యర్థుల్లో ఇద్దరినీ బిసికి చెందినవారినే కెసిఆర్ ఎంపిక చేయడంతో రానున్న ఎన్నికల్లో రాజకీయంగా కలిసొచ్చే అంశమవుతుంది.వెనకబడిన వర్గాల అభివృద్ధికి, కులవృత్తులను ప్రోత్సహించి ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నా ల్లో భాగంగా ఇద్దరు బిసిలకు రాజ్యసభ టిక్కెట్లు ఇవ్వడం పార్టీ వైఖరికి నిదర్శనమని నేతలు వ్యాఖ్యనించారు. రానున్నది సంక్షేమ బడ్జెట్ అని స్వయం గా ఆర్థిక మంత్రి వ్యాఖ్యానించినా బిసిల అభివృద్ధికి ప్రత్యేక సబ్ ప్లాన్ పెట్టాలని వివిధ సంఘాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఇద్దరు బిసిలను రాజ్యసభకు పంపుతుండడంతో అలాంటి విమర్శలకు మంగళం పలికినట్లయింది.

బిసి సంక్షేమ సంఘం హర్షం

టిఆర్‌ఎస్ పార్టీ రెండు రాజ్యసభ సీట్లను బిసిలకు కేటాయించడం పట్ల బిసి సంక్షేమ సంఘం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. టిఆర్‌ఎస్ పార్టీలో ఎంతో మంది పలుకుబడి కలిగిన నాయకులు ఉన్నప్పటికీ బిసి సామాజిక వర్గంలో, పేద కుటుంబాల నుండి వచ్చిన బడుగుల లింగయ్య యాదవ్, బండ ప్రకాశ్ ముదిరాజ్‌లకు అవకాశం కల్పించడం పట్ల ముఖ్యమంత్రి కెసిఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. బిసి అభ్యర్థులైన వీరి ఎన్నిక ఏకగ్రీవం అయ్యేలా ఇతర రాజకీయ పార్టీలూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ముంపు బాధితుల త్యాగం మరువలేనిది

● ఆరు నెలల్లో అన్ని వసతులతో 'డబుల్' ఇళ్లు
● భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు



మన తెలంగాణ/గజ్వేల్ : మల్లన్నసాగర్ ముంపు బాధితుల త్యాగం మరువలేనిదని,లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నింపిన మీకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలంగాణ రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ, మార్కెటింగ్, శాసనసభ వ్యవహారాల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం గజ్వేల్ మండల పరిధిలోని ముట్రాజ్‌పల్లిలో మల్లన్నసాగర్ ముంపు గ్రామాలైన సింగారం, ఎర్రవల్లి గ్రామాల ప్రజలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా దుబ్బాక ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డిని ముంపు బాధితులు గజమాలతో సత్కరించారు. అనంతరం మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ ముంపు గ్రామాల ప్రజలకు దండం పెట్టి చెబుతున్నా మీకు వచ్చిన నష్టపరిహారాన్ని దుర్వినియోగం కాకుండా జాగ్రత్తగా వాడుకోండి మీ పిల్లల భవిష్యత్తుకు ఉపయోగపడతాయని చెప్పారు. పంటకు పెట్టుబడి సహాయం కింద ప్రభుత్వం ఇచ్చే ఎకరానికి 4 వేలు మల్లన్నసాగర్ ముంపు నిర్వాసితులకు అందే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. మల్లన్నసాగర్ ముంపు గ్రామాల నిర్వాసితులకు అహ్లాదకరమైన వాతావరణంలో బంజారా హిల్స్, జూబ్లీహిల్స్‌లను తలపించే విధంగా నిర్మాణాలు ఉంటాయని తెలిపారు.ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజి కింద 250 గజాల్లో, 125 గజాల్లో డబుల్ ఇళ్లు, 125 గజాల్లో ఖాళీ స్థలం ఉండే విధంగా గుడికి గుడి, బడికి బడి, ఇలా అన్ని రకాల వసతులతో 6 నెలలలోపు ఇండ్లు నిర్మించి ఇంటి తాళాలు అందజేస్తామని తెలిపారు. మల్లన్నసాగర్‌లో 12 వేల 36 ఎకరాల భూమి ఇచ్చి 7 లక్షల కుటుంబాల్లో వెలుగులు నింపిన మిమ్మల్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. మల్లన్నసాగర్ భూసేకరణ ఇప్పటి వరకు 90 శాతం పూర్తి అయింది పనులు కూడా ప్రారంభించామని తెలిపారు. మల్లన్నసాగర్ వల్ల వచ్చే మత్స్య సంపద హక్కులను ముంపు బాధితులకు కల్పిస్తామన్నారు. గోదావరి నుంచి మల్లన్నసాగర్ అక్కడి నుంచి నేరుగా రైతుల పొలాల్లోకి రానున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువకునికి అదనంగా ప్లాట్లు ఇస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు డబుల్ ఇండ్లను తర్వితగతిన పూర్తి చేసి అన్ని వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎంపి కొత్తప్రభాకర్‌రెడ్డి, హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ భూంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిఆర్‌ఎస్‌ను వీడే ప్రసక్తే లేదు

నా కుమారుడు బిజెపిలో కొనసాగడం వ్యక్తిగతం
థర్డ్‌ఫ్రంట్ ఏర్పాటు అవసరం ఉంది : డిఎస్



మన తెలంగాణ/న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీలోకి తిరిగి రావాలని ఆ పార్టీకి చెందిన నేతలెవరు తనను సంప్రదించలేదని టిఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యులు డి. శ్రీనివాస్ స్ప ష్టం చేశారు. ఒక వేళ ఆ పార్టీకి సంబంధించిన ముఖ్యనేతలెవరైనా కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించినా వెళ్లేది లేదన్నారు. వివిధ అంశాలపై ఆదివారం తెలంగాణభవన్‌లో ఆయన మీడి యాతో మాట్లాడుతూ గత కొంత కాలంగా తాను తిరిగి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోనున్నాను అంటూ వస్తున్న వార్తలను ఖండించారు. రాజకీయ కుటుంబాల్లో ఎవరు ఏ పార్టీ తో ఉండాలనేది వారి వ్యక్తిగత ఇష్టం అన్న డిఎస్, తన కుమారుడు బిజెపిలో కొనసాగడాన్ని ఆయన వ్యక్తిగతం అని స్పష్టం చేశారు. ఈమధ్య కాలంలో టిఆర్‌ఎస్ పార్టీతో అంటీ ముట్టనట్లు వ్యవహరిస్తున్నాన్న వార్తలను కూడా ఆయన ఖండించారు. ఆ వార్తలలో ఎంత మాత్రం నిజంలేదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సిఎం కెసిఆర్ ప్రకటించినట్లుగా థర్డ్ ఫ్రంట్ అవసరం దేశ రాజకీయాలలో ఎంతో ఉందన్నారు.దేశంలోవచ్చే సాధారణ ఎన్నికలలోథర్డ్‌పార్టీ అధికారంలోకి రాష్ట్రాల హక్కులు, రాష్ట్రాల అభివృద్ధిపై దృష్టిపెడుతుందని స్పష్టం చేశారు.దేశ అభివృద్ధి కోసం థర్డ్‌ఫ్రంట్ పేరుతో ముందుకు వచ్చిన సిఎం కెసిఆర్‌ను దేశప్రజలుఅభినందిస్తున్నారని తెలిపారు.వివిధ రాష్ట్రాల్లో పలు రకాలుగా బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీల సంఖ్య ఉంది కాబట్టి రిజర్వేషన్ల అం శాన్ని రాష్ట్రాలకే వదిలివేయాలని ఆయన కోరారు.హర్యానా,పంజాబ్, మ హారాష్ట్ర రిజర్వేషన్ల అంశంపై పోరాటం చేస్తున్నాయనిడిఎస్‌గుర్తు చేశారు.

సిరియా

ఇది మూడు గంటల సినిమా కొరకు
నటులు ముఖానికి పూసుకున్న రంగు కాదు
ఇది భయానక విధ్వంసక విస్ఫోటనానికి
మాయలేని గాయాల ఆనవాలు.

తెగిపడిన చేతులు, అచేతనంలో
పగిలిపోయిన పసిదేహాలు,
స్రవిస్తూ ప్రవహిస్తున్న రక్తపు నదీ
ప్రవాహంలోంచి
ఒక చేయి పైకి లేచింది
రక్షించమని.

అది థియేటర్ లో కేకలకొరకు
శివగామెత్తిన చేయనుకొనేరు.
మదమెక్కిన ఫిరంగుల తూటాలకు
చిదిమేసిన పసిమొగ్గల ఆర్తనాదం.

శవాలపై దేశ సైన్యం చేస్తున్న కవాతు
శరనార్థుల శిబిరాల్లోకి చేరని మానవత్వం,
అవసరానికి అందని ఆసరా



చిన్నారుల ఆకలి కేకలకు
తల్లడిల్లే తల్లులు
రేపటి భవితను కాపాడమని,
తమ మానాలను
త్యాగంచేసిన అమ్మలు
పేలిపోయిన హృదయాలు
ఆక్రోశిస్తున్నాయి.
రాలిపోయిన పసితనం
ముఖంలో ఉప్పొంగిన సిరియా,
రక్త సముద్రంలో మునిగిపోయింది.

అమాయకత్వంతో అన్నివైపులా
చుట్టిన పద్మవ్యూహంలో పసి తలకు
గురిపెట్టిన అధికార తుపాకులతో
విధి వీడియో గేమ్లు ఆడుకుంటున్నది.

సాధు మహేందర్ 99129 96551

బాలకథా వికాసం



ఐతా చంద్రయ్య
9391205299

బాలలు బ్రహ్మ స్వరూపులంటారు విజ్ఞులు. కల్లాకపటము తెలియని బాలల మనస్తత్వము మైనం ముద్దలాంటింది. దానికి పసిప్రాయములో అద్దిన సంస్కారాలు శాశ్వతంగా అతుక్కుంటాయి. బాలల భవిష్యత్తు బంగారుమయం కావాలంటే బాల్యవ్యవస్థలోనే వారికి చదువుతో పాటు సంస్కారం. క్రమశిక్షణ అలవడాలి. లోకం పోకడ అవగాహన కావాలి. అందుకోసం నీతి ప్రధానమైన కథలు వారికి చెబుతుండాలి. వారితో చదివించాలి. బాలకథలు చిన్నారుల ప్రగతి భవనానికి పునాదులవుతాయి. కథలంటే ఆబాలగోపాలానికి ఇష్టమే. కథ చెబుతామంటే పిల్లలు అల్లరి మానేస్తారు. కథ వినేటప్పుడు బాలల దృష్టి దానిమీదనే కేంద్రీకృతమవుతుంది. దానితో ఏకాగ్రత అభ్యాసమవుతుంది. నేడు ప్రపంచ భాషలన్నింటిలోనూ బాలల కథలు ప్రాధాన్యత వహించాయి. చిట్టిపొట్టి బాలల మానసిక స్థాయికి సరిపోయే కథలు మనోరంజనము కలిగిస్తూ ఆత్మవిశ్వాసాన్ని ప్రోదిచేస్తాయి.

భాష : బాలల కథలు సుదీర్ఘమైనవి కావు. అవి చిట్టిపొట్టి కథలు, పిల్లల్ని నిద్రబుచ్చేలా, వారి మానసిక స్థాయికి తగినట్టుగా ఉంటాయి. కథల్లో కఠిన పదాలు, ద్విత్వాక్షరాల ప్రయోగాలు తక్కువుంటాయి. చిన్న చిన్న వాక్యాలుగా పిల్లలు సులువుగా చదివి అర్థం చేసుకుంటారు. కథనం కూడా చిన్నారి బుర్రలో ఇమిడేలాగుంటుంది. సమాసాలు, పెద్ద అలంకారాలకు తావులేదు.

పిల్లల కథలు వింటూ ఊకొడ్తారు కాబట్టి వాటిని ఊకుడు కథలన్నారు. కాశీమజిలీ కథలన్నీ ఊకుడు కథలే ''పూర్వం మౌఖికమైనవే. వేదమంత్రాలులా ఒకతరం నుండి ఇంకో తరానికందేవి. సాంకేతిక, నాగరికత పెరిగిన తర్వాత అచ్చుయంత్రాలలో గ్రంథస్తమైనాయి. బాలల కథలన్నీ నీతి ప్రధానమైనవే.

భావం: బాలలకు పెద్దలకున్నంత అవగాహనా సామర్థ్యముండదు. నవరసాల్లో అన్ని రసాల పోషణ బాలల కథల్లో ఉండదు. శృంగార, బీభత్స రసాల్లాంటివుండవు. శృంగార రసం అర్థం కాదు, బీభత్సరసం హడలగొడ్తుంది. హాస్యరసం చిన్నారులను అమితంగా ఆకర్షిస్తుంది. అందుకే జంధ్యాల ''నవ్వించడమొక యోగం, నవ్వడమొక భోగం, నవ్వకపోవడమొక రోగం'' అన్నాడు. నవ్వు మానసికోల్లాసాన్నివ్వడమే కాకుండా ఆరోగ్యానికి మేలు చేస్తుంది. నవ్వితే నరాలకు ఎక్సర్‌సైజ్ అవుతుంది.

బీర్బర్ కథలు, తెనాలి రామకృష్ణ కథలు అలాంటివే. అవి చారిత్రాత్మకమైనా ఊహాత్మకత రంగరించుకున్నవి. అందరినీ ఆకట్టుకుంటాయి. మర్యాద రామన్న కథలు, పురావస్తు చారిత్రక కథలు దేశ సంస్కృతిని, నీతిని ధర్మాచరణను బోధిస్తాయి. సాంఘిక కథలు సమకాలీన సమాజంలో జీవన విధానాన్ని నేర్పి ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు దోహదపడ్డాయి. బాలలకథల్లో ఫ్లాషు బ్యాక్‌లు, అనుకోని మలుపులు అయోమయానికి గురిచేస్తాయి.

స్ఫూర్తి: బాలకథలు చిన్నారి లేత మనసులను రంజింపజేసి,

> **కథ చెబుతామంటే పిల్లలు అల్లరి మానేస్తారు. కథ వినేటప్పుడు బాలల దృష్టి దానిమీదనే కేంద్రీకృతమవుతుంది. దానితో ఏకాగ్రత అభ్యాసమవుతుంది. నేడు ప్రపంచ భాషలన్నింటిలోనూ బాలల కథలు ప్రాధాన్యత వహించాయి. చిట్టిపొట్టి బాలల మానసిక స్థాయికి సరిపోయే కథలు మనోరంజనము కలిగిస్తూ ఆత్మవిశ్వాసాన్ని ప్రోదిచేస్తాయి.**

స్ఫూర్తినింపేవిగా ఉంటాయి. రామాయణంలో బాలరాముని చేష్టలు, భాగవతంలో బాలకృష్ణ లీలలు – సాహసకృత్యాలు బాలలకు మంచి స్ఫూర్తినిస్తాయి. లవకుశులు శ్రీరాముని అశ్వమే ధాశ్వమును ఆపి తండ్రితో యుద్ధం చెయ్యడము, తర్వాత శ్రీరాముడు తండ్రి అని తెలిసిన తర్వాత తండ్రి ఒడిలో ఒదిగిపోవడం బాలల మనోల్లాసము ఉత్సాహాన్నిస్తాయి. ఝాన్సీ లక్ష్మీ బాయి, వీరసావర్కర్, అల్లూరి సీతారామరాజులు బాల్యంలోనే విదేశీ పాలన నెదిరించడం లాంటి కథలు చిన్నారి హృదయాలలో దేశభక్తిని నింపుతాయి. దేశరక్షణలో ముందుండాలనే స్ఫూర్తిని కల్గిస్తాయి. వారిని ఉత్తమ భారత పౌరులుగా, భావినేతలుగా తీర్చిదిద్దుతాయి.

వీరశివాజీని తల్లి జిజియాబాయి పెంచిన తీరు, చిన్నప్పుడే శివాజికి చెప్పిన వీరగాథలు నేటి బాలల్లో ధైర్యసాహసాలు రగిలిస్తాయి. సింద్‌బాద్, గలీవర్ సాహసయాత్రలు ఉత్తేజాన్నిస్తాయి. భారత ప్రభుత్వం ఏటేటా సాహస బాలలకు పురస్కారాలిచ్చి ప్రోత్సహిస్తుంది. వారి సాహసకృత్యాలను కథలుగా మలిచి బాలలకందిస్తే స్ఫూర్తినిస్తాయి. తాము గూడా సాహసకృత్యాలు చేసి తోటి మానవులకు సహాయ పడాలనే ఆశయాన్ని మొలకెత్తిస్తాయి.

బీర్బల్, మర్యాద రామన్న కథల్లో చాలా నీతులున్నాయి. ఈ రోజుల్లో కొత్త రోగాలకు కారణమవుతున్న గుట్కాలు, పాన్ మసాలా, సిగరెట్ తాగడం, మద్యం సేవించడం లాంటివి భయంకరమైనవని చెప్పే కథలు నేడు చాలానే వస్తున్నాయి. శ్రీదేవి మురళీధర్ రాసిన ''ఆవిష్కరణ'' (ఆల్కాహాలిక్ పిల్లల కథలు) ఇందుకు ఉదాహరణలు పిల్లలకు చదువుతో పాటు సంస్కారం అలవడాలంటే క్రమశిక్షణ, కష్టపడి చదవటం, వినయ విధేయతలు ప్రోదిచేసే కథలు గూడా చాలా వచ్చాయి. వాటిని చిన్నారి బాలలంతా చదవాలి. అడవి జంతువులు , సముద్రజీవులు, కుక్క, కోడి మొదలైన వాటితో మానవ సంబంధాలు మొదలైన బాలకథలు చాలా ఉపయోగపడతాయి. అందుకే పంచతంత్రము కథల్లో జంతువులు, పక్షుల కథల ద్వారా విష్ణుశర్మ రాకుమారులకు విద్యాబుద్ధులు, సంస్కారము నేర్పాడు. పంచతంత్ర కథలను చిన్నయసూరి ఐదు భాగాలుగా తెలుగులో అనువదించాడు. అవి 1) మిత్రలాభం 2) మిత్రభేదం, 3) సంధి, 4) విగ్రహము, 5) అపరీక్షిత కారత్యము. ప్రతి కథలో జంతువులు, పక్షుల ద్వారా మానవాళికి నీతి, ధర్మం లోకాచార వ్యవహారాల గురించి వివరించాడు.

బొమ్మలు: మాటల ద్వారా వ్యక్తం కాని భావాలు బొమ్మల ద్వారా వ్యక్తమవుతాయి. బాలలకథల్లో సందర్భానుసారమైన బొమ్మల్ని చూసి బాలలు ఆనందిస్తారు. అందుకే బాలల బొమ్మల రామాయణం, బాలల బొమ్మల భాగవతము, మరెన్నో వెలువడ్డాయి. పంచతంత్రములాంటి బాలల కథలు టీవీ చానల్స్‌లో, సీరియల్స్‌లో ప్రసారమై బాలల్లో కొన్ని రంజింపజేశాయి. జంతువులు, పక్షుల కథల్లో వాటి బొమ్మలు మనసుల్లో చెరగని ముద్రలు వేస్తాయి.

బాలల కోసం వెలువడుతున్న పత్రికలన్నీ సచిత్ర పత్రికలే. నాగిరెడ్డి – చక్రపాణి సారథ్యంలో వెలువడిన, చందమామ, బాలమిత్ర పత్రిక నుండి నేడు రామోజీ ఫౌండేషన్ సారథ్యంలో వెలువడుతున్న బాలభారతం, పత్రిక వరకు ఆకర్షణీయమైన బొమ్మలతో ప్రజాదరణ పొందాయి. బాల సాహిత్యంలో డా.గంగిశెట్టి శివకుమార్, డా.వాసరవేణి పరశురాములు లాంటి ఔత్సాహికులు విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు చేసి పిహెచ్‌డి డాక్టరేట్ డిగ్రీలు పొందారు. అయినా ఎన్నో కోణాల్లో బాల సాహిత్యంలో మరెన్నో పరిశోధనలు జరగాలి. సైన్స్, ఫిక్షన్, శాస్త్ర విజ్ఞానం ఇతివృత్తాలుగా వెలువడుతున్న బాలల కథలు రేపటి పౌరులు మేథోశక్తికి మెరుగులు దిద్దుతున్నాయి. నేడు తెలుగులో బాలల పత్రికల్లో చాలానే వెలువడుతున్నాయి. బాలభారతం, బాలమిత్ర, చంద్రబాల, మొలక మొదలైన పత్రికలు వెలువడుతూ మరిన్ని కొత్త పత్రికలకు స్వాగతం పలుకుతున్నాయి.

తెలంగాణ వచన కవితా వికాసం–జాతీయ సదస్సు

ఈ నెల 22, 23 తేదీల్లో హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 'తెలంగాణ వచన కవితా వికాసం' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. తెలంగాణ సాహిత్య అకాడెమీ హైదరాబాద్ వారి సౌజన్యంతో నిర్వహించే ఈ సదస్సుకు సంచాలకులుగా ఆచార్య బన్న అయిలయ్య వ్యవహరిస్తారు. డా. నందిని సిధారెడ్డి, ఏనుగు నర్సింహారెడ్డి, రామాచంద్ర మౌళి, సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, కాత్యాయినీ విద్మహే, బూదాటి వెంకటేశ్వర్లు, మాడభూషి సంపత్ కుమార్, ఆర్. సీతారం, బెల్లియాదయ్య, గుండెడప్పు కనకయ్య, జి. బాలశ్రీనివాస్ మూర్తి, త్రివేణి, లావణ్య, లక్ష్మణ చక్రవర్తి, పగడాల నాగేందర్, షాజహానా పాల్గొంటారు.

విమర్శనా గ్రంథాలకు పోటీ

ద్వానా శాస్త్రి డెబ్బై సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 'సాహిత్య విమర్శ' గ్రంథానికి ద్వానా సప్తతి పురస్కారాలకై గ్రంథాలనాహ్వానిస్తున్నారు. 2016,2017& 2018 సం॥లో ప్రచురింపబడిన 200 పుటలకు తక్కువ గాని గ్రంథాల్ని రెండు ప్రతులను పంపాలి. ప్రథమ బహుమతి రూ. పదివేలు, రెండో బహుమతి రూ. ఐదువేలు ఇవ్వబడతాయి. గ్రంథాలు చేరవలసిన తేదీ ఏప్రిల్ 2018. చిరునామా డి. శశికాంత్, 1–1–428, ఫ్లాట్‌నెం. 101, ఆర్కిడ్ నెస్ట్, గాంధీనగర్, హైదరాబాద్– 80.

కవి సంధ్య పానుగంటి కవితల పోటీ ఫలితాలు

ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా కవి సంధ్య , కవిత్వ పత్రిక పానుగంటి ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన కవితల పోటీలో మొదటి బహుమతి ర్యాలి శ్రీనివాస్ (గాడ్స్ డెత్ సర్టిఫికేట్) కు, రెండో బహుమతి పి.అశోకుకుమార్ (ఇంటి పాదాల వద్ద) , మూడో బహుమతి బండారి రాజ్‌కుమార్ (నల్ల కుందేలు) బహుమతులు గెలుచుకున్నారు. మార్చి 21న యానాంలో జరిగే ప్రపంచ కవితాదినోత్సవ కార్యక్రమంలో బహుమతులు అందజేస్తారు.

మూడు గ్రంథాల ఆవిష్కరణలు

నాగరాజు రామస్వామి రాసిన సూర్యశిల, ఎదపదనిసలు, అనుస్వనం అనే మూడు గ్రంథాల ఆవిష్కరణలు ఈనెల 16న సా.గం.6 లకు రవీంద్రభారతి హైదరాబాద్‌లో జరుగుతాయి. డా॥ తిరునగరి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో కె. శివారెడ్డి మామిడి హరికృష్ణ, ఏనుగు నర్సింహా రెడ్డి పుస్తకావిష్కరణలు చేస్తారు. అదే వరుసలో గంగిశెట్టి లక్ష్మీ నారాయణ, అమ్మంగి వేణుగోపాల్ కృతి స్వీకారం పొందుతారు. పి. లక్ష్మీ నారాయణ, తిరునగరి దేవకీదేవి పుస్తకాల పరిచయాలు గావిస్తారు.

'కథా రచన' కార్యశాల

తెలంగాణ విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖ నిజామాబాద్, తెలంగాణ సాహిత్య అకాడెమీ సంయుక్తంగా ఈనెల 14 న తెలంగాణ విశ్వవిద్యాలయంలో 'కథారచన'పై కార్యశాల నిర్వహిస్తుంది. అతిథులుగా ఆచార్య పి.సాంబయ్య, డా॥ నందిని సిధారెడ్డి, ఎ. రవీందర్‌రెడ్డి పాల్గొంటున్న ఈ కార్య క్రమంలో స్వాతి శ్రీపాద, కాసుల ప్రతాపరెడ్డి, కె.పి. అశోక్‌కుమార్ , డా॥ బి.వి.ఎన్. స్వామి.డా.నలిమెల భాస్కర్, శంకరగిరినారాయణ స్వామి, పెద్దింటి అశోక్ పాల్గొని కథా రచనపై అవగాహన కల్గిస్తారు.

సహృదయుడు

బాగుందీ అంటే
బాగుందని కాదు
నచ్చిందని.
నమస్కారం అంటే
నీ తోలు పాదాలకాదు
పద్యపాదాలకని.
ఇది నీకు చెప్పడానికి
అతడెంతో శ్రమపడ్డాడు.
పదిమందికి ఫోన్ చేసి
నీ నెంబర్
సంపాయించాడు.
అతడు అద్దంలా వున్నాడు
నీ ముఖ కవళికల్ని
కొత్తగా చిత్రిస్తున్నాడు
అతడు నీ పద్యాన్ని
సాకల్యంగా
ముట్టుకున్నాడు
స్పర్శా శాస్త్రాన్ని
ఆపోసన పట్టినట్టున్నాడు.
నీలాగే అతనికి
కొండ అంటే
కొండ కాదు
గడ్డ కట్టిన దుఃఖం.
చెట్టు అంటే
పచ్చని పాట.
సూర్యుడంటే
సరికొత్త గాయం.
చంద్రుడు
మబ్బును
వొత్తి తీసిన మలాము.
మనిషి అంటే
నీలాగే అతనికి
వెయ్యి అర్థాల నిఘంటువు
శతకోటి రాగాల
మృదువేణువు.
రాసింది నువ్వే
కావచ్చుగాని
కవిత మాత్రం
సగం అతనిదే.

డా॥ఎన్.గోపి

'కొత్త పేజీ మొదలైంది...'

జీవిత పుస్తకంలో
మరో కొత్త పేజీ మొదలైంది
ఊహకు అందని రేపటిని
ఆశల గుప్పెట పట్టుకుని వచ్చింది విళంబి
లేత చిగురుకు ఇపుడు అంతా నిత్యనూతనం
ఆమని వనికి అగ్రాధిపతి ఉగాదే
ఆప్యాయతల పలకరింపులతో
చిరునవ్వుల చిరుదివ్వెలతో
స్నేహభావాల సౌహార్ద్రంతో
మనసారా ఆశీర్వదించాల్సిన
వసంతపు పెద్దమ్మ ఉగాదే
వర్తమానం ఫరవాలేదు
ఆగామికి భయంలేదు
చిరునవ్వుతో చిరుదివ్వెను
శ్రీ విళంబి వెలిగించాలి
అసమానతలంటని
ఆకుపచ్చని మహాసామ్రాజ్యాన్ని స్థాపించాలి
అపక్రమంలేని విక్రమత్వంతో
ఈ ఉగాది ముందడుగేయాలి
మధురంగా సుమధురంగా
ప్రశాంత సంతోషంతోసాగిపోవాలి




తిరునగరి శ్రీనివాస్
9441464764

త్యాగధనం

'నేను నేనని' మాత్రమే అనుకుంటే
అది సంకుచితత్వం.
నేను – నా కుటుంబం అనుకుంటే
అది స్వార్థ పరత్వం.
నేను– నా సమాజం అనుకుంటే
అది సేవాదృక్పథం.
నేను – నా దేశం అనుకుంటే
అది ముమ్మాటికీ త్యాగధనం.

బూర భిక్షపతి, 9866612717

శ్రీశ్రీ మహాప్రస్థాన సంబోధనలు




డా. నలిమెల భాస్కర్
9704374081

నన్ను చిన్నతనంలో బాగా ప్రభావితం చేసిన పుస్తకం రంగనాయకమ్మగారి ''బలిపీఠం'' నవల. ఆ తర్వాత అంటే ఒకానొక ప్రాపంచిక దృక్పథానికి దగ్గరై కొంత అవగాహన ఏర్పడుతున్న దశలో ఒకింత చైతన్య స్థాయి నాలో పెరిగిన స్థితిలో నా మనఃఫలకమ్మీద గొప్ప ముద్ర వేసిన గ్రంథం శ్రీశ్రీ ''మహాప్రస్థానం'' తదనంతరం ''టఫ్ టైమ్స్ నెవర్ లాస్ట్'' టఫ్ పీపుల్ డూ (రాబర్ట్ షెల్లర్) మొదలైన అనేక పుస్తకాలు నన్ను ప్రభావితం చేశాయి. ప్రస్తుత వ్యాస పరిమితి మహాప్రస్థానానికి లోబడి వుండాలి కనుక మీదు మిక్కిలి ఆ పొత్తంలోని సంబోధనలకే పరిమితమై వుండాలనుకున్నాను కాబట్టి అసలు విషయానికి వద్దాం.

తెలుగు సాహిత్యంలో పెనుమార్పులకు మూలం శ్రీశ్రీ మహాప్రస్థానం. దానిది నిస్సందేహంగా నిరుపమాన స్థానం. మహా ప్రస్థానాన్ని ఎన్ని సార్లు చదివానో లెక్కే లేదు. అట్లా ఎన్ని పర్యాయాలు చదివినా ఎంతగా అర్థమైనట్లు అన్పించినా మళ్లీ అర్థంకాని దురవబోధమైన అంశాలు అందులో కోకొల్లలు. ఈ అనుభవం నా ఒక్కడిదే కాదు. చాలా మంది సాహితీ వేత్తలకు అర్థం కాని పదాలు, పదబంధాలు మహాప్రస్థానంలో అడుగడుగునా కన్పిస్తాయి. చిత్రంగా ఈ మారు మహాప్రస్థానాన్ని పరిశీలిస్తూ పఠిస్తున్నపుడు నా దృష్టికి శ్రీశ్రీ సంబోధనలు లెక్కకు మిక్కిలిగా వచ్చాయి.

మేలుకొల్పడం –మెలకువలోనికి తీసుకురావడం –జాగ్రదావస్థ కల్గించడం– నిద్రలేపటం – వీటి కోసమే ఆయన పిలుపును ఆశ్రయించాడు. అందుకే చూడండి...మహా ప్రస్థాన గీతం ప్రారంభం గమనించండి ''మరో ప్రపంచం / మరో ప్రపంచం / మరో ప్రపంచం పిలిచింది/ పదండి ముందుకు /పదండి త్రోసుకు / పోదాం పోదాం పైపైకి'' అని వుంటుంది. ఇందులో ''పిలిచింది'' అనే పదాన్ని మహాకవి చాలా సాలోచనగా వేశాడనిపిస్తున్నది. ఇక మరో ప్రపంచం పిలిచాక ముందుకు వెళ్లకుండా వుంటారా ప్రజలు. ఆ పోయంలోనే మరో చోట ''ఎముకలు కుళ్లిన / వయస్సు మళ్లిన / సోమరులారా చావండి/ నెత్తురు మండే /శక్తులు నిండే / సైనికులారా రారండి/ హరోం హరోం హర / హర హర హర హర / హరోం హరా అని కదలండి'' అని ముందుకు కదిలిస్తాడు. పై పంక్తులు సోమరులారా, సైనికులారా, హరోం హరా మొదలైనవన్నీ సంబోధనలే! అందుకే ఆ పదాంతాల్లో అన్ని ఆశ్చర్యార్థక చిహ్నాలు. సైనికులకు కూడా ''హరోం హరా!'' అని సంబోధిస్తూ కదలమని శ్రీశ్రీ ఆహ్వానిస్తున్నాడు.

''శైశవగీతి'' మహాకవి రాసిన ఉత్తమ కవిత. పిల్లల మీద అవ్యాజ ప్రేమానురాగాలతో అల్లిన కైత యిది. దీని ఆది ''పాపం పుణ్యం ప్రపంచ మార్గం /కష్టం సౌఖ్యం శ్లేషార్థాలూ/ ఏమీ ఎరుగని పూవుల్లారా/ అయిదారేడుల పాపల్లారా''అని వుంటుంది. మొదట్లోనే పిల్లల్ని పూవుల్లారా! పాపల్లారా! అన్నాడు. పువ్వులు కోమలత్వానికీ, అందానికీ, నిర్మలత్వానికీ ప్రతీకలు. అందుకే అట్లా సంబోధిస్తూ ''మెరుపు మెరిస్తే/ వాన కురిస్తే / ఆకసమున హరివిల్లు విరిస్తే/ అవి మీకే అని ఆనందించే / కూనల్లారా'' అని పలుకుతాడు. పిల్లల్ని మనం కూడా చిట్టితల్లీ, చిన్ని తల్లీ, చిక్క తల్లీ (కన్నడంలో చిక్క అంటే చిన్న), గున్న తల్లీ, బంగారు కూనా ఇలా పిలుస్తుంటాం గారాబంగా. అందుకే శ్రీశ్రీ ఆ రకంగా ఆహ్వానించాడు. ఈ కవి ప్రత్యేకత ఏమిటంటే వీలున్నపుడల్లా కవిత్వంలో సంబోధనలు వేయడమే! పద్య ప్రారంభంలోనే కాకుండా మధ్యమధ్య కూడా వేస్తాడు. పద్యం ముగిసే దాకా చదువరున్ని తనతోపాటు తీసుకుని వెళ్లడానికి ఉపకరించే ఒక మెళకువ, ఒక వ్యూహం, ఒక తరంగధైర్యం ఈ సంబోధన, మనల్ని క్షణక్షణ జాగరితుల్ని చేసే అంశమిది. మళ్లీ చూడండి... ''అచ్చటి కిచ్చటి కనుకోకుండా/ ఎచ్చటెచ్చటికో ఎరుగుతూ పోయే / ఈలలువేస్తూ ఎగురుతు పోయే / పిట్టల్లారా! పిల్లల్లారా'' అంటాడు. ఇక్కడ పిల్లల్ని పిట్టల్ని చేస్తాడు. పిల్లలెప్పుడూ తుళ్లింతలూ, గెంతులూ, కేరింతలతో ఎగురుతుంటారు కనుక పిట్టలు అని పిలుస్తాడు. ఇంకా ముందుకు వెళ్లి పిల్లల్ని వర్ణిస్తూ, వాళ్ల స్థితిని చూపిస్తూ ''ఎక్కడ చూస్తే అక్కడ మీరై విశ్వరూపమున విహరిస్తుండే / పరమాత్మలు/ ఓ చిరుతల్లారా'' అని పేర్కొంటాడు. ఇప్పుడు పిల్లలు ఏకంగా దేవుళ్లతో సమానమైనారు. ఆ తర్వాతే ''పిల్లలూ దేవుడూ చల్లని వారే'' అంటూ పాట ఒకటి సినిమా తోటలోకి వచ్చింది. ఈ శైశవగీతిని చివరికి ''ఉడుతల్లారా/ బుడతల్లారా/ ఇది నా గీతం వింటారా?'' అని ప్రశ్నిస్తాడు. ఉడుతలూ, బుడతలూ సంబోధనలైతే, చివరి పంక్తి ప్రశ్న. సంబోధనే ఎదుటి మనిషి ధ్యానాన్ని ధ్యాసను కవి వైపు తిప్పుతుందనుకుంటే, చివరి వేసిన ప్రశ్న పిల్లల్నీ చదువరుల్నీ మరింత దగ్గరకు తీసుకుంటుంది. అదీ మహాకవి శ్రీశ్రీ కవిత్వంలో కన్పించే టెక్నిక్. ''ఉన్మాది'' మహాప్రస్థానంలో మరో కవిత, ''అలకలన్నీ అట్టకట్టిన/ బొమికలన్నీ ప్రోవుపట్టిన/కాగితంవలె పలచబారిన /వెర్రివాడా! కుర్రవాడా!



శ్రీశ్రీ

శ్రీశ్రీకి దీనజనుల మీద, బాధితులపైన, పీడితులు, దుఃఖితులు, ఉపేక్షితుల (పిల్లలు, వృద్ధులు, ఉన్మాదులు మొదలైన వాళ్లు) పైన వల్లమాలిన ప్రేమ. కరుణ. సానుభూతి. దయ. ఆయన అపారకృపాహృదయుడు. అందుకనే ఎవరూ పట్టించుకోని ''పిచ్చివాడి'' గురించి కవిత రాశాడు. ప్రారంభ పంక్తుల్లో వెర్రివాడా, కుర్రవాడా తత్సంబంధిత సంబోధనలు. ఈ గీతంలో మరో మూడు సార్లు ఈ పిలుపులున్నాయి. ''స్విన్‌బర్న్ కవికి'' కవితలో ఆ మిథ్యావాదిని సంబోధిస్తూ రకరకాలుగా ఆహ్వానిస్తూ ఆ రకరకాల పిలుపుల్లో గొప్ప శిల్పాన్ని సాధించాడు శ్రీశ్రీ. భౌతికవాది, ఆయనకు ఈ ప్రపంచం సత్యం. భావవాదం చెప్పే దేమిటి అన్న నిత్యమూ సత్యమూ ఈ ప్రపంచం మిథ్య అని. మరి ఈ లోకం మిథ్య అని చెప్పే వ్యక్తులు ఈ భూమ్మిద వున్న సకల సౌఖ్యాలూ ఎందుకనుభవిస్తున్నారు అని శ్రీశ్రీ సంశయం. సంశయం కాదు కోపం. ''మాయంటావా? అంతా/ మిథ్యంటావా?/ నా ముద్దుల వేదాంతీ ఏమంటావు'' అనే ముద్దుల వేదాంతీ పిలుపులో మొదటి ఏమంటా వుండదు. చాలా హాయిగా,సాఫీగా సాదాసీదాగా వేదాంతిని పిలుస్తాడు. ఆ తర్వాత ''జమీందారు రోల్సు కారు / మాయంటావూ/ బాబూ! ఏమంటావు'' అని ప్రశ్నిస్తాడు. ఈ ప్రశ్నా, సంబోధన.. రెంటిలోనూ శ్రీశ్రీ కోపం ప్రదర్శితం కాలేదు. కావాలనే ఆ మిథ్యావాది? ఆటపట్టించాలనే వ్యూహాత్మకంగా ''బాబూ!'' అని గౌరవ సంబోధన వేశాడు. తదుపరి ''మహారాజు'' మనీపర్సు/ మాయంటావూ స్వామీ/ ఏమంటావు!'' అనే స్వామిలో శ్లేషపూర్వక సంబోధన ఉంది. ఒక అర్థం గౌరవ పురస్సరమైనదీ, మరొకటి ఆటపట్టించేదీ. ఆ తర్వాత ''మర ఫిరంగి విష వాయువు/ మాయంటావూ/ ఏం ఏంమంటావు'' అని ప్రశ్నిస్తాడు. మొదట అంటే గీత ప్రారంభంలో ముద్దుల వేదాంతి, క్రమంగా బాబు, స్వామిలుగా మారి ఇప్పుడిక ''ఏం'' దాకా వచ్చింది. ఇప్పుడు, మిథ్యామిదిని ''ఏం'' అని పిలుస్తున్నాడు. రెట్టిస్తున్నాడు. ప్రశ్నతో తర్వాత దట్టిస్తున్నాడు. దడ పుట్టిస్తున్నాడు. ఇంకా ముందుకెళ్లి ''తుపానులూ, భూకంపం/ తిరుగుబాట్లు సంగ్రామం/ సంగ్రామం సంగ్రామం/ మాయంటావూ? ఏయ్ ఏమంటావు?'' అని పృచ్ఛిస్తాడు. ఆ పృచ్ఛకు ముందు ''ఏయ్! అనే సంబోధన గమనార్హం. ఇక్కడ శ్రీశ్రీ కోపం తారాస్థాయికి చేరింది. మొదట్లోని ముద్దుల వేదాంతిని ఇప్పుడు ''ఏయ్'' అని గుర్రుమన్నాడు.

''కవితా! ఓ కవితా!'' అనే కవిత గురించి ఎన్నో పుటలు రాయవచ్చు. ఎక్కడా ఆపుటలు అన్నది లేకుండా పేజీల కొద్దీ రాయవచ్చు. అదో గొప్ప కవిత. నాకు తెలిసి కవిత్వానికి సంబంధించిన కవితలలో ప్రపంచంలోనే వచ్చిన అతిగొప్ప కైతయిది. అసలు ఈ కవిత ఈ శీర్షికనే సంబోధన కదా! ''కవితా! ఓ కవితా!'' అంటూ ప్రారంభిస్తాడు. ఒక నిశ్చల తపస్సమాధిలో, ఒక గొప్ప భావస్థితిలో, ఒక బాహిరస్పృహ లేని పరిస్థితిలో, ఒక మూడ్‌లో ఒక ట్రాన్సులో పూర్తిగా నిమగ్నమై భగ్నమై భగ్నమై మనస్సు లగ్నమై రాసిన కవిత యిది. అందుకే ఈ కవిత విన్న విశ్వనాథ శ్రీశ్రీని కళ్లనీళ్ల పర్యంతమై ఆలింగనం చేసుకున్నాడు. రెండు మహాశిఖరాలు ఒక పరిష్వంగమై నిలిచిన కవిత.

ఇక సంబోధనలు – ఓ చోట ''విన్నానమ్మా! విన్నానెన్నో విన్నాను'' అంటాడు (ఒక లక్ష నక్షత్రాల మాటలు, ఒక కోటి జలపాతాల పాటలు, శతకోటి సముద్ర తరంగాలు మ్రోతలు... ఇత్యాదులు) ఈ ''విన్నానమ్మా'' అనడంలో ''అమ్మా, తల్లీ, మాతా, జననీ'' అన్న పిలుపు ఉంది. ఆ తర్వాత అలా అలా సాగుతూ హఠాత్తుగా ''నన్ను కరిగించిన కవన ఘృణీ /రమణీ / ఓ కవితా ఓ కవితా'' అంటాడు.

ఇంకా ముందుకు వెళ్లి ''నన్ను పునీతుని కావించిన కవితా'' అని సంబోధిస్తాడు. సాహిత్య ప్రక్రియల్లో కవిత్వానికి ప్రత్యేకత ఉంది. అది భావావేశ ప్రధాన ప్రక్రియ. సూటిగా హృదయాన్ని తాకే క్రియ మనలో ఏదో జరుగుతుంది తప్పక రూప విక్రియ. అది మనల్ని పవిత్రుల్ని పునీతుల్ని చేస్తుంది. వినీతుల్ని చేస్తుంది. మన హృదయ మాలిన్యాన్ని క్షాళనం కావిస్తుంది. శ్రీశ్రీ సంబోధనలు ఆ తరువాత ''లలిత లలిత కరుణా మహితా/ అనుపవితా/ అపరిమితా/ కవితా ఓ కవితా ''. ఇంక కవిత్వాన్ని దేంతో ఉపమించగల్గుతాం. దాన్ని దేనితో పరిమితం చేయగల్గుతాం. అది లలిత లలిత కరుణా మహి కదా! కవిత చివరికి ''ఓహో! ఓ రసధుని మణిఖని/ జననీ ఓ కవితా/ కవితా కవితా ఓ కవితా'' అని సంబోధించాడు. ''ఓహో'' అనడంలో ఎన్ని సంభ్రమాశ్చర్యాలు నిబిడీకృతమై ఉన్నాయో! జననీ అనడం నువ్వు నాకు జన్మ ప్రసాదిని అయిన తల్లి వంటి దానివని చెప్పడం. నిజంగానే శ్రీశ్రీ జన్మ ధన్యమైంది ఈ కవితలో.

''మానవుడా'' అనే సంబోధనతోనే ప్రారంభమైన శీర్షికలోనే మొదలైన కవితలో లెక్కలేనన్ని పిలుపులు. మానవుడు ఎంత మహోన్నతుడో, అంత దుర్మార్గుడు. ఈ రెండు కోణాల్నీ అత్యద్భుతంగా దర్శింప చేసిన ఘనత శ్రీశ్రీది. మానవునిలోని అన్ని పార్శ్వాల్నీ దాదాపుగా వ్యక్తీకరించిన కైత యిది. అన్ని సంబోధనలే! అన్ని పిలుపులే! వియోగి, యోగి, భోగి, త్యాగి, ఊర్ధ్వ దృష్టి, అశాంతుడు, మహాప్రయాణికుడు, సంకుచిత స్వభావుడు, ఆదర్శజీవి, మహాత్ముడు, అవిభక్త కుటుంబి, ఏక రక్త బంధువు, సన్మార్గగామి, పిపాసి, తపస్వి, కవి, వేదాంతి, విజ్ఞాన ధనీ, భావదాత, బుద్ధమూర్తి, జీసస్, సంఘపశువు, (సోషల్ ఎనిమల్) శ్రమైక జీవి, కష్టజీవి, రక్తకణ సమష్టి కుటుంబి, రైతు, కూలి, మాలి, ఖైది, రౌడి, ఖూనీకోర్, బేబి... ఇట్లా మానవునికి ఇంకా ఎన్నెన్నో అవతారాలు (మాధవునికి పదే అవతారాలు) ఆ అవతారాల సంబోధనలు. ''గర్జించు రష్యా'' శ్రీశ్రీ రాసిన మరో కవిత. ఈ కవితా శీర్షిక సైతం సంబోధనే! ఇది శ్రీశ్రీ ప్రత్యేకత. ''గర్జించు రష్యా/ గాండ్రించు రష్యా'' అంటూ తీండ్రించిన సంబోధనలతో ఈ కవిత ఆసాంతం కొనసాగుతుంది.

''జగన్నాథుని రథ చక్రాలు'' ఈ మహా కవిది మరో మహామహా కవిత. మహాదయతో రచించిన కవిత. ''పతితులార'' మొట్ట మొదటి సంబోధన యిది కవితలో. ఎందుకు పతితులయ్యారో శ్రీశ్రీకి తెలుసు. మనకు తెలుసు. జనాన్ని పతనావస్థకు దిగజార్చింది ఉన్నవాళ్లు. ఇది వర్గ సమాజం. (అప్పటికి కుల స్పృహ లేదు శ్రీశ్రీలాంటి ఎందరిలోనో) హావ్సు హావునాట్సు మధ్య సంఘర్షణ తప్పనిసరి అన్నది అతని ప్రాపంచిక దృక్పథం. తరువాతి పిలుపు ''భ్రష్టులార!'' ఇది చిన్నబుచ్చడానికి ఉపయోగించలేదు. ఆ భ్రష్టత్వం ధనవంతుల వల్ల దాపురించింది ప్రజలకు. మూడో సంబోధన ''బాధాసర్ప దష్టులార'' బాధ అనే పాము కాటుతో తల్లడిల్లే వ్యక్తులారా అని చెబుతున్నాడు శ్రీశ్రీ. వీళ్ల ''బ్రదుకు కాలి/ పనికి మాలి/ శని దేవత రథ చక్రపు / టిరుసులలో పడి నలిగిన దీనులూ/ హీనులూ '' అందుకే దీనులార హీనులార సంబోధనలు. ఇంకా ''కూడులేని గూడులేని / పక్షులారా భిక్షులారా'' అన్నాడు. ఏడవకండి అని ధైర్యం చెప్పాడు. ''ఓ వ్యధా నివిష్టులార! ఓ కథావశిష్టులారా! ''ఏడవకండేడవకండి'' అన్నాడు. మరోచోట మధ్యలో ''దగాపడిన తమ్ములార'' అన్నాడు. ఆ పేరుతో తెలుగులో ఏకవచనంతో ఓ నవలే వచ్చినట్లు గుర్తు. ఇంకా ఒకటి రెండు సార్లు ''రారండో రండో రండి'' అన్న పిలుపు కొండంత ధైర్యాన్ని నింపుతాయి. దీనజనుల్లో. అట్లా జగన్నాథుని రథ చక్రాల్ని భూమార్గం పట్టించి భూకంపం సృష్టించడమే గాక ఈ లోకం మీదేనండి/ మీ రాజ్యం మీరేలండి'' అని అనగల్గిన దయాహృదయుడు మహాకవి శ్రీశ్రీ.

మన తెలంగాణ
5
హైదరాబాద్
సోమవారం
12 మార్చి, 2018
www.manatelangana.news



విజేత
సక్సెస్ ఫార్ములా

కలల సాకారంలో విజయం

"కలలు కనండి... వాటిని సాకారం చేసుకోండి" అన్న అబ్దుల్ కలాం మాటలను చక్కగా పాటిస్తున్నారు యువత. చిన్నప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని వాటిని సాధించడంలో ఏమాత్రం వెనుకంజ వేయకుండా కష్టపడుతున్నారు. అలాంటి కోవలోకి వస్తారు మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ఐటీబీపీ తొలి మహిళా అధికారిణి ప్రకృతి, జడ్జి కాబోతున్న పూనమ్‌లు. భారతదేశ యువతీయువకులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. కృషి ఉంటే ఏదైనా సాధ్యమవుతుందని నిరూపించారు వీరిద్దరూ..

జడ్జిగా ఆటోవాలా కూతురు పూనమ్

ఉత్తరాఖండ్‌లో విడుదలైన ప్రొవిన్షియల్ సివిల్ సర్వీసెస్ (జుడీషియల్) 2016 ఫలితాలలో పూనమ్ టోడి రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. పూనమ్ తండ్రి అశోక్ టోడి ఆటో నడిపేవాడు. అతను సంపాదిస్తేనే ఇల్లు గడిచే పరిస్థితి. అశోక్ కు ఇద్దరమ్మాయిలు, ఇద్దరబ్బాయిలు. వాళ్లను చదివించడంలో ఏనాడూ వివక్ష చూపలేదు. మొదట్లో చిన్నకిరాణా కొట్టు నడిపేవాడు. వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో డెహ్రాడూన్‌కు వచ్చి ఆటో నడపడం మొదలుపెట్టాడు. బిడ్డల లక్ష్యాలను నెరవేర్చడం కోసం కష్టపడుతున్నాడు. ఇన్నాళ్లకు కూతురు ద్వారా తన కల నెరవేరినందుకు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాడు.

పూనమ్ ఇంటర్ తర్వాత బికామ్‌లో చేరింది. కానీ ఆమెకు న్యాయవృత్తి మీద ఆసక్తి. దీంతో డిగ్రీ తర్వాత ఎల్ఎల్‌బి ఎంచుకుంది. వెంటనే సివిల్స్ జుడీషియల్ పరీక్షలకు సన్నద్ధం అయింది. రెండు సార్లు పరీక్ష రాసింది. కానీ ఇంటర్వ్యూలో విజయం సాధించలేకపోయింది. అయినా పట్టుదల వదల్లేదు. 2016లోనూ పరీక్ష రాసింది. ఈసారి ఆమె శ్రమ ఫలించింది. ఊహించని రీతిలో మొదటి ర్యాంకు సంపాదించింది. చదువు పూర్తయ్యాక ఏదైనా ఉద్యోగంలో చేరి కుటుంబానికి చేదోడువాదోడుగా ఉందామనుకుంది. కానీ తండ్రి ప్రోత్సాహంతో చదువును కొనసాగించింది. రెండుసార్లు ఓడినా కుటుంబసభ్యుల ప్రోత్సాహంతో ఇంత విజయం సాధించినట్లు చెబుతోంది పూనమ్. జడ్జి కాబోతున్నందుకు తన కుటుంబం పొందుతున్న ఆనందాన్ని వర్ణించలేనంటోంది.





ఐటీబీపీ తొలి మహిళా అధికారిణి ప్రకృతి

ఇండో టిబెటన్ ఇండో సరిహద్దు పోలీస్ దళం (ఐటీబీపీ) తొలి మహిళా అధికారిణిగా అసిస్టెంట్ కమాండెంట్ హోదాలో బాధ్యతలు నిర్వహించబోతోంది పాతికేళ్ల ప్రకృతి. భద్రతా దళాల్లో మహిళా అధికారులను నియమించేందుకు 2016లో ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేసింది. ఈ నేపథ్యంలో కేంద్ర సాయుధ పోలీసు దళాల పరీక్షలను నిర్వహించింది. ఆ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది ప్రకృతి. మొదటి ప్రయత్నంలోనే అనుకున్నది సాధించి శభాష్ అనిపించుకుంది.

ప్రకృతి బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లాలో పుట్టింది. అక్కడే విద్యాభ్యాసం పూర్తిచేసింది. ఆమెది మధ్య తరగతి కుటుంబం. తండ్రి ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేసేవాడు. తల్లి గృహిణి. చిన్నతనం నుంచీ చదువుల్లో ముందుండేది. సాయుధ పోలీస్ దళాల పరీక్ష రాయడానికి ముందు ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ పట్టా తీసుకుంది. తండ్రిని ప్రేరణగా తీసుకుంది. దేశానికి సేవచేసే రంగంలో ఉండాలని కలలుకన్నది. యూనిఫాం ధరించాలనే కోరికను పెంచుకుంది. ఓ ఆంగ్ల దినపత్రికలో ఓ రోజు ఐటీబీపీలో ఉద్యోగాల కోసం ప్రకటన చూసింది. అంతే ఆలస్యం చేయకుండా సవాళ్లతో కూడిన ఆ కొలువును ఎలాగైనా సాధించాలనుకుంది. దరఖాస్తు చేసింది. పరీక్ష రాసి ఫలితాల్లో విజయం సాధించింది. ప్రకృతి తన పేరుకుముందు ఇంటిపేరు పెట్టుకోవడాన్ని అస్సలు ఇష్టపడదు. కేవలం సర్టిఫికెట్లలో రాస్తుంది. కులమతాలకు అతీతంగా ఉండాలంటుంది. వివక్ష అంటే పడదు. ఇంట్లో కూడా అంతే కుటుంబ సభ్యులు తనను తక్కువ చేసి మాట్లాడితే ఊరుకోదు.

ఐటీబీపీలోకి వెళ్లాలన్న ఆమె ఆలోచనకు మొదట్లో తల్లిదండ్రులు భయపడ్డారు. వద్దన్నారు. కానీ ఆమె వారిని ఒప్పించింది. ఆమెపై నమ్మకంతో ప్రోత్సహించారు. పిల్లలు తమ లక్ష్యాన్ని అమ్మానాన్నలకు స్పష్టంగా చెప్పగలగాలి, వారికేమైనా అపోహలు ఉంటే తొలగించే ప్రయత్నం చేయాలి. అంతేకాని లక్ష్యాన్ని వదులుకోకూడదని యువతకు చెప్తుంది. పేరెంట్స్‌కు ఇష్టం లేదని, చాలా మంది తమ ఆశల్ని చంపుకోవడం నేను చాలా మందిని చూశాను అంటుంది ప్రకృతి. పేరెంట్స్‌ను మెప్పించే బాధ్యత మనదే అంటుంది.

ప్రకృతి డెహ్రాడూన్‌లోని ఐటీబీపీకి చెందిన ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో చేరనుంది. ఈ శిక్షణ పూర్తయ్యాక ఐటీబీపీ ఫస్ట్ ఆఫీసర్‌గా బాధ్యతలు తీసుకోనుంది. ప్రస్తుతం అక్కడ 83 వేల మంది విధులు నిర్వర్తిస్తున్నారు. వారిలో కేవలం 15 వందల మంది మాత్రమే మహిళలున్నారు. అంటే 1.75శాతం అన్నమాట. వీరు కూడా ఇప్పుడక్కడ కానిస్టేబుల్ ర్యాంకులోనే పనిచేస్తున్నారు. ప్రకృతి ఏడాది కఠోర శిక్షణ అనంతరం తొలి మహిళా అసిస్టెంట్ కమాండెంట్ హోదాతో విధుల్లో చేరనుంది.



ప్రభుత్వ సేవలన్నీ డిజిటల్‌మయం

మన దేశంలో ప్రభుత్వ సేవలు వేగంగా డిజిటల్‌మయం అవుతున్నాయి. ఎన్నో యాప్‌లు ఇందుకు సాయ పడుతున్నాయి. స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉంటేచాలు ఇంట్లో నుంచే అన్నిపనులూ చకచకా చేసేసుకోవచ్చు. చాలా విషయాలు తెలుసుకోవచ్చు. సామాన్యప్రజానీకానికి ఉపయోగపడే యాప్‌ల గురించి తెలుసుకుందాం...

మై జీహెచ్ఎంసీ
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కు సంబంధించినది ఈ యాప్. లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) దరఖాస్తుల పనితీరు, ప్రాపర్టీ ట్యాక్స్, ట్రేడ్ లైసెన్స్ ఫీజు, బర్త్ సర్టిఫికెట్స్, డెత్ సర్టిఫికెట్స్ లాంటివి, వీటికి సంబంధించిన పత్రాలు డిజిటల్ రూపంలో పొందొచ్చు. చెత్త వేసే ప్రదేశాలు, మ్యాన్ హోల్స్, పాతోల్స్, వీధి లైట్లకు సంబంధించి సమస్యలను దీని ద్వారా ఉన్నతాధికారులకు తెలుపవచ్చు.

హాక్ ఐ
జరుగుతున్న నేరాలను అదుపులో పెట్టుకుని హైదరాబాద్ పోలీసు ఐటీ సెల్ దీన్ని అభివృద్ధి చేసారు. మహిళలు ప్రయాణాల్లో అత్యవసర పరిస్థితులు ఎదురైతే సాయం కోసం ఎస్ఓఎస్ బటన్ ను క్లిక్ చేయవచ్చు. కాంటాక్టు నంబర్లు తెలుసుకునేందుకు, పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. ఈ యాప్ కు జాతీయ స్థాయిలో ఈ గవర్నెన్స్ కేటగిరీ కింద బంగారు పతకం వరించింది.

హైదరాబాద్ ట్రాఫిక్ లైవ్
అధికారుల కాంటాక్టు నంబర్లు, లోకల్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ల సమాచారం, చిరునామా, ట్రాఫిక్ నియమాలు, నిబంధనలు, రోడ్డుపై ప్రయాణించే సమయంలో పాటించాల్సిన టిప్స్, అత్యవసర కాంటాక్టు సమాచారం, ట్రాఫిక్ ఉల్లంఘనలపై జరిమానా, ఆటో చార్జీలు, లైవ్ ట్రాఫిక్ సమాచారం ఇలా ఎన్నో వివరాలు ఈ యాప్ లో పొందవచ్చు. జంట నగరాల పరిధిలో ట్రాఫిక్ సమాచార సేవల కోసం ఉపయోగపడుతుంది.

నరేంద్రమోదీ యాప్
ఇది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారిక యాప్. రోజువారీ కార్యకలాపాల సమాచారం గురించి యాప్ తెలుపుతుంది. ప్రధాన మంత్రి నుంచి నేరుగా సందేశాలు, మెయిల్స్ ను అందుకునే యూనిక్ ఆప్షన్ కూడా యాప్‌లోని ప్రముఖ్యత. యాప్ నుంచి ప్రధాన మంత్రి మన్ కీ బాత్ లో ఏ ఎపిసోడ్ అయినా వినొచ్చు. ప్రధాని బ్లాగులను చదువుకోవడం, బయోగ్రఫీ సెక్షన్ లో ప్రధాని జీవితం గురించి ఎన్నో వివరాలు తెలుసుకునే సదుపాయలూ ఉన్నాయి.

భీమ్ యాప్
పెద్దనోట్ల ప్రభావం ప్రజల్లో చాలావరకు ఉండటంతో డిజిటల్ చెల్లింపుల కోసం తీసుకొచ్చిందే భీమ్ యాప్. భారత్ ఇంటర్ ఫేస్ ఫర్ మనీ (బీహెచ్ఐఎం). యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్ ఫేస్ (యూపీఐ) ఆధారంగా పనిచేస్తుంది. మొబైల్ ఫోన్లో ఈ యాప్ ఉంటే క్షణాల్లో లావాదేవీల చెల్లింపులు, నగదు బదిలీలు సులువుగా చేయడానికి వీలుంటుంది. నేరుగా బ్యాంకు ఖాతా నుంచే చెల్లింపులు వెళతాయి. యూపీఐ అడ్రస్ లేదా మొబైల్ నంబర్, లేదా క్యూఆర్ కోడ్ ఏది ఉంటే దానితోనే యూజర్లు నగదు చెల్లించడం, స్వీకరించడం చేసుకోవచ్చు.

ఎంపాస్ పోర్ట్ సేవా యాప్
పాస్ పోర్ట్ కార్యాలయం అందిస్తున్న అన్ని రకాల సేవల వివరాలూ పొందొచ్చు. పాస్ పోర్ట్ కు సంబంధించి ఎన్నో రకాల సేవలను ఈ యాప్‌ని విదేశాంగ శాఖ వారు కనిపెట్టారు. సమీపంలోని పాస్ పోర్ట్ సేవా కేంద్రాలు (పీఎస్ కే, జిల్లా పాస్ పోర్ట్ సెల్స్ (డీపీసీ) సమాచారాన్ని తెలుసుకోవచ్చు. మీరుండే పిన్ కోడ్ సాయంతో సమీపంలోని కేంద్రం గురించి తెలుసుకోవచ్చు. అప్లికేషన్ తో పాటు చెల్లించాల్సిన ఫీజుల సమాచారం తెలుసుకునే అవకాశం ఉంది. కొత్తగా పాస్ పోర్ట్ కోసం, రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకుంటే డేటాఫ్ బర్త్, ఫైల్ నంబర్ ఆధారంగా స్టేటస్ తెలుసుకోవచ్చు. పాస్ పోర్ట్ పొందాలంటే అందుకు అవసరమైన పత్రాలు, దరఖాస్తు విధానం తదితర సమస్త సమాచారం తెలుసుకోవచ్చు.



ఆర్‌టీఏ ఎం వాలెట్
తెలంగాణ ప్రభుత్వ రవాణా శాఖ వారు తయారు చేసిన ఈ యాప్ వాహనదారులు తమ వాహన డాక్యుమెంట్లను డిజిటల్ రూపంలో భద్రపరుచుకునేందుకు దీనిని రూపొందించారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్సీ), వాహన ఇన్సూరెన్స్ పత్రాలను డిజిటల్ రూపంలో యాప్ లోకి డౌన్ లోడ్ చేసుకోవచ్చు. తనిఖీ సమయంలో ఇవి చూపిస్తే సరిపోతుంది. అసలు పత్రాలను వెంట తీసుకెళ్లక్కర్లేదు, అవి పోతాయని, వర్షానికి తడిసిపోతాయన్న భయం అక్కర్లేదు. ఒక్కసారి వాహన పత్రాలను డౌన్ లోడ్ చేసుకుంటే ఆఫ్ లైన్ లోనూ వాటి సేవలను పొందవచ్చు.

టీ వ్యాలెట్
దీని ద్వారా చెల్లింపులు చేసుకోవచ్చు. లావాదేవీలపై రుసుం ఉండదు. దీనిని తెలంగాణ ప్రభుత్వం టీ వ్యాలెట్ పేరుతో ఓ యాప్‌ను విడుదల చేసింది. ఇది ప్రజలు, ప్రభుత్వానికీ ఉపయోగకరంగా ఉంటుంది. ఎందుకంటే ప్రజలు ప్రభుత్వం నుంచి ప్రయోజనాలన్ని పొందుతున్నప్పుడు... ప్రభుత్వం నేరుగా ప్రజలకు ప్రయోజనాలు అందించాలనుకుంటే అందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. ప్రభుత్వ, ప్రైవేటు లావాదేవీలకు ప్రజలు చెల్లింపులు చేసుకోవచ్చు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు యాప్ ప్రయోజనాలను అందిస్తుంది.

టీ రేషన్
తెలంగాణ పౌర సరఫరాల శాఖ టీ రేషన్ పేరుతో ఒక యాప్ ను తీసుకొచ్చింది. దీని ద్వారా రేషన్ కార్డుదారులు తమ కార్డుపై ప్రభుత్వం ఎంత మేర కోటా విడుదల చేసింది?, ఏ రేషన్ షాపునకు?, ఓ రేషన్ షాపునకు విడుదల చేసిన కమోడిటీలు, ప్రస్తుతం రేషన్ దుకాణంలో ఉన్న స్టాక్, రేషన్ కార్డుపై జరిగిన లావాదేవీల గురించి తెలుసుకోవచ్చు.

ఓటర్ సర్వీసెస్
ఈ యాప్ ద్వారా ప్రజలు ఎలక్టోరల్ రోల్ లో తమ పేరును సరి చూసుకోవచ్చు. కొత్త ఓటర్ ఐడీ కార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటరు కార్డులో మార్పులు చేర్పులతోపాటు ఓటరు జాబితా నుంచి తమ పేరును తొలగించుకోవచ్చు.

కిసాన్ సువిధ
రైతులకు ఉద్దేశించిన యాప్ ఇది. రైతులకు సమాచారాన్ని వేగంగా అందించేందుకు తీసుకొచ్చారు. తామున్న ప్రాంతంలో ప్రస్తుత వాతావరణం, రానున్న ఐదు రోజుల్లో వాతావరణం ఎలా ఉంటుంది, సాగు సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, సమీపంలోని కమోడిటీల మార్కెట్ ధరలు, సంబంధిత పంటకు రాష్ట్రంలోఉన్న గరిష్ట ధరలు తెలుసుకోవచ్చు.

సీబీఈసీ జీఎస్టీ (CBEC GST)
వస్తు సేవల పన్ను (జీఎస్టీ) 2017 జూలై 1 నుంచి అమల్లోకి వచ్చింది. కొత్త పన్ను చట్టానికి మారడం ఎలా, జీఎస్టీ నిబంధనలు, చట్టం ఇతర పూర్తి వివరాలను ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. జీఎస్టీకి సంబంధించి తాజాగా చేసిన మార్పులు, చేర్పుల సమాచారం కూడా లభిస్తుంది. సీబీఈసీ హెల్ప్ డెస్క్ ను ఈ యాప్ నుంచే సంప్రదించొచ్చు.

ఎంఈఏ ఇండియా
ఇది మినిస్ట్రీ ఆఫ్ ఎక్స్ టర్నల్ అఫైర్స్ (విదేశాంగ శాఖ) అధికారిక యాప్. విదేశాంగ శాఖ పరిధిలో అన్ని సేవల సమాచారం ఈ యాప్ లో ఉంది. ఈ సిటిజన్, పాస్ పోర్టులు, వీసాలు, ఇండియన్ ఎంబసీలు, హై కమిషన్ల సమాచారం ఉంటుంది. శాఖ తరపున మీడియా ప్రకటనలు కూడా చూడొచ్చు.

హెచ్ పీ గ్యాస్ బుకింగ్
గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకునేదుకు, రీఫిల్ హిస్టరీ చూసుకునేందుకు, ఎల్పీజీ కనెక్షన్ ను సరెండర్ చేసేందుకు, ఫిర్యాదు చేసేందుకు ఈ యాప్ అనువుగా ఉంటుంది. హెచ్ పీ గ్యాస్ వినియోగదారులు దీన్ని డౌన్ లోడ్ చేసుకోవడం ద్వారా సేవల్ని సులభంగా పొందడానికి వీలవుతుంది.

మీ సేవ యాప్
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పౌర సేవలను స్మార్ట్ ఫోన్ నుంచే పొందేందుకు గాను మీ సేవ యాప్ ను ఆవిష్కరించింది. ఇది పౌర సేవల యాప్. దాదాపు చాలా రకాల ప్రభుత్వ సేవలు దీని ద్వారా పొందొచ్చు. ఎలక్ట్రిసిటీ బిల్లులు, వాటర్, గ్యాస్ బిల్లులు, పన్నుల చెల్లింపులు, బ్యాంకింగ్, వ్యవసాయం, పాస్ పోర్ట్ అప్లికేషన్ స్టేటస్, వార్తలు, హెల్త్ కేర్ ఇలా ఎన్నో రకాల సేవలు, సమాచారం పొందడానికి అవకాశం ఉంది. ఈ యాప్ నుంచి బిల్లులు, పన్నుల చెల్లింపులకు గాను పేమెంట్ గేట్ వే కూడా ఉంది.

హజ్ యాత్రికులు ఆరోగ్యంపై దృష్టిపెట్టాలి : హజ్ కమిటీ చైర్మన్

మన తెలంగాణ / హైదరాబాద్ : హజ్ యాత్రకు వెళ్ళనున్న భక్తులు తమ ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్ మసిఉల్లా ఖాన్ సూచించారు. హైదరాబాద్ లోని అంబర్‌పేటలో ఆదివారం జరిగిన హజ్ యాత్రీకుల మూడో శిక్షణా శిబిరంలో రాష్ట్రం నుండి హజ్‌కు వెళ్లేందుకు ఎంపికైన భక్తులకు శిక్షణ ఇచ్చారు. మసిఉల్లా ఖాన్ మాట్లాడుతూ హజ్ యాత్రకు వెళ్లేవారు ఆరోగ్యంగా ఉండాలని ఇందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భక్తులు హజ్‌కు సంబంధించిన సమస్యలు, పనులపై హజ్ కమిటి సిబ్బంది మినహా ఇతరులను సంప్రదించవద్దన్నారు. హజ్ యాత్రీకులు హజ్‌కు బయలుదేరడం మొదలు సౌదీ అరేబియాలో బస చేసే వరకు ప్రభుత్వం ఎంపిక చేసిన సహాయకులు సేవలందిస్తారని హజ్ కమిటి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్ఎ షుకూర్ తెలిపారు. రుబాత్ క్యాటగిరిలో వసతి కల్పించేందుకు హజ్ సీజన్–18 అజీజియా క్యాటగిరిలో దరఖాస్తు చేసుకున్నవారి నుంచే భక్తులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. హజ్ ప్రాముఖ్యత, అనుసరించాల్సినవి, అనుసరించకూడనివి, ప్రార్థనల ప్రాముఖ్యత, తీసుకోవాల్సిన జాగ్రతలు తదితరాలపై రిలీజియస్ స్కాలర్స్ ప్రసంగించారు. తెలంగాణ హజ్ కమిటి సభ్యుడు మొహమ్మద్ అంజద్ అలీ కూడా ఈ సందర్భంగా ప్రసంగించారు.



సంపూర్ణ తెలంగాణ చరిత్ర అవసరం

మనతెలంగాణ/హైదరాబాద్ : సంపూర్ణ తెలంగాణ చరిత్రను రాయాల్సిన అవసరం ఉందని, దానిపై ప్రభుత్వం దృష్టి సారించాలని రిటైర్డ్ హిస్టరీ ప్రొఫెసర్ అడపా సత్యనారాయణ కోరారు. తెలంగాణ చరిత్రలో వక్రీకరణలు, అవాస్తవాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల చరిత్రను రచించాల్సిన అవసరం ఉందని, సమగ్ర రచన చేయడం కోసం నిపుణులతో కమిటీ నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. టిఆర్ఎస్ ఈ అంశాన్ని తన మెనిఫెస్టోలో పొందుపరచడంతోపాటు గత అసెంబ్లీ సమావేశాలలో కూడా సిఎం కెసిఆర్ తెలంగాణ నిజమైన చరిత్రను రాయిస్తాం అని ప్రకటించారని గుర్తు చేశారు. సమైక్యపాలనలో నిరాదరణకు గురైన తెలంగాణ చరిత్రను తిరగరాయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ప్రొఫెసర్ ఇ.సుధారాణి మాట్లాడుతూ, చరిత్ర పుటల్లో తెలంగాణ చరిత్ర కనిపించడం లేదని అన్నారు. గొప్ప చరిత్ర కలిగిన తెలంగాణకు చరిత్ర గురించి వెతుక్కోవాల్సిన పరిస్థితి ఉందని చెప్పారు. చరిత్ర పుటల్లో దళితులు, స్త్రీల ప్రస్తావన లేదని తెలిపారు. భవిష్యత్తు తరాలకు వాస్తవ చరిత్రను అందించాలని తెలిపారు. ట్రైబల్ మ్యూజియం డైరెక్టర్ డి.సత్యనారాయణ మాట్లాడుతూ, ఇప్పటివరకు సమగ్ర తెలంగాణ చరిత్ర లేదన్నారు. కనీసం ఏడాదిపాటు 100 మంది నిష్ణాతులు శోధించి రాస్తే సమగ్ర తెలంగాణ చరిత్ర బయటకు వస్తుందని చెప్పారు. ప్రభుత్వం తెలంగాణ చరిత్ర రచన కోసం కమిటీని నియమించాలని, లేనిపక్షంలో తాము ఐదు సంపుటాలతో తెలంగాణ చరిత్రను తీసుకువస్తామని తెలిపారు. ఒయు అధ్యాపకులు జి.అంజయ్య మాట్లాడుతూ, సమగ్ర తెలంగాణ చరిత్రను రాసేందుకు ఎలాంటి పారితోషికం లేకుండా స్వచ్ఛందంగా పనిచేసేందుకు తాము సిద్దంగా ఉన్నామని అన్నారు.

సామాజిక, ఆర్థిక మార్పులు జరగాలి

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రజల్లోకి వెళ్ళి వారి బతుకుల్లో వెలుగులు నింపాలని, సామాజిక, ఆర్థిక మార్పులకోసం కృషి చేయాలని మలేషియాకు చెందిన డిఎక్స్ఎన్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, బౌద్ధ తాత్విక మేధావి డాక్టర్ లిన్ వ్యాఖ్యానించారు. రాష్ట్రప్రభుత్వానికి చెందిన బుద్ధవనం ప్రాజెక్టు ఆధ్వర్యంలో నగరంలో ఆదివారం జరిగిన ఆచార్య నాగార్జున ఉపన్యాసం పరంపర కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ లిన్ ప్రసంగిస్తూ, ఆచార్యనాగార్జున మొదటి ఉపన్యాసం 'సామాజిక పరివర్తనలో సద్ధర్మ పుండలీక పాత్ర(లోటస్ సూత్ర)' ను వివరించారు. బౌద్ధ మతం ధ్యానానికో, గదుల్లో ఉండిపోయి ప్రార్థనలు చేయడానికో పరిమితం కాదని, ప్రజల బతుకుల్లోకి వెళ్లి వారి సమస్యల పరిష్కారానికి కృషిచేసి శాంతిని, సంతోషాన్ని, సమానత్వాన్ని అందించేదని అన్నారు. ఆచార్య నాగార్జున రాసిన 'సద్ధర్మ పుండరీక' అనే గ్రంథం ఇదే విషయాన్ని తెలియచేస్తోందన్నారు. బుద్ధవనం ప్రాజెక్టు ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ మనం సంతోషంగా ఉండడం కంటే మన చర్యల వల్ల ఇతరులు సంతోషంగా ఉండాలని బౌద్ధం చెబుతోందన్నారు. ఆచార్య నాగార్జున ఎన్నో ధార్మిక గ్రంథాలు రాసారని, ఎన్నో సిద్ధాంతాలను అందించారని చెప్పారు. వాటిని ఇక నుంచి క్రమం తప్పకుండా ఈ కార్యక్రమాన్ని నిర్వహించి మననం చేసుకుందామని చెప్పారు. ప్రతి నెల మూడవ ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించేలా ప్రణాళిక తయారు చేసినట్లు ఆయన చెప్పారు. ఇది మన అందరి కార్యక్రమంగా భావించి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మంటల్లో చిక్కుకున్న విద్యార్థులు

చెన్నై : తమిళనాడులో ఒక కొండపై అలుముకున్న మంటలలో 60 మందికి పైగా విద్యార్థులు చిక్కుకున్నారు. థేనీ జిల్లాలో కురంగిణి అడవులలో ఒక కొండపై మంటలు వ్యాపించాయి. విజ్ఞాన యాత్రకు బస్సులలో అక్కడికి విద్యార్థులు వెళ్లిన దశలోనే మంటలు అలుముకున్నాయి. దీనితో విద్యార్థుల పరిస్థితి ప్రమాదకరంగా మారింది. మంటల తీవ్రతతో ఒక యువతి దుర్మరణం చెందినట్లు, పలువురికి గాయాలు అయినట్లు తెలిసింది. మంటలు అంటుకున్న విషయం తెలియగానే తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామి వారి రక్షణకు చర్యలు చేపట్టారు. వెంటనే వారిని ఆదుకునేందుకు వైమానిక దళాలను పంపించాలని కేంద్ర రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఫోన్ చేసి చెప్పారు. వెంటనే మంత్రి స్పందించి తగు విధంగాచర్యలకు ఆదేశించారని వెల్లడైంది. ఆమె వెంటనే జిల్లా కలెక్టరుతో కూడా మాట్లాడారు. ఎయిర్‌ఫోర్సు సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుందని, కొందరు విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించిందని తెలిసింది. ఘటనపై పూర్తి వివరాలు వెల్లడికావల్సి ఉంది. ఈరోడ్, కోయంబత్తూరు నుంచి విద్యార్థులు ఎక్స్‌కర్షన్‌కు వెళ్లారు. మంటలు వ్యాపించడం, బలీయమైన గాలులతో పరిస్థితి తీవ్రస్థాయికి చేరింది. పలు కిలోమీటర్ల మేరకు అడవుల మంటలు రగులుకుంటున్నట్లు తెలిసింది. ఘటనా స్థలానికి వెంటనే కలెక్టర్, ఎస్‌పి ఇతర ఉన్నతాధికారులు బయలుదేరి వెళ్లారు. ఎక్స్‌కర్షన్‌కు వెళ్లిన విద్యార్థుల ఫోన్లు పనిచేయకపోవడం, సమాచార సంబంధాలు తెగిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరు అవుతున్నారు.

సమరానికి సన్నద్ధం కావాలి : వక్తలు



మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రజాస్వామ్యం, చట్టాలు, హక్కులు తదితర అంశాల గురించి మాట్లాడే నైతికత ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావుకు ఏ మాత్రం లేదని తెలంగాణ ప్రజాస్వామిక వేదిక ఆరోపించింది. ఢిల్లీలో ఆందోళనలు, కేంద్రంపై ఒత్తిడి చేస్తానని చెప్పడం అర్థరహితమని వేదిక ప్రతినిధులు మండిపడ్డారు. ఉద్యమాలతో ఆవిర్భవించిన తెలంగాణలో కనీస హక్కులను కాలరాస్తూ పాసిస్టు పాలనకు పరాకాష్టగా మారిందన్నారు. జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభ, యాత్ర పట్ల ప్రభుత్వం దమనకాండను ప్రయోగించిందని ధ్వజమెత్తారు. దీన్ని వేదిక తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ప్రభుత్వ దమనకాండను తిప్పికొట్టేందుకు అన్ని పక్షాలూ సమాయత్తం కావాలని ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వేదిక ప్రతినిధులు పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో అమలైనదానికంటే ఎక్కువ నిర్బంధాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రయోగిస్తోందని మండిపడ్డారు. మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభను భగ్నం చేసిన ఘటనే ఇందుకు పరాకాష్ట అని అన్నారు. సీఎం కేసీఆర్‌ను గాంధీగా కొందరు అభివర్ణిస్తున్నారని, కానీ పోలీసులు, మిలిటరీతో సాగే పాలన పరాయిపాలనలాంటిదేనని మహాత్మాగాంధీ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తెలంగాణలోని ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కోరుకుంటున్నారని, నిర్బంధాన్ని ఏ మాత్రం సహించరని వ్యాఖ్యానించారు. ప్రొఫెసర్ పిఎల్.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ టీఆర్ఎస్‌ను కుటుంబ సమితిగా అభివర్ణించారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఇప్పటి వరకు 62 వేల పోలీసు నియామకాలు జరిగాయని, రాజ్యహింసకు ఇదే కారణమని ఆరోపించారు. సీపీఐ నాయకుడు సుధాకర్ మాట్లాడుతూ పోలీసులే ఈ స్ఫూర్తియాత్రను జయప్రదం చేశారని, వారిలోని తెలియని భయమే ఈ విషయాన్ని ప్రజల్లోకి విసృత్తంగా తీసుకెళ్ళిందన్నారు. 12 వేల మంది పోలీసులతో ఎక్కడికక్కడ అరెస్టులు కొనసాగాయని, శాంతియుతంగా ఆట – పాట – మాటను నిర్వహించుకుంటామంటే అనుమతించని సర్కార్ అధికారికంగా రెండువేలకు పైగా మందిని అరెస్టు చేసిందన్నారు. ఇటువంటి అప్రజాస్వామిక పాలనపై పోరాడేందుకు సీపీఐ ఎప్పుడూ ముందుంటుందన్నారు. న్యూడెమోక్రసీ నేత గోవర్ధన్ మాట్లాడుతూ నాడు తెలంగాణ కాంక్షను ప్రపంచానికి చాటిన ఘనత మిలియన్ మార్చ్‌దన్నారు. అధిపత్యానికి వ్యతిరేకంగా చరిత సృష్టించిందని అన్నారు.పిఓడబ్ల్యూ నాయకురాలు సంధ్య, న్యూడెమోక్రసీ నాయకులు రమాదేవితో పాటు వివిధ సంఘాల ప్రతినిధులు మాట్లాడారు.

ఇంజినీరింగ్‌కు ఇదే చివరి ఎంసెట్?

- వచ్చేసారి జాతీయ స్థాయిలో ఒకే పరీక్ష
- విద్యార్థులకు తగ్గనున్న పరీక్షల భారం

మనతెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎంసెట్‌కు ఇదే చివరిది కానుంది. వచ్చే విద్యాసంవత్సరం నుంచి జాతీయ స్థాయిలో ఇంజనీరింగ్ ప్రవేశాలకు ఒకే ప్రవేశ పరీక్ష అమలులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఈ అంశానికి సంబంధించి కేంద్రం చర్యలు తీసుకుంటోంది. జాతీయస్థాయిలో నిర్వహించే జెఇఇ మెయిన్ ద్వారానే ఎన్ఐటి, ట్రిపుల్ ఐటిలతోపాటు రాష్ట్రాలలోని ఇంజనీరింగ్ కళాశాలల్లోని సీట్లను భర్తీ చేసే అంశంపై అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఎఐసిటిఇ) కసరత్తు చేస్తోంది. ఈ ఏడాది నుంచి జాతీయ స్థాయిలో ఒకే పరీక్ష నిర్వహించాలని భావించినా కొన్ని రాష్ట్రాలు వ్యతిరేకించడంతో వాయిదా పడింది. వచ్చే ఏడాది అమలుకు అన్ని రాష్ట్రాల అభిప్రాయాలను రాతపూర్వకంగా సేకరించి బాధ్యతను ఎఐసిటిఇకి అప్పగించింది.

విద్యార్థులకు ఉపశమనం

ఇంజినీరింగ్‌లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో ఒకే ప్రవేశ పరీక్ష అమలులోకి వస్తే వివిధ ప్రవేశ పరీక్షలు రాసే విద్యార్థులకు ఉపశమనం లభిస్తుంది. ప్రస్తుతం ఇంజనీరింగ్ సీటు కోసం ఒక్కో విద్యార్థి కనీసం ఐదారు పరీక్షలు రాయాల్సి వస్తోంది. ఒక్కో పరీక్షకు ఒక్కో రకమైన సిలబస్ ఉంటుండంతో ఏ పరీక్షపైన పూర్తి స్థాయిలో దృష్టి సారించాలో అర్థం కాక అయోమయానికి గురవుతున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని ఇంజనీరింగ్ కళాశాలలు సరైన ప్రమాణాలు పాటించడం లేదన్న భావనతో వేలాదిమంది విద్యార్థులు కనీసం 34 డీమ్డ్ వర్సిటీల ప్రవేశ పరీక్షలు రాస్తున్నారు. అలాగే ఎన్ఐటి, ఐఐటిలలో ప్రవేశాలకు నిర్వహించే జెఇఇ మెయిన్స్, అడ్వాన్స్‌డ్‌తో పాటు తెలంగాణ, ఎపి ఎంసెట్ పరీక్షలకూ హాజరవుతున్నారు. ఈ ప్రవేశ పరీక్షలకు సుమారు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు




ఫీజులు చెల్లించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి 'నీట్' తరహాలో జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష అమలులోకి వస్తే విద్యార్థులు, తల్లిదండ్రుల ఇబ్బందులు తగ్గుతాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఎంసెట్‌లో ఇంటర్ మార్కులకు 25 శాతం వెయిటేజి విధానం ఉంది. ఈ నేపథ్యంలో జాతీయస్థాయిలో ఒకే పరీక్ష నిర్వహిస్తే అందులో వెయిటేజి ఉంటుందా..? లేదా..? అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుని, తమ అభిప్రాయాన్ని ఎఐసిటిఇకి లేఖ రాయనున్నట్లు తెలిసింది.

ఎంసెట్‌కు తగ్గనున్న ప్రాధాన్యత

ఎంసెట్ నుంచి వైద్య విద్య తొలగిపోవడంతోనే ఈ పరీక్షకు ప్రాధాన్యత తగ్గగా, ఇంజనీరింగ్ కోర్సులు కూడా తొలగిస్తే ఎంసెట్ ప్రాధాన్యత మరింతగా తగ్గుతుంది. ప్రస్తుతం ఎంసెట్ ద్వారా ఇంజనీరింగ్, ఫార్మసీ, బి.ఎస్సీ(అగ్రికల్చరల్), వెటర్నరీ కోర్సులలో సీట్లు భర్తీ చేస్తున్నారు. ఇందులో బి.ఎస్సీ(అగ్రికల్చరల్), వెటర్నరీ కోర్సులకు డిమాండ్ ఉండగా, ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సులకు మాత్రం అంతగా డిమాండ్ ఉండటం లేదు. రాష్ట్రంలో ఇంజనీరింగ్ డిమాండ్ పడిపోతుండటంతో ఎంసెట్ అవసరమే లేదన్న అభిప్రాయలూ వ్యక్తమవుతున్నాయి. ఇంజనీరింగ్‌లో కొన్ని కళాశాలలు మినహా మిగతా కళాశాలల్లో ప్రతీ ఏటా సీట్లు మిగిలిపోతున్నాయి. ఏటా ఇంజనీరింగ్ విభాగంలో ఎంసెట్‌కు హాజరయ్యే విద్యార్థుల కంటే సీట్లే అధికంగా ఉంటున్నాయి.

మంత్రి హరీశ్‌రావుపై ఆధారాలుంటే బయటపెట్టు



మన తెలంగాణ/హైదరాబాద్: మంత్రి హరీష్‌రావు బిజెపి అధినేత అమిత్‌షాతో కలిసినట్టు ఆధారాలు ఉంటే బహిర్గతం చేయాలని కాంగ్రెస్ నాయకుడు రేవంత్ రెడ్డిని టిఆర్ఎస్ ఎంఎల్‌సి కర్నె ప్రభాకర్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ అమిత్‌షాతో మంత్రి హరీష్‌రావు కలిసినట్లు కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి గాలిమాటలు మాట్లాడుతున్నారన్నారు. రేవంత్‌రెడ్డి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, విచ్చవిడితనం పెరిగిందన్నారు. గతంలో సిద్ధిపేట నియోజకవర్గంలో ప్రభుత్వ కళాశాల ఏర్పాటు నిమిత్తం దివంగత సిఎం వైఎస్‌ను కలిసినట్లు స్వయంగా హరీశ్‌రావే గతంలో ప్రకటించారని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటికీ నుంచి ఏ ఎన్నికలు వచ్చినా ప్రజలు టిఆర్ఎస్‌నే గెలిపిస్తున్నారని చెప్పారు. తమకు భవిష్యత్తు లేదని భావించే ప్రతిపక్షాలు టిఆర్ఎస్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు.

మహిళా సాధికారతకు నాంది పలికింది కాంగ్రెస్సే

పిసిసి చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి



మనతెలంగాణ/అమీన్‌పూర్ : సమాజంలో మహిళల సాధికారతకు కాంగ్రెస్ నాంది పలికితే టిఆర్ఎస్ మాత్రం మహిళలను అసమానతకు గురిచేస్తుందని తెలంగాణ రాష్ట్ర పిసిసి అధ్యక్షుడు ఉత్తం కుమార్‌రెడ్డి అన్నారు. మహిళలను చైతన్యపరచడమే కాంగ్రెస్ మూల సిద్ధాంతమని, అందుకు అనుగుణంగా కాంగ్రెస్ పాలన కొనసాగించిందని ఆయన పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కాట శ్రీనివాస్, ఎంపిటిసి సుధారిణి ఆధ్వరంలో చేపట్టిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పిసిసి చీఫ్ ఉత్తం కుమార్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహ, మాజీ మంత్రి డి.కె.అరుణతో పాటు రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నేరెళ్ల శారద పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వం మహిళల పట్ల చూపిస్తున్న వివక్షతపై నిప్పులు చెరిగారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షమేరకు నాడు సోనియాగాంధి, మీరా కూమార్ కృషి చేయబట్టే నేడు ప్రత్యేక రాష్ట్రం అవిర్భవించిందన్నారు. లేదంటే కెసిఆర్ జేజెమ్మలు దిగివచ్చినా తెలంగాణ వచ్చేదా అని మండిపడ్డారు. మోసపూరిత మాటలతో అధికారంలోకి వచ్చిన కెసిఆర్ నాటి నుండి నేటి వరకు అబద్ధాలతోనే కాలం గడిపేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నాడన్నారు. 2019లో తిరిగి రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని, వచ్చిన వెంటనే రాష్ట్రంలోని ఆరు లక్షల సంఘాలకు ప్రతి మహిళా సంఘానికి పది లక్షల చొప్పున వడ్డీ లేని రుణం ఇస్తామని, లక్షల రూపాయల చొప్పున రివాల్వింగ్ ఫండ్ అందిస్తామని, అభయ హస్తం పథకాన్ని పునరుద్ధరించి రూ.500 నుండి వెయ్యి రూపాయలకు పెంచుతామన్నారు. మహిళా సంఘాల ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని, 1800 మంది విఏఒలకు 3000 వేల నుండి పదివేల వేతనం పెంచుతామని పిసిసి చీఫ్ ఉత్తం కుమార్‌రెడ్డి హామీనిచ్చారు.

అభయ హస్తం ప్రజల హక్కు

పింఛను వయో పరిమితి 60 ఏళ్ల నుండి 65 ఏళ్లకు పెంచి వృద్ధుల జీవితాలలో ఆడుకుంటున్నారని, కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చిన పింఛను సొమ్మును మిషన్ భగీరథ పనులకు తరలించి కమీషన్ల మత్తులో జోగుతున్నాడని మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర్ ఆరోపించారు. అభయ హస్తం ప్రజల హక్కని, అభయ హస్తం నుండి వచ్చిన రూ.960 కోట్ల ప్రజల సొమ్ము ఏమైందని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 2004 వైఎస్ వచ్చాకే మహిళలు ఆర్థిక సాధికారిత సాధించారని, నాలుగేళ్లలో మహిళా సంఘాలు అస్తవ్యస్థంగా మారాయన్నారు. స్త్రీ శక్తి నిధి బ్యాకు మహిళ చేతుల్లో లేదని మైక్రో ఫైనాన్స్ కంటే అధ్వానంగా తయారయిందని ఆయన దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలోజిల్లా మహిళా అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, పద్మిని రాజనర్సింహా, బెల్లయ్య, శ్రవన్, రాధిక సురెందర్‌రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి చెక్కుల పంపిణీ 'ఆన్‌లైన్'

- సిఎంఒ, వ్యవసాయ కమిషనరేట్ల నిరంతర పర్యవేక్షణ
- చెక్కులు ఇచ్చేముందు రైతు కులం.. జెండర్ సేకరణ

మన తెలంగాణ/హైదరాబాద్ : పెట్టుబడి (రైతు లక్ష్మీ) చెక్కులను రైతులకు అందించిన రోజే సాయంత్రం 6 గంటలలోపు లబ్దిదారుల సమాచారాన్ని అధికారులు వెబ్‌పోర్టల్‌లో నమోదు చేయనున్నారు. సంబంధిత గ్రామ పరిధికి చెందిన వ్యవసాయ విస్తరణ అధికారి ఈ వివరాలను ప్రభుత్వం సూచించిన వెబ్‌సైట్లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఏయే గ్రామాలలో చెక్కుల పంపిణీ జరిగింది, ఎంతమంది రైతులకు ఇచ్చారు తదితర వివరాలను ఎప్పటికప్పుడు సిఎం కె. చంద్రశేఖర్‌రావు కార్యాలయం సహా, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనరేట్ నిరంతరం ఆన్‌లైన్‌లో పర్యవేక్షించే వెసులుబాటును కూడా కల్పించనున్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యవసాయ శాఖ పెట్టుబడి పథకం అమలుకు మార్గదర్శకాలను రూపొందిస్తోంది. చెక్కుల పంపిణీ సమయంలో రైతుల నుంచి కులం, జెండర్ వివరాలను కూడా ఎఇఒలు సేకరించనున్నారు. ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ, మహిళలకు పెట్టుబడి పథకం కింద ఎంత మొత్తం ఇస్తున్నారో లెక్క తేల్చేందుకే ఈ వివరాలను తీసుకోనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారి ఒకరు 'మన తెలంగాణ'కు చెప్పారు. ఇందుకు ఎఇఒలు రెండు రిజిస్టర్లను నిర్వహించనున్నట్లు చెప్పారు. చెక్కులు పంపిణీ చేయడానికి రెండు, మూడు రోజుల ముందే గ్రామంలో చాటింపు జరుగుతుందన్నారు. ఒకే రోజు ఎంఎల్‌ఎలు, రైతు సమన్వయ సమితి సభ్యులు ఇతర ప్రజా ప్రతినిధుల సమక్షంలో గ్రామ సభ నిర్వహించి రైతులందరికీ చెక్కులు ఇస్తే తగిన ప్రచారం వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. గ్రామాలవారీగా ఏయే రోజు చెక్కులు పంపిణీ చేసే అంశాన్ని వ్యవసాయ శాఖ అధికారితో సంప్రదింపులు జరిపి జిల్లా కలెక్టర్ ఖరారు చేస్తారు. సంబంధిత రైతులే చెక్కులు తీసుకుంటున్నారా లేదా అనే నిర్ధారించడానికి గ్రామ రెవిన్యూ అధికారి, విఆర్‌ఎలు ఆ కార్యక్రమానికి ఖచ్చితంగా హాజరయ్యేలా ఆదేశాలు జారీ చేయనున్నారు. మొత్తం మూడు దశలలో రైతు లక్ష్మి పథకం అమలు కానుంది. ఏప్రిల్ 20వ తేదీన మొదటి దశను సిఎం కె. చంద్రశేఖర్‌రావు ప్రారంభించనున్నారు. ఇదిలా ఉండగా బ్యాంకుల వారీగా చెక్కుల ముద్రణపై స్పష్టత వచ్చింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 321 మండలాల్లో 38.08 లక్షలు, ఆంధ్రాబ్యాంకు 128 మండలాల్లో 17.20 లక్షలు, సిండికేట్ బ్యాంకు 38 మండలాల్లో 5.82 లక్షలు, కార్పొరేషన్ బ్యాంకు 31 మండలాల్లో 4.39 లక్షలు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ 27 మండలాల్లో 3.59 లక్షలు, కెనరా బ్యాంకు 23 మండలాల్లో 3.12 లక్షల చెక్కుల చొప్పున ముద్రించనున్నాయి. ఏ బ్యాంకులోనైనా ఆ చెక్కులు చెల్లుబాటు అయ్యేలా 'ఆర్డర్డ్ చెక్కుల'ను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే.

ఉచిత శిక్షణతో లబ్ధిపొందుతున్న నిరుపేద బిసిలు

మన తెలంగాణ / హైదరాబాద్ : విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అర్హత సాధించేందుకు ఇతరులతో పోటీ పడే విధంగా పభుత్వం అందిస్తున్న ఉచిత శిక్షణ నిరుద్యోగ బిసి అభ్యర్థులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. రాష్ట్ర బిసి ఎంప్లాయిబిలిటి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణా కేంద్రం ద్వారా నిరుద్యోగ బిసి యువతకు వివిధ రంగాల్లో ఉచిత శిక్షణ లభిస్తోంది. పోటీ పరీక్షలైన సివిల్ సర్వీసెస్, గ్రూప్–1, గ్రూప్–2, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, ఆర్‌ఆర్‌బి, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు, డిఎస్సి పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తోంది. ప్రైవేటు రంగంలో ఉపాధి అవకాశాలను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు, నిరుద్యోగ యువతకు వృత్తి నైపుణ్యాభివృద్ధి శిక్షణ కూడా అందిస్తోంది. సివిల్ సర్వీసెస్, గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షల శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులకు నెలకు రూ.1500 స్టైఫండ్ రూపంలో చెల్లిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 10 కేంద్రాల్లో శిక్షణ ఇస్తోంది. 2016–17 ఆర్థిక సంవత్సరంలో ఇందుకుగాను ప్రభుత్వం రూ.25.50 కోట్లను కేటాయించింది. ఇప్పటివరకు 2,169 మంది అభ్యర్థులకు శిక్షణ ఇవ్వగా వీరిలో 1500 మంది బాలురు, 669 మంది బాలికలు ఉన్నారు. 2017–18 ఆర్థిక సంవత్సరంలో ఉచిత శిక్షణకు రూ.14 కోట్లు కేటా యించి 5000 మందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ శిక్షణా తరగతులకు 2,527 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి.

ఉద్యోగాల భర్తీపై ఉమ్మడి ఉద్యమం

మన తెలంగాణ / హైదరాబాద్ : ఉద్యోగాల భర్తీపై ఉమ్మడి ఉద్యమం చేపట్టాలని నిరుద్యోగ సంఘాలు, యూనివర్శిటీ విద్యార్థి సంఘాలు నిర్ణయించాయి. ఉద్యోగాల భర్తీ విషయమై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని బీసీ సంఘం నేత, శాసనసభ్యుడు ఆర్.కృష్ణయ్యకు విజ్ఞప్తి చేశాయి. తెలంగాణ ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నందున ప్రభుత్వంపై వత్తిడి పెంచే వరకు అన్ని నిరుద్యోగ సంఘాలు, విద్యార్థి సంఘాలు, యూనివర్శిటీ విద్యార్థి నాయకులు సమైక్యంగా ఉమ్మడి ఉద్యమం చేపట్టాలని నిర్ణయించారు. ఆదివారం బిసి భవన్‌లో తెలంగాణ నిరుద్యోగ జాక్, తెలంగాణ నిరుద్యోగ సంఘర్షణ సమితి, తెలంగాణ నిరుద్యోగ యువజన సంఘం, ఉస్మానియా, శాతవాహన, తెలుగు యూనివర్శిటీ, మహాత్మాగాంధీ యూనివర్శిటీకి చెందిన ముఖ్యమైన నేతలు సమావేశమై నిరుద్యోగ సమస్యపై ఉద్యమ ఎజెండాను చర్చించారు. సోమవారం నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వాన్ని నిలదీయాలని శాసనసభ్యుల ఆర్ కృష్ణయ్యకు విజ్ఞప్తి చేశారు. ఆర్.కృష్ణయ్య ప్రసంగిస్తూ ఉద్యోగాల భర్తీపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో గ్రూప్–1 సర్వీస్ కింద 1200, గ్రూప్–2లో 3 వేలు, గ్రూప్–3 క్రింద 8 వేలు, గ్రూప్–4 క్లెరికల్ ఉద్యోగాలు 36 వేలు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటి భర్తీకి వెంటనే నోటిఫికేషన్ జారీచేయాలన్నారు.

స్టాఫ్ నర్స్ పరీక్షకు 99.9% హాజరు

మనతెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, వైద్య విధాన పరిషత్‌లో స్టాఫ్ నర్స్ పోస్టుల భర్తీకి ఆదివారం నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్ష(సిబిఆర్‌టి)లకు 99.9 శాతం హాజరు నమోదైనట్లు టిఎస్‌పిఎస్‌సి కార్యదర్శి ఎ.వాణిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు జిల్లాల్లోని 67 కేంద్రాలలో నిర్వహించిన ఈ పరీక్షలకు మొత్తం 21,400 మంది అభ్యర్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోగా, 21,391 మంది పరీక్షలకు హాజరైనట్లు పేర్కొన్నారు. 1,196 స్టాఫ్ నర్స్ పోస్టులకు గత ఏడాది నవంబర్ 8న నోటిఫికేషన్ జారీ చేయగా, తర్వాత కలిపిన పోస్టులతో 3,311 పోస్టులను నోటిఫై చేశారు.

మోడీ మళ్లీ రాడు

(మొదటిపేజీ తరువాయి)

రోజుల్లో సర్వే వివరాలను ఎంఎల్‌ఎలకు అందజేస్తానని వెల్లడించారు. ముస్లిం రిజర్వేషన్ల పెంపు అంశంపై రాజకీయ పార్టీలతో చర్చలు జరుపుతామని పేర్కొన్నారు. అవసరమైతే ఇతర పార్టీ ఎంపిలతో కలిసి ఢిల్లీలో ధర్నా చేస్తామన్నారు. కొత్త ఫ్రంట్ ఏర్పాటు నేపథ్యంలో అందరినీ కలుపుకొని పోవల్సి వస్తుందనే సంకేతాలనిచ్చారు. శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అసెంబ్లీలో వ్యవహరించాల్సిన తీరును, భవిష్యత్ రాజకీయాలు, థర్డ్‌ఫ్రంట్ ఏర్పాటుకు కారణాలు తదితర అంశాలపై ఈ సమావేశంలో దిశానిర్దేశం చేశారు. 2019లో జరిగే సాధారణ ఎన్నికల్లో కేంద్రంలో తిరిగి మోడీ ప్రభుత్వం అధికారంలోకి రాదని సిఎం కెసిఆర్ జోస్యం చెప్పారు. మనం ఏర్పాటు చేసేదే ఫస్ట్ ఫ్రంట్ అవుతుందని, రాష్ట్రంలో తిరిగి మనదే అధికారమని, కేంద్రంలో కూడా మనమే చక్రం తిప్పుతామని పేర్కొన్నారు. 2019 ఎన్నికల వరకు తాను రాష్ట్రంలోనే ఉంటానని, ఆ తర్వాత దేశ రాజకీయాల్లో తీసుకురానున్న గుణాత్మక మార్పుపై దృష్టి పెడతానన్నారు. కేంద్రంలో ఇప్పటి వరకు బిజెపి లేదా కాంగ్రెస్ ఈ రెండు పార్టీలే అధికారంలోకి వచ్చాయని, ఇప్పటి వరకు ఉన్న ఫ్రంట్లు కేవలం రాజకీయాలకే పరిమితమయ్యాయని, మనం ఏర్పాటు చేయబోతున్న ఫ్రంట్ ప్రజా సమస్యల ప్రతిపాదికక ప్రత్యేక ఎజెండాతో ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ప్రజలందరినీ ఏకతాటిపైకి తీసుకొస్తామన్నారు. గవర్నర్ ప్రసంగానికి అడ్డుతగిలితే విపక్షాల సభ్యులను సెషన్ మొత్తానికి సస్పెండ్ చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. సమావేశాలకు ఎంఎల్ఎల అందరూ విధిగా హాజరవ్వాలని ఆదేశించారు. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, ఎంఎల్‌ఎలు, ఎంపిలు కూడా ప్రజలతో మమేకమయ్యారని చెప్పారు. భవిష్యత్తులో కూడా ఇలాగే సమర్థవంతగా, బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన సూచించారు. ఎంఎల్‌ఎలు అనవసరంగా ఇతర వివాదాల్లోకి వెళ్లి ఇబ్బందులు పడొద్దన్నారు. హైదరాబాద్‌లోని నియోజకవర్గాల గురించి ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రత్యేంగా ప్రస్తావించినట్లు తెలిసింది. టిఆర్ఎస్ మినహా ఇతర పార్టీలకు చెందిన, ప్రధానంగా బిజెపి ఎంఎల్‌లు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అక్కడ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన ఆదేశించినట్లు తెలిసింది.





మిషన్ భగీరథ పనులను వేగవంతం చేయాలి : మంత్రి జగదీశ్‌రెడ్డి

మన తెలంగాణ/సూర్యాపేట : మిషన్ భగీరథ పనుల జాప్యంపై విద్యుత్, ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. సూర్యాపేట జిల్లా ఇమాంపేట వద్ద జరుగుతున్న మిషన్ భగీరథ పనులకు ఆకస్మికంగా జిల్లా కలెక్టర్ సురేంద్రమోహన్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం మిషన్ భగీరథ అధికారులతో మంత్రి జగదీశ్‌రెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ మిషన్ భగీరథ పనులను వేగవంతంగా పూర్తయ్యేలా చూడాలని అన్నారు. వేసవిలో ప్రజలు దాహార్తిని దృష్టిలో పెట్టుకొని పనులను వేగవంతం చేయాలని పలు మార్లు సమీక్షా సమావేశంలో చెప్పినా పట్టించుకోలేదంటూ ఏజెన్సీ నిర్వాహకుల మీద ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏజెన్సీ నిర్లక్ష్యం వల్లనే ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని మిషన్ భగీరథ అధికారులపై మండి పడ్డారు. ఏజెన్సీ అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. త్వరలో సమావేశం నిర్వహిస్తామని వచ్చే సమీక్షా సమావేశంలో ఏజెన్సీ అధికారులు కుంటి సాకులు చెప్పవద్దని అన్నారు. జిల్లా నాయకులు జిల్లా గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మిషన్ భగీరథ ఎస్‌ఈ మధుబాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ మోహన్‌రెడ్డి, ఎంపిపి వట్టె జానయ్య యాదవ్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు
చెన్నబోయిన కమలమ్మ మృతి



మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, స్వాతంత్ర సమర యోధురాలు చెన్నబోయిన కమ లమ్మ (90)ఆదివారం ఎల్‌బి నగర్ లోని కామినేని ఆస్పత్రిలో తీవ్ర అస్వస్థతతో కన్ను మూశారు. అనంతరం ఆమె పార్థీవ దేహాన్ని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూం భవన్‌కు తరలించారు. సిపిఐ మాజీ రాజ్యసభ సభ్యులు సయ్యద్ అజీజ్ పాష, మాజీ ఎంఎల్‌ఏ పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర నాయకులు డా. చెరుకు సుధాకర్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ, సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సిపిఎం రాష్ట్ర నాయకులు వెంకట్ తదితరులు కమలమ్మ పార్థీవ దేహంపై పుష్ప గుచ్ఛాలుంచి నివాళ్లు అర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటంలోనూ, నిరంకుశ నైజం ప్రభుత్వ దమనకాండకు వ్యతిరేకంగా ఆమె చేసిన వీరోచిత పోరాటాలను ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు. అనంతరం ఆమె పార్థీవ దేహాన్ని స్వస్థలమైన వరంగల్‌కు తరలించారు. వరంగల్‌లోని పోచమ్మ మైదానంలో అంత్యక్రియలు జరుగనున్నాయి. కాగా, చెన్నబోయిన కమలమ్మ తెలంగాణ సాయుధ పోరాట కాలంలో వీరోచితంగా పోరాడిన ధీర వనిత అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. కమలమ్మ నివాసానికి వచ్చి ఆమె భౌతికకాయానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నడుం బిగించి నైజాం సైన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప యోధురాలు కమలమ్మని గ్రేటర్ వరంగల్ మేయర్ నన్నపునేని నరేందర్ అన్నారు.

టిఆర్‌ఎస్ కార్యకర్తపై చొప్పదండి ఎంఎల్‌ఏ దాడి

కరీంనగర్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

మన తెలంగాణ/కరీంనగర్ క్రైం : కరీంనగర్ జిల్లా చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గం శాసన సభ్యురాలు బొడిగె శోభ తన పార్టీకే చెందిన కార్యకర్తలను కొట్టి దూషించిన సంఘటన ఆదివారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితుడు కరీంనగర్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జిల్లాలోని రామడుగు మండలం తిర్మలాపూర్‌కు చెందిన తడగొండ నర్సింగ్ బాబు టిఆర్‌ఎస్ కార్యకర్త ఎస్.సి సెల్ అధ్యక్షుడు సుంకె రవిశంకర్‌తో కలిసి ఆదివారం కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బోయినపల్లి వినోద్‌కుమార్ నివాసానికి వెళ్లారు. రవిశంకర్ మొదటి అంతస్తులో ఎంపితో మాట్లాడుతుండగా నర్సింగ్‌బాబు కిందికి దిగి వచ్చి తిరిగి లిఫ్ట్‌లో పైకి వెళ్లేందుకు నిరీక్షిస్తున్నాడు. ఈ సమయంలో ఎంపిని కలిసేందుకు వచ్చిన ఎంఎల్‌ఏ బొడిగె శోభ లిఫ్ట్ వద్ద ఉన్న నర్సింగ్‌బాబును చూసి ఆగ్రహిస్తు తనను కలవకుండా రవిశంకర్‌తో కలిసి ఇక్కడకు వస్తావా అంటూ అసభ్యపదజాలంతో దూషిస్తూ కొట్టినట్లు తెలిపారు. ఎంఎల్‌ఏ అంగరక్షకుడు సైతం కొట్టడానికి ప్రయత్నించగా తాను తప్పించుకున్నట్లు పేర్కొన్నారు. బొడిగె శోభ వలన తనకు ప్రాణహాని ఉందని తనకు రక్షణ కల్పిస్తూ ఎంఎల్‌ఏపై చర్యలు తీసుకోవాలని బాధితుడు నర్సింగ్‌బాబు పోలీసులను ఫిర్యాదు చేశారు.

భైంసాలో తల.. నిర్మల్‌లో మొండెం

ఉత్తరప్రదేశ్ వాసిగా గుర్తింపు

మన తెలంగాణ/భైంసా: నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో నర్సింహానగర్ రోడ్డులో ఈనెల 9న లభ్యమైన గుర్తుతెలియని తలకు సంబంధించిన ఆచూకీ ఎట్టకేలకు తెలిసింది. దీంతో చిక్కుముడి వీడిపోయింది. గత నాలుగు రోజులుగా ఎక్కడి వాడోనన్న చర్చ జిల్లాలోనే కాకుండా అంతటా మారుమ్రోగింది. ఈ విషయం భైంసా పట్టణంలోనైతే క్షణాల్లోనే సంచలనంగా మారి చర్చనీయాంశమైంది కుటుంబీకులు మృతుని సోదరునితో పాటు మృతుని చిన్నాన్న భైంసా పట్టణానికి వచ్చి పోలీసుల వద్ద ఆరాతీయడంతో మృతిచెందిన వ్యక్తి తమకు చెందిన వాడేనని నిర్ధారణయింది. గంటలోపే నిర్మల్ పట్టణంలో మొండెం సైతం లభ్యమైంది. మృతుడు ఉత్తర ప్రదేశ్‌కు చెందిన మహమ్మద్ ఇస్రార్‌గా బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆసుపత్రిలో ఉన్న తలను చూపించగా కుటుంబీకులు ఇస్రార్‌గా గుర్తించారు. నిర్మల్ పట్టణంలో నివాసం ఉంటూ బట్టల వ్యాపా రం చేస్తూ జీవనం సాగించేవాడు. కేసు మిస్టరీ ఛేదించేందుకు భైంసా డిఎస్‌పి అందె రాములు, పట్టణ సిఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తల లభ్యమైనప్పటి నుంచి తమ వంతు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

మన తెలంగాణ/కీసర (మేడ్చల్ జిల్లా) : నాలుగు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిన యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కీసర అనుబంధ గ్రామమైన రెడ్డిగూడలో జరిగింది. కీసరకు చెందిన రామిడి సాయి ప్రసాద్‌రెడ్డి తండ్రి అంజిరెడ్డి కీసర అనుబంధ గ్రామమైన రెడ్డిగూడలోని తమకు చెందిన పాతబడిన ఇంట్లో నిమ్మ కాయలు కోసి తెచ్చేందుకు వెళ్లగా సాయిప్రసాద్‌రెడ్డి ఉరి వేసుకొని కనిపించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇది మాటల ప్రభుత్వం : షబ్బీర్



మన తెలంగాణ/కామారెడ్డి : తెలంగాణలో మాటలతో పబ్బం గడుపుతున్న ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలంగాణ శాసనమండలి పక్ష నేత షబ్బీర్ అలీ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని లిమ్రా గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కెసిఆర్ మాటలతో పబ్బం గడుపుతున్నారన్నారు. ఆదివారం కామారెడ్డి , నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల ఐసిడిఎస్ కాంట్రాక్టు సూపర్‌వైజర్‌ల ఉపాధ్యక్షురాలు వనజ, ఉమలు ఇచ్చిన వినతి పత్రంపై స్పందించారు. తెలంగాణలో రెగ్యులర్ చేసేంతవరకు రెగ్యులర్ సూపర్‌వైజర్‌లతో సమానంగా అర్హతలు కల్పించాలన్నారు. అనంతరం బిజెపి సీనియర్ నాయకులు పంపరి లక్ష్మ ణ్‌తో పాటు టిడిపి, టిఆర్‌ఎస్, వివిధ పార్టీలకు చెందిన 500ల మంది కార్యకర్తలు, నాయకులు షబ్బీర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కైలాశ్ శ్రీనివాస్, నిమ్మ మోహన్‌రెడ్డి, ఎడ్ల రాజిరెడ్డి పాల్గొన్నారు.

సంక్షోభంలో రైస్‌మిల్ పరిశ్రమ

- ▸▸ మూతపడిన వందలాది రైస్‌మిల్లులు
- ▸▸ ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్



మన తెలంగాణ/నిజామాబాద్‌బ్యూరో: తెలంగాణ రాష్ట్రంలో రైస్‌మిల్లు పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. మూడు సంవత్సరాలుగా నష్టాల్ని చవిచూస్తూ రైస్ మిల్లులను నడుపుతున్నారు. ఇదే సమయంలో వరి పంట రాక, ఈ ఏడాది ఖరీఫ్‌లో దోమపోటుతో ధాన్యం దిగుబడి తగ్గి అటు రైతులు, ఇటు మిల్లర్లు నష్టపోతున్నారు. పాతిక సంవత్సరాలుగా మిల్లింగ్ చార్జీలు పెంచకపోవడం మరిన్ని కష్టాలకు దారితీస్తున్నది. రైస్ మిల్లర్లు పలుమార్లు ప్రభుత్వంతో మొరపెట్టుకుంటున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు కనిపించడంలేదు. ఒక క్వింటాల్ మిల్లింగ్‌కు అయ్యే వ్యయం వాస్తవంగా గుర్తించి ముడి బియ్యానికి రూ.15లు, బాయిల్డ్ బియ్యానికి రూ.25 చొప్పున పెంచారని, వీటికి గాను 2015–16 సంవత్సరానికి రావాల్సిన బకాయిలు చెల్లించగా రాష్ట్రం మొత్తం 2016–17 సంవత్సరానికి గాను రూ.100 కోట్లు మిల్లర్లకు బకాయిలు ఉండగా ఒక నిజామాబాద్ జిల్లాలోనే రూ.20 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. మార్చి చివరిలోగా ఈ బకాయిలను చెల్లించని పక్షంలో ఏప్రిల్ 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా రైస్ మిల్లులన్నింటినీ మూసి వేస్తామని రైస్ మిల్లర్ల సంఘ నాయకులు హెచ్చరిస్తున్నారు. రైతులకు, రైస్ మిల్లులకు అవినాభావ సంబంధం ఉంది. ప్రభుత్వం ప్రకటించిన మేర రైతులు పండించిన వరి పంటను కొనుగోలు చేయలేని స్థితిలో రైస్ మిల్లర్లు రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. మిల్లులు మూత పడిన పక్షంలో ధాన్యాన్ని అమ్ముకునే పరిస్థితి కూడా ఉండదంటున్నారు. రైతు పండించిన ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు సరైన గోదాంల వసతి కూడా లేకపోవడం దయనీయంగా తయారైంది. ఇదే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్షల మంది కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైస్‌మిల్లుల్లో పనిచేస్తుండగా వీరికి తోడు వీరి కుటుంబాలు మరో ఐదు లక్షల మంది మిల్లుల పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఖర్చులు పెరిగిపోతున్నాయని, విద్యుత్, హమాలీ, ట్రాన్స్‌పోర్టు ఇతర జీతభత్యాలు పెరిగిపోతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని, మిల్లింగ్ ఛార్జీలు పెంచలేదని గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో వందలాది రైస్ మిల్లులు మూత పడ్డాయి. మిల్లింగ్ పరిశ్రమను కూడా ఇతర పరిశ్రమల లాగే గుర్తించి రాయితీలు ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. మూతపడిన రైస్‌మిల్లులను తెరిపించి ఖాయి లా పడిన పరిశ్రమల మాదిరిగా బ్యాంకర్లను ఒప్పించి ఆర్థిక వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ఆర్థికమంత్రి ఈటెల రాజేందర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. బ్యాంకర్లతో మాట్లాడి ప్రభుత్వమే గ్యారంటీ ఇచ్చి రుణ సదుపాయం కల్పించేలా కృషి చేయాలని కోరుతున్నారు. మిల్లర్ల సమస్యలపై పోరాటాలకు సిద్ధమవుతున్నారు. కొద్ది రోజుల్లో రాష్ట్రస్థాయి రైస్ మిల్లర్ల సదస్సును హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

సమస్యలను పరిష్కరించాలి

దశాబ్దాలుగా పేరుకుపోయిన తమ సమస్యలను తక్షణం పరిష్కరించాలని నిజామాబాద్ జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు మోటూరి దయానంద్‌గుప్త, ప్రధాన కార్యదర్శి వడ్డి మోహన్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. తమ సమస్యల సాధన కోసం త్వరలో హైదరాబాద్‌లో రాష్ట్ర రైస్ మిల్లర్ల సదస్సును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

రేవంత్‌రెడ్డి ఆరోపణలు హాస్యాస్పదం

రైస్ మిల్లర్లతో ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ కుమ్మక్కై రూ.400 కోట్లు ముడుపులు తీసుకుని మిల్లింగ్ చార్జీలు పెంచారని కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందని నిజామాబాద్, మెదక్ జిల్లాలకు చెందిన రైస్ మిల్లర్ల సంఘం నేతలు దయానంద్ గుప్త, వడ్డి మోహన్‌రెడ్డి, ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ రైస్ మిల్లర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు తోడుపునూరి చంద్రపాల్ అన్నారు. దీన్ని నిరూపించని పక్షంలో రేవంత్‌రెడ్డి రాజకీయాలకు స్వస్తి పలకాలని, లేదంటే తాము తమ మిల్లులను వదిలి వేయడానికి సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు.

ఇండస్ట్రియల్ పార్కు స్థలాన్ని
పరిశీలించిన జపాన్ బృందం



మన తెలంగాణ/ నంగునూరు:నంగునూరు మండలంలోని నర్మెట గ్రామంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు సేకరించిన భూమిని ఆదివారం జపాన్ బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా నర్మెట మైసంపల్లి గ్రామ శివార్లలోని ఇండస్ట్రియల్ ఏర్పాటుకు భూసేకరణలో భాగంగా 105.39 ఎకరాల భూమిని గతంలోనే ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఈ ప్రాంతంలో పండిన పంటను మార్కెటింగ్ చేసేందుకు జపాన్ బృందం సభ్యులు సర్వే చేస్తున్నారు. మంత్రి హరీశ్‌రావు సూచనల మేరకు తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ అధికారులు జపాన్ బృందానికి భూమిని చూపించారు. ఇక్కడి స్థలంలో ఫుడ్ ప్రాసెస్ యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం అనుకూలంగా ఉన్నట్లు జపాన్ బృందం తెలిపింది. రాష్ట్రంలో కంపెనీల ఏర్పాటుకు సంబంధించిన పెట్టుబడులు పెట్టేందుకు బృందం పర్యటిస్తున్నట్లు తెలియజేశారు. త్వరలోనే సిఎం కెసిఆర్, మంత్రులు హరీశ్‌రావు, కెటిఆర్‌లతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని టిఎస్‌ఐఐసి అధికారులు తెలిపారు. జపాన్ బృందం వెంట అధికారులు వెంకటాగాంధీ, ఎంపిపి జాప శ్రీకాంత్‌రెడ్డి, కో – ఆప్షన్ సభ్యులు ఎండి ఆజీజ్, తహసీల్దార్ విజయ భాస్కర్‌జీ, నాయకులు పుప్పాల నారాయణ, రవీందర్ రెడ్డి, అనంత రాములు తదతరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న మోడీ

▸▸ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ



మన తెలంగాణ/ మంచిర్యాల ప్రతినిధి : కేంద్రంలో ప్రధాని మోడీ సర్కార్ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సిపిఐ బహిరంగ సభలో మాట్లాడారు. దేశవ్యాప్తంగా 73 శాతం సంపద కార్పొరేట్ శక్తుల్లో ఉందని, పేదల బతుకులు మాత్రం మారలేదన్నారు. దేశంలో ప్రజాస్వామ్య ముసుగులో పరిపాలన కొనసాగుతుందని, దోపిడీ దొంగలు, మాఫియాలు అధికమయ్యారని, అసెంబ్లీ, పార్లమెంట్‌లలో కోట్లు సంపాదించిన మాఫియాలే ఉన్నారని ఆరోపించారు. నాలుగేళ్ల పాలనలో కెసిఆర్ తెలంగాణ ప్రజలకు ఏమి చేశారని ప్రశ్నించారు. కెసిఆర్ నిజ స్వరూపం బట్టబయలు అయిందని, ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు దగ్గర పడుతున్నాయన్నారు. బహిరంగ సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుండా మల్లేష్, ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి కలవేన శంకర్, కొమురంభీం జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలవేన శ్యాం, పి. బానుదాసు, బొల్లంపూర్ణిమ, ఎం. వెంకటస్వామి, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు పల్లె నర్సింహా, కార్యదర్శి లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

ఆ పోలీసులపై హత్య కేసులు నమోదు చేయాలి

మనతెలంగాణ/కరీంనగర్‌క్రైం: రాష్ట్రంలో ఎన్‌కౌంటర్‌లకు పాల్పడుతున్న పోలీసులపై హత్య కేసులు నమోదు చేయాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎ. లక్ష్మ ణ్ డిమాండ్ చేశారు. పౌరహక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా 3వ మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఇప్పటి వరకు జరిగిన ఎన్‌కౌంటర్‌లన్నీ బూటకమేనంటూ రాజ్యహింసకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.ఈ సభలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. నారాయణరావు, సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, ఉస్మానియా యునివర్శిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ పద్మజాషా, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు డాక్టర్ జి.ఎ.వి.ప్రసాద్ పాల్గొన్నారు.

జైపూర్ పవర్‌ప్లాంట్‌లో కొలువుల కొట్లాట





- ▸▸ నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపణ
- ▸▸ ప్రజాభిప్రాయ సేకరణలో హామీలను విస్మరించిన సింగరేణి

మన తెలంగాణ/మంచిర్యాల ప్రతినిధి : మంచిర్యాల జిల్లా జైపూర్ పవర్‌ప్లాంట్‌లో కొలువుల కొట్లాట మొదలైంది. శాశ్వత ఉద్యోగాలు కల్పించాలనే డిమాండ్‌తో గత ఐదు రోజులుగా భూ నిర్వాసితులు ఆందోళన చేస్తున్నారు. దీక్షలను భగ్నం చేసిన పోలీసులు భూ నిర్వాసితులకు లిఖిత పూర్వక హామీ ఇవ్వకుండానే చేతులు దులుపు కున్నారు. దీంతో ప్రజా సంఘాలు విపక్ష పార్టీ సహకారంతో శాశ్వత ఉద్యోగాల కోసం మళ్లీ పోరుబాట పట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. భూ నిర్వాసితులు సింగరేణి యాజమాన్యానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టడమే కాకుండా దీక్షలను ప్రారంభించారు.అంతేకాకుండా ఇద్దరు కాంట్రాక్టు కార్మికులు బిఎస్‌ఎన్‌ఎల్ టవర్ ఎక్కి నిరసన తెలపడమే కాకుండా పెద్దఎత్తున ఆరు గంటల పాటు రాస్తారోకో చేశారు. దీక్షలు చేపట్టిన 32 మంది భూ నిర్వాసితులను పోలీసులు అరెస్టు చేయడంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. మొట్టమొదటి సారిగా 2009లో జైపూర్‌లో థర్మల్ పవర్‌ప్లాంట్‌కు శ్రీకారం చుట్టింది. పవర్‌ప్లాంట్ ఏర్పా టు కోసం పెగడపల్లి, ఎల్కంటి, జైపూర్, గంగిపల్లి గ్రామాలలో 1980 ఎకరాల భూములను సేకరించారు. అదే విధంగా రైల్వే ట్రాక్‌లైన్ ఏర్పాటు కోసం రామరావుపేట, టేకుమట్ల, ఇందారంలో మరో 100 ఎకరాలను సేకరించారు. అయితే మొదట పవర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేసే సమయంలో ఇంటికో శాశ్వత ఉద్యోగం ఇస్తామని, అదే విధంగా సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇవ్వడంతో పంట భూములను అప్పగించామని నిర్వాసితులు వాపోతు న్నారు. పవర్‌ప్లాంట్ కింద మొత్తం 825 మంది నిర్వాసి తులకు ఉద్యోగాలు కల్పించాలని కోరితే కేవలం 300 మందికే కాంట్రాక్టు ఉద్యోగాలు ఇచ్చి అధికారులు చేతులు దులుపుకున్నారు.ఈనెల 27న సిఎం కెసిఆర్ శ్రీరాం పూర్‌లో ఆత్మీయ సమ్మేళనం బహిరంగ సభ నిర్వహించగా సభలో జైపూర్ పవర్ ప్లాంట్ నిర్వాసితుల సమస్యలపై కనీసం నోరెత్తలేదని వాపోతున్నారు. గతంలోని హామీలు అమలు చేయకుండా మళ్లీ 800 మెగావాట్ల యూనిట్ కోసం ఈనెల 7న పోలీసు నిర్బంధం మధ్య ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. భూపాల్‌పల్లిలో జెన్‌కోలో భూ నిర్వాసితు లకు ఫిక్స్‌డ్ వేతనం రూ. 30వేలు ఇస్తున్నట్లుగా తమకు కూడా వర్తింపజేయాలని కోరినప్పటికీ అధికారులు, అధి కార పార్టీ నాయకులు పట్టించుకోవడం లేదని వాపో తున్నారు. ఒక్కొక్కరు 10 ఎకరాలకు పైగా భూములను పవర్ ప్లాంట్‌కు అప్పగించి కాంట్రాక్టు ఉద్యోగం పేరిట వచ్చే రూ. 8 వేలు కుటుంబ పోషణకు సరిపోవడం లేదని ఆందోళన చెందుతున్నారు.శాశ్వత ఉద్యో గాల కోసం ప్రాణాలు అర్పిస్తామని నిర్వాసితులు హెచ్చరిస్తున్నారు.ప్రభుత్వం స్పందిం చి భూపాల్‌పల్లి జెన్‌కోలో ఇస్తున్నట్లుగా ఫిక్స్‌డ్ వేతనం అందజేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నారు.

ఉరేసుకొని డాక్టర్ ఆత్మహత్య


మన తెలంగాణ/ నిజామాబాద్ క్రైం : జిల్లా కేంద్రంలోని ఎన్‌జిఓ కాలోనికి చెందిన నాత్ మధు (31) మానసిక క్షోభతో ఉరేసుకొని మృతి చెందినట్లు 3వ టౌన్ ఎస్సై కృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని ఎన్‌జిఓ కాలనీకి చెందిన నాత్‌మధు జిల్లా కేంద్రా ప్రభుత్వాసుపత్రిలో ఇంటర్న్‌షిప్ డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారని ఎస్సై తెలిపారు. శనివారం అర్థరాత్రి తన నివాసముంటున్న ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్‌ఐ కృష్ణ తెలిపారు. మృతుడు మానసికక్షోభ వల్లే ఉరేసుకొని మృతి చెందాడని తెలిపారు. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నమన్నారు. మృతుడిని జిల్లా మార్చురీకి తరలించామని ఎస్సై తెలిపారు.

శ్రీనగర్‌లో సిఆర్‌పిఎఫ్ జవాను ఆత్మహత్య

మన తెలంగాణ/ భీంపూర్ : ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం బేల్సరి రాంపూర్‌కు చెందిన గిరిజన యువకుడు పుర్కే సుఖ్‌దేవ్ (24) శ్రీనగర్‌లో సిఆర్‌పిఎఫ్ జవానుగా విధులు నిర్వర్తిస్తూ శనివారం ఉదయం ఎకే47తో 4 రౌండ్లు కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతనికి తండ్రి భీంరావ్, కానిస్టేబుల్‌గా ఉన్న సోదరుడు, వ్యవసాయం చేసే మరో ఇద్దరు సోదరులు, ఇద్దరు అక్కయ్యలు ఉన్నారు. 4 సంవత్సరాల నుంచి ఇతను అక్కడ విధులు నిర్వర్తిస్తున్నాడు. మృతదేహాన్ని ప్రత్యేక విమానంలో నాగపూర్ వరకు ఆ తరువాత సిఆర్‌పిఎఫ్ వాహనంలో స్వగ్రామానికి తరలించారు. ఆదివారం మధ్యాహ్నం నిర్వహించిన అంత్యక్రియలలో అక్కడి నుంచి వచ్చిన జవానులు, సిఐ శ్రీనివాస్, ఎఎస్‌ఐ లింగారెడ్డి, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. కాగా ఈ మృతిపై అనుమానాలు ఉన్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. కాగా, ఆదిలాబాద్ జాయింట్ కలెక్టర్ కృష్ణారెడ్డి, తహసీల్దార్ రాజేశ్వర్‌లు ఆదివారం సాయంత్రం బేల్సరిరాంపూర్ వెళ్లి మృతుని కుటుంబాన్ని పరామర్శించారు.

జవహర్‌నగర్‌లో పోలీసుల కార్డన్ సెర్చ్

300 మంది పోలీసులతో సోదాలు
అదుపులో 10 మంది అనుమానితులు



మన తెలంగాణ/జవహర్‌నగర్ : మల్కాజిగిరి డిసిపి ఉమామహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఆదివారం జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంబేడ్కర్‌నగర్ కాలనీలో 300 మంది పోలీసులతో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. తెల్లవారుజామున 4.30 నిమిషాల నుంచి అంబేడ్కర్‌నగర్‌లోని అన్ని ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అనుమానితుల గుర్తింపు కార్డులను పరిశీలించారు. ఈ సెర్చ్‌లో నలుగురు పాత నేరస్థులను, ఆరుగురు అనుమానితులను, సరైన పత్రాలు లేని 24 ద్విచక్రవాహనాలు, ఆరు ఆటోలను, 11 గ్యాస్ సిలిండర్లను, ఒక బెల్ట్ షాప్‌ను సీజ్ చేసి, 31 లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్కాజిగిరి డిసిపి ఉమామహేశ్వరశర్మ మాట్లాడుతూ జవహర్‌నగర్‌లో అనుమానితుల సంఖ్య అధికంగా ఉందని ఈ కార్డన్‌సెర్చ్ నిర్వహించామన్నారు. ఈ తనిఖీలో సరైన పత్రాలు లేని వాహనాలను, అనుమానితులను అదుపులోకి తీసుకోని విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. అడిషినల్ డిసిపి ఎస్‌కె సలీమా, కుషాయిగూడ ఎసిపి కృష్ణమూర్తి, మల్కాజిగిరి ఎసిపి గోనె సందీప్‌కుమార్, పోలీసులు పాల్గొన్నారు.


మోహన్‌రెడ్డిపై మరో కేసు నమోదు

మన తెలంగాణ/కరీంనగర్‌క్రైం : అక్రమ ఫైనాన్స్ వ్యవహారంలో అరెస్టయి ప్రస్తుతం జైల్లో శిక్షణు అనుభవిస్తున్న మాజీ ఎఎస్‌ఐ బొబ్బల మోహన్‌రెడ్డి మీద మరో కేసు నమోదైంది. కరీంనగర్ అవినీతి నిరోధక శాఖ అధికారులు ఈనెల 6న మోహన్‌రెడ్డి సహా అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేశారు.రామకృష్ణకాలనీకి చెందిన కిన్నెర సారయ్య..వేల్పుల ఓదెలు, దాడి కనకయ్య అనే వ్యక్తులతో కలిసి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తుండేవారు.వారికి వ్యాపార అవసరం నిమిత్తం ఎ.ఎస్.ఐ మోహన్‌రెడ్డి వద్ద రూ.4 వడ్డీతో రూ.30 లక్షలను అప్పుగా తీసుకోవడం జరిగింది. ఇందు కోసం రూ.80 లక్షల విలువచేసే 30 గుంటల స్థలాన్ని మోహన్‌రెడ్డి సూచించిన ప్రకారం అతని తమ్ముడు బొబ్బల మహేందర్‌రెడ్డి పేరుతో సేల్ కమ్ జిపిఎ చేశారు. మోహన్‌రెడ్డి రూ.29 లక్షలను సారయ్య, ఓదయ్య, కనుకయ్యలకు ఇచ్చారు. ఇదిలా ఉండగా మోహన్‌రెడ్డి జైలుకు వెళ్ళేలోపుగానే వడ్డీతో సహా తీసుకున్న డబ్బు రూ.30 లక్షలను చెల్లించినప్పటికీ తమ భూమిని తమకు తిరిగి రిజిస్ట్రేషన్ చేయకుండా అదేవిధంగా తన ఇంటి పత్రాలను తనకు ఇవ్వకుండా చంపుతానని బెదిరింపులకు పాల్పడినట్లు బాధితులు పేర్కొన్నారు. దీంతో కేసు నమోదు చేశారు.

హర్రర్ సినిమాలంటే భయం

'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్' చిత్రంతో వెండితెరకు పరిచయమైన బ్యూటీ అలియాభట్. విభిన్న పాత్రలతో అలరిస్తున్న ఈ భామకు చీకటి, హర్రర్ అంటే చాలా భయమట. అందుకే హర్రర్ సినిమాల్లో నటించాలనుకోవడం లేదని చెబుతోంది. బాలీవుడ్‌లో హర్రర్ సినిమాలకు పేరొందిన మహేష్‌భట్ కుమార్తె అలియాభట్ ఇలా హర్రర్ సినిమాలంటే భయమని చెప్పడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. హర్రర్ సినిమాలంటే భయమని చెప్పిన అలియా తనకు గాడ్జిల్లా వంటి పెద్ద జంతువులన్నా భయమేనని చెబుతోంది. అంత భయమెందుకు అంటే... ''ఒకసారి నా పుట్టినరోజు పార్టీకి గాడ్జిల్లా రావాలని అనుకున్నా. నా కోసం మా వాళ్లు గాడ్జిల్లా బొమ్మను ఏర్పాటుచేశారు. కానీ అంత పెద్ద ఆకారాన్ని చూడగానే భయపడిపోయా. ఆ రోజు ఏడ్చుకుంటూ మా అమ్మ ఒడిలోనుంచి దిగనేలేదు. అప్పటి నుంచి నాకు గాడ్జిల్లా అన్నా... పెద్ద జంతువులన్నా... హర్రర్ సినిమాలన్నా చాలా భయం'' అని తన చిన్ననాటి సంఘటన గురించి చెప్పుకొచ్చింది అలియాభట్. '' నా సినిమాలు పిల్లలు కూడా చూస్తారు...అందులో వాళ్లు నన్ను చూసి ఇష్టపడాలే కానీ భయపడకూడదు. అందుకే హర్రర్ సినిమాల్లో నటించాలనుకోవడం లేదు''అని చెప్పింది ఈ భామ.





తాత పాత్రలో మనవడు

సి.అశ్వనీదత్ సమర్పణలో అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'మహానటి'. కీర్తిసురేష్ టైటిల్ పాత్రలో నటిస్తోంది. జెమిని గణేషన్ పాత్రలో దుల్కార్ సల్మాన్ నటిస్తున్నాడు. ఈ చిత్రంలో కీలక పాత్రలకు మహామహుల్ని ఎంపికచేసిన సంగతి తెలిసిందే. అయితే సావిత్రి జీవితంలో... కెరీర్‌పరంగా ఎన్టీఆర్, ఏఎన్నార్ పాత్రలు అంతే కీలకం. మరి ఆ పాత్రల్లో నటించేది ఎవరు? ఇంతవరకు ఈ ప్రశ్నకు సరైన సమాధానం లేదు. అయితే తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో నాగచైతన్య తన తాతయ్య అక్కినేని నాగేశ్వరరావు పాత్రలో కనిపించనున్నాడని తెలిసింది. ఇప్పటికే ప్రకాష్‌రాజ్, క్రిష్‌లాంటి వాదందరూ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం నాగచైతన్య ఎంట్రీతో మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంది. త్వరలోనే నాగచైతన్య షూటింగ్‌లో పాల్గొంటాడు.

శ్రీదేవికి నడిగర్ సంఘం ఘన నివాళి


శ్రీదేవికి నివాళులర్పిస్తున్న శివకుమార్, అంబిక, శ్రీప్రియ, కార్తి తదితరులు


శ్రీదేవి సంస్మరణ సభలో నాజర్, భాగ్యరాజ్, అంబిక, శ్రీప్రియ తదితరులు

తమిళ సినీ నటులకు చెందిన నడిగర్ సంఘం ఆదివారం చెన్నైలోని క్రౌన్ ప్లాజాలో శ్రీదేవి సంస్మరణ సభను ఏర్పాటుచేసింది. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి సినీ ప్రముఖులు శివకుమార్, నాజర్, కార్తి, భాగ్యరాజ్, శ్రీప్రియ, అంబిక, మనోబాల తదితరులు పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సంస్మరణ సభలో సినీ ప్రముఖులు మాట్లాడుతూ శ్రీదేవి మరణంతో భారతదేశ చిత్ర పరిశ్రమ ఒక గొప్ప నటిని కోల్పోయిందని అన్నారు. దక్షిణాదిన స్టార్ హీరోయిన్‌గా రాణించి బాలీవుడ్‌కు వెళ్లి అక్కడ కూడా టాప్ హీరోయిన్‌గా తిరుగులేని క్రేజ్‌ను సంపాదించుకున్న అతిలోక సుందరి శ్రీదేవి అని వక్తలు పేర్కొన్నారు. ఇక ఈ సంస్మరణ సభ కోసం ముంబయ్ నుంచి చెన్నైకి వచ్చిన శ్రీదేవి భర్త బోనీకపూర్, ఆమె కుమార్తెలు జాన్వి కపూర్, ఖుషీకపూర్‌లను కలిసి స్టార్ హీరో అజిత్, ఆయన భార్య షాలిని తదితరులు పరామర్శించారు. శ్రీదేవి మృతిపట్ల వారు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

నిఖిల్‌ని చూస్తే డ్యూరోసెల్ బ్యాటరీ గుర్తుకొస్తుంది!

నిఖిల్ హీరోగా కన్నడ సూపర్ హిట్ సినిమా 'కిరిక్ పార్టీ'ని ఎ.కె.ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ తెలుగులో 'కిరాక్ పార్టీ'గా రూపొందిస్తోంది. సంయుక్త హెగ్డే, సిమ్రాన్ పరింజా కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రం ద్వారా శరణ్ కొప్పిశెట్టి అనే యువ ప్రతిభాశాలి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ఈ చిత్రానికి యువ దర్శకుడు సుధీర్ వర్మ స్క్రీన్‌ప్లే, మరో యంగ్ డైరెక్టర్ చందూ మొండేటి సంభాషణలు సమకూర్చడం విశేషం. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం ఈనెల 16న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా విజయవాడలోని ఉషారామా ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థుల సమక్షంలో ఆడియో విడుదల వేడుకను నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన అల్లరి నరేష్ బిగ్ సీడీని విడుదల చేసి మొదటి సీడీని నిర్మాతల్లో ఒకరైన రామబ్రహ్మం సుంకరకు అందజేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత అనిల్ సుంకర మాట్లాడుతూ ''మా బ్యానర్‌కు సొంత హీరోలాంటి అల్లరి నరేష్‌ను అడగగానే ఈ వేడుకకు విచ్చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ చిత్రం కోసం పనిచేసిన సుధీర్ వర్మ, చందూ మొండేటిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. మా టీమ్ అంతా ఎంతో కష్టపడి ఈ సినిమా కోసం పనిచేసింది. ఈనెల 16న ఈ సినిమాను విడుదల చేయనున్నాం''అని అన్నారు. అల్లరి నరేష్ మాట్లాడుతూ ''ఈనెల 16న స్టూడెంట్స్ ఎవరూ అటెండెన్స్ గురించి పట్టించుకోకండి... అటెండెన్స్ వేయించే బాధ్యత నాది. నాకు నిఖిల్‌ని చూసినప్పుడల్లా డ్యూరోసెల్ బ్యాటరీ గుర్తుకొస్తుంది. మా ఆహుతి ప్రసాద్ అబ్బాయి కార్తీక్ ఈ చిత్రంలో నటించడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా కన్నడలో ఎంత పెద్ద హిట్ అయిందో... అదే స్థాయిలో తెలుగులోనూ సూపర్‌హిట్ అవ్వాలని ఆశిద్దాం''అని చెప్పారు. హీరో నిఖిల్ మాట్లాడుతూ ''అల్లరి నరేష్ ఆడియో విడుదల చేసిన నా ప్రతి సినిమా సూపర్‌హిట్. అలాగే 'కిరాక్ పార్టీ' కూడా సూపర్‌హిట్ అవుతుందని ఆశిస్తున్నాను. ఈ సినిమాలో నటించే అవకాశాన్నిచ్చిన అనిల్ సుంకరకు స్పెషల్ థాంక్స్. 'కార్తికేయ'తో చందూ మొండేటికి, 'స్వామి రారా'తో సుధీర్‌వర్మకు ఎలాంటి మంచి పేరు వచ్చిందో... 'కిరాక్ పార్టీ'తో శరణ్‌కు కూడా అదే స్థాయి పేరొస్తుంది. వినోదంతో పాటు మంచి సందేశం కూడా ఉన్న సినిమా ఇది''అని పేర్కొన్నారు. చిత్ర కథానాయిక సిమ్రాన్ పరింజా మాట్లాడుతూ ''తెలుగులో నా మొదటి సినిమా 'కిరాక్ పార్టీ' కావడం చాలా ఆనందంగా ఉంది. పాటలు, ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చింది. సినిమాను కూడా అదే స్థాయిలో ఆదరిస్తారని ఆశిస్తున్నాను''అని అన్నారు. చిత్రంలోని మరో కథానాయిక సంయుక్త హెగ్డే మాట్లాడుతూ ''సినిమా విడుదల కోసం చాలా ఆతృతగా ఎదురుచూస్తున్నాను. ప్రేక్షకులు, విద్యార్థులు అందరూ కలిసి 'కిరాక్ పార్టీ'ని సూపర్‌హిట్ చేస్తారని ఆశిస్తున్నాను''అని తెలిపారు. చిత్ర దర్శకుడు శరణ్ కొప్పిశెట్టి మాట్లాడుతూ ''ప్రతి ఒక్క విద్యార్థి ఎంజాయ్ చేసేలా సినిమా ఉంటుంది. తప్పకుండా సినిమా విజయం సాధిస్తుందన్న నమ్మకముంది''అని చెప్పారు.


'కిరాక్ పార్టీ' ఆడియో వేడుకలో అల్లరి నరేష్, నిఖిల్, సిమ్రాన్ పరింజా, సంయుక్త హెగ్డే, రామబ్రహ్మం సుంకర, అనిల్ సుంకర

రసవత్తరంగా తెలుగు డైరెక్టర్స్ అసోసియేషన్ ఎన్నికలు



తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం హైదరాబాద్‌లోని ఫిలిం ఛాంబర్‌లో రసవత్తరంగా జరిగాయి. ఈ ఎన్నికలలో అసోసియేషన్ అధ్యక్ష పదవికి ఎన్.శంకర్, సానా యాదిరెడ్డి పోటీపడ్డారు. ఈ ఇద్దరి ప్యానళ్ల మధ్య ఎన్నికలు పోటాపోటీగా సాగాయి. బి.గోపాల్, కోదండ రామిరెడ్డి, కోడి రామకృష్ణ, సాగర్, వీరశంకర్, వంశీ పైడిపల్లి, అనిల్ రావిపూడి, కళ్యాణ్‌కృష్ణ, హరీష్‌శంకర్, శ్రీకాంత్ అడ్డాల, గోపీచంద్, అల్లాణి శ్రీధర్, సుచిత్ర, ప్రతాని రామకృష్ణ గౌడ్, వందేమాతరం శ్రీనివాస్, వైవిఎస్ చౌదరి, ప్రసన్నకుమార్ తదితరులు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మనం సైతం దేశవ్యాప్తంగా విస్తరించాలి


డ్రైవర్ రాజుకు చెక్‌ను అందజేస్తున్న సి.కళ్యాణ్. చిత్రంలో వి.వి.వినాయక్, కాదంబరి కిరణ్. జి.నాగేశ్వర రెడ్డి.

నటుడు, సామాజిక సేవకుడు కాదంబరికిరణ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న 'మనం సైతం' సేవా సంస్థ చిత్ర పరిశ్రమలో కష్టాల్లో ఉన్నవారిని ఆదుకుంటూ వారికి ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. మనసున్న ఎంతో మంది తమకు తోచినంత విరాళాలను అందజేస్తూ ఈ సంస్థ సేవా కార్యక్రమాల్లో భాగమవుతున్నారు. ఈ సంస్థ మరోసారి కొందరు ఆపన్నులకు ఆర్థిక సాయాన్ని అందజేసింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఫిలిం ఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో దర్శకులు వి.వి.వినాయక్, జి.నాగేశ్వర రెడ్డి, నిర్మాత సి.కళ్యాణ్, శ్రీమిత్రా చౌదరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న డ్రైవర్ యూనియన్ రాజు, లైట్‌మెన్ కూతురు అనూజ, నటుడు ధమ్ కొడుకు బాబు, దర్శకత్వ శాఖలో పనిచేస్తున్న ఉదయ్‌కాంత్ తదితర పదిమందికి చెక్‌లను అందజేశారు. అనంతరం కాదంబరి కిరణ్ మాట్లాడుతూ ''నాకు కష్టాలు ఉన్నాయని చిత్ర పరిశ్రమలో ఎవరూ చెప్పుకోరు. అలా చెప్పుకుంటే అవకాశాలు ఇవ్వరు, దగ్గరకు రానీయరు అనే అపోహ ఉంది. అయితే నేను నా జీవితంలోని కష్టాలను పరిశ్రమలోని వాళ్లతో పంచుకున్నాను. వాళ్లు నన్ను దూరం పెట్టకుండా ఆదరించారు. మనకున్న బాధలను చెప్పుకోవడంలో తప్పు లేదు. ఇవాళ 'మనం సైతం' ఇంతింతై విస్తరిస్తోంది. ఎంతోమంది సేవాభావం ఉన్న వాళ్లు సంస్థ కార్యక్రమాల్లో భాగస్వాములు అవుతున్నారు. చిరంజీవితో సహా పెద్దలంతా మమ్మల్ని ఆశీర్వదిస్తున్నారు. ఇవాళ వినాయక్, సి.కళ్యాణ్‌లు మా సంస్థను దీవించడానికి వచ్చారు. వాళ్లకు కృతజ్ఞతలు''అని అన్నారు. దర్శకుడు వి.వి.వినాయక్ మాట్లాడుతూ ''మనం సైతం సేవను కిరణ్ తన జీవితంలో భాగం చేసుకున్నారు. కష్టాల్లో ఉన్నవాళ్ల గురించి మాట్లాడుతుంటే ఆయన కళ్లలో నీళ్లు వస్తున్నాయి. అంతగా ఇతరుల బాధను పంచుకోవడం అద్భుతం. నా వంతుగా మనం సైతంకు లక్ష రూపాయలు విరాళంగా అందిస్తున్నాను. నా సహాయ సహకారాలు ఈ సంస్థకు ఎప్పుడూ ఉంటాయి''అని తెలిపారు. నిర్మాత సి.కళ్యాణ్ మాట్లాడుతూ ''పది మందితో ప్రారంభమైన 'మనం సైతం' సంస్థలో ఇప్పుడు లక్షమంది సభ్యులయ్యారు. రేపు కోటి మంది ఇందులో చేరాలని కోరుకుంటున్నాను. కోటి మందిలో పది శాతం స్పందించినా పది లక్షల రూపాయల విరాళం అందుతుంది. మనం ఘనంగా పుట్టిన రోజులు జరుపుకుంటాం. ఆ ఖర్చులో పది శాతం మనం సైతంకు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ సంస్థ దేశవ్యాప్తంగా విస్తరించాలి''అని చెప్పారు.

నీది నాది ఒకే కథ

శ్రీవిష్ణు హీరోగా నటించిన 'నీది నాది ఒకే కథ' చిత్రం ఈనెల 23న విడుదలకానుంది. ఇందులో శ్రీవిష్ణు విద్యార్థిగా కనిపించనున్నాడు. ఇక సినిమా టీజరు, పాటలకు అద్భుత స్పందన వస్తోంది. టీజర్‌లో చిత్తూర్ యాసలో శ్రీవిష్ణు పలికిన ఘాటైన డైలాగులు యూత్‌ను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. వేణు ఊడుగుల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో 'బిచ్చగాడు' ఫేమ్ సాట్నా టైటస్ హీరోయిన్‌గా నటించింది. అరాన్ మీడియా వర్క్స్ పతాకంపై ప్రశాంతి, కృష్ణ విజయ్, అట్లూరి నారాయణరావు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరాః రాజ్ తోట, సంగీతంః సురేష్ బొబ్బిలి, ఆర్ట్ః టి.ఎన్.ప్రసాద్.


శ్రీవిష్ణు, సాట్నా టైటస్


ఆ పాత్ర చేయాలని ఉంది

అరుంధతి, రుద్రమదేవి, బాహుబలి, భాగమతి... అనుష్క కెరీర్‌లో మైలురాళ్లుగా నిలిచిపోయిన సినిమాలివి. అందరు హీరోయిన్లకు దక్కే అవకాశాలు కావివి. ఈ సినిమాలతో హీరోయిన్లలో ఒక లెజెండరీ స్టేటస్ తెచ్చేసుకుంది అనుష్క. అందుకే ఆమె చాలా మంది హీరోయిన్లకు రోల్ మోడల్ అయిపోయింది. యంగ్‌బ్యూటీ మెహరీన్ సైతం అనుష్కే తనకు స్ఫూర్తి అని అంటోంది. ఆమె చేసిన పాత్రలు తనకెంతో ఇష్టమని చెబుతోంది. అనుష్క పాత్రలలో మీకేది ఇష్టమని అడిగితే... ''బాహుబలి చిత్రంలోని దేవసేన పాత్ర చేయాలని ఉంది. ఎప్పుడైనా అలాంటి క్యారెక్టర్ చేసే అవకాశం వస్తే మాత్రం నా అంత సంతోషించే వాళ్లు మరొకరు ఉండరు''అని చెప్పింది మెహరీన్.


మెహరీన్


అమీర్‌పేట్ టు అమెరికా

రాధా మీడియా బ్యానర్‌పై శ్రీమతి స్వప్న కొమండూరి సమర్పిస్తున్న చిత్రం 'అమీర్‌పేట్ టు అమెరికా'. హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో ఈ చిత్రం మొదటి ట్రైలర్‌ను తనికెళ్ల భరణి విడుదల చేయగా రెండవ ట్రైలర్‌ను రవికుమార్ లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో బందూక్ లక్ష్మణ్, డా.శ్రీనివాస్, పద్మజ, కాసర్ల శ్యామ్, మణిచందన, డా.రాజేశ్వరి, అంబర్‌పేట్ శంకర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తనికెళ్ల భరణి మాట్లాడుతూ ''సినిమా టైటిల్ చాలా రియలిస్టిక్‌గా ఉంది. అమీర్‌పేట్ టు అమెరికా ప్రయాణాన్ని అంతా ఈ సినిమాలో చూపించడం జరిగింది. నేను ఇందులో మంచి పాత్రను పోషించాను. యూత్‌ను అలరించే అంశాలు అన్నీ ఈ చిత్రంలో ఉన్నాయి. ఈనెల 30న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు''అని అన్నారు. రామ్మోహన్ కొమండూరి మాట్లాడుతూ ''ఈ చిత్రాన్ని 80 శాతం అమెరికాలో, 20 శాతం ఇండియాలో చిత్రీకరించడం జరిగింది. అమీర్‌పేట్ టు అమెరికా వెళ్లే వారి జీవితం స్వర్గంలా అనిపిస్తుంది. కానీ డాలర్ సంపాదించడానికి వారు చాలా కష్టాలు పడుతారు. ఆ సంఘటనలను ఈ సినిమాలో చూపించడం జరిగింది. ఈనెల 23న ఆడియోను విడుదల చేసి 30న సినిమాను రిలీజ్ చేస్తాము''అని చెప్పారు. నిర్మాత పద్మజ మాట్లాడుతూ ''ఈ చిత్రాన్ని తెరకెక్కించిన రామ్మోహన్ నాకు మరిది. ఆయన సినిమాను చాలా కష్టపడి తీశారు. నటీనటులు అందరూ ఎంతో సహకరించారు. సినిమా తప్పకుండా విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాను''అని తెలిపారు.


తనికెళ్లభరణి, రామ్మోహన్ కొమండూరి, స్వప్న కొమండూరి, పద్మజ, అంబర్‌పేట్ శంకర్‌తదితరులు


కాలచక్రంతో ముడిపడిన ప్రేమ కథ

ప్రియమణి టైటిల్ పాత్రలో శ్రీ శంఖు చక్ర ఫిలింస్ పతాకంపై కోటి తూముల, ఎ.హితేష్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'అంగుళీక'. ప్రేమ్ ఆర్యన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. దీపక్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రం టీజర్‌ను ప్రముఖ దర్శకుడు కోడిరామకృష్ణ విడుదల చేశారు. అనంతరం కోడిరామకృష్ణ మాట్లాడుతూ ''టీజర్ చాలా బాగుంది. ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకోవాలని కోరుకుంటు న్నాను'' అని అన్నారు. నిర్మాత కోటి తూముల మాట్లాడుతూ ''సూర్యగ్రహణం, కాలచక్రంతో కూడుకున్న కథాంశం ఇది. ప్రస్తుతం గ్రాఫిక్స్ వర్క్ జరుగుతోంది''అని తెలిపారు. దర్శకుడు ప్రేమ్ ఆర్యన్ మాట్లాడుతూ ''కాల చక్రంతో ముడిపడిన ఇద్దరు ప్రేమికుల వీరగాథ ఈ చిత్రం. అంగుళీకగా టైటిల్ పాత్రలో ప్రియమణి అద్భుతంగా నటించారు. సూర్యగ్రహణం ఘడియల్లో విడిపోయిన ప్రేమ జంట మళ్లీ సూర్యుడి ఆశీస్సులతో 585 ఏళ్ల తర్వాత కలుసుకుంటారు. అదే సమయంలో పగతో రగిలిపోతున్న దుష్టాత్మ ఆ జంటపై పగ తీర్చుకుందా? ఆ ప్రేమ జంట ఆత్మలకు ఎలా మోక్షం కలిగించింది? అనేవి సినిమాకు హైలైట్‌గా ఉంటాయి''అని చెప్పారు.


'అంగుళీక' టీజర్ విడుదల కార్యక్రమంలో కోడిరామకృష్ణ, ప్రేమ్ ఆర్యన్, కోటి తూముల, ఎ.హితేష్ రెడ్డి తదితరులు.

కెసిఆర్ కృషితో బంగారు తెలంగాణ

బిపిన్, రమ్య, అక్షర, లయన్ ఏవి స్వామి, బాబూమోహన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'బంగారు తెలంగాణ'. షిరిడీసాయి క్రియేషన్స్ పతాకంపై కూర అంజిరెడ్డి సమర్పణలో బిపిన్ స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఈ చిత్రం ఆడియో విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లోని ప్రసాద్‌ల్యాబ్‌లో జరిగింది. అయితే అంతకుముందు రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ కార్యాలయంలో సినిమా ఆడియో సీడీలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నటుడు, నిర్మాత, దర్శకుడు బిపిన్, లయన్ ఏవి స్వామి, రమ్య, అక్షర, అశోక్ కుమార్, కూర అంజిరెడ్డి, సురేందర్ రెడ్డి, సాయి త్రిశాంక్, దైవజ్ఞ శర్మ, సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఆడియో సీడీలను కూర అంజిరెడ్డి విడుదల చేసి తొలి సీడీని ఏవి స్వామికి అందించారు. అనంతరం బిపిన్ మాట్లాడుతూ ''తెలంగాణ కోసం ఎంతో మంది పోరాటం చేసి ఆత్మ బలిదానాలు చేసుకున్నారు. ముఖ్యంగా కెసిఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేసి తెలంగాణ కోసం ప్రాణాలు లెక్కచేయకుండా పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ తెలంగాణను బంగారు తెలంగాణగా తీర్చిదిద్దారు. అసలు తెలంగాణ ఎలా వచ్చింది..? అనే కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం''అని అన్నారు. సహ నిర్మాత ఏవి స్వామి మాట్లాడుతూ ''1969 నుండి ఇప్పటివరకు ఆరు దశాబ్దాలుగా తెలంగాణ సాధించడానికి ఎంతో మంది ప్రాణాలు అర్పించారు. కెసిఆర్ కృషి, పట్టుదల వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది''అని చెప్పారు.


'బంగారు తెలంగాణ' ఆడియో వేడుకలో కూర అంజిరెడ్డి, ఏవి స్వామి, బిపిన్, రమ్య, అక్షర తదితరులు



ఎయిర్ ఇండియా వాటాల కొనుగోలుకు మూడు సంస్థల ఆసక్తి

న్యూఢిల్లీ: అప్పుల ఊబిలో కూరుకుపోయిన ప్రభుత్వ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియాలో వాటాల కొనుగోలుకు ఎయిర్ ఫ్రాన్స్–కెఎల్ఎం, డేల్టా ఎయిర్‌లైన్స్‌తో పాటు జెట్ ఎయిర్వేస్‌లు ఆసక్తి చూపిస్తున్నాయి. కొద్ది రోజుల్లో ఎయిర్ ఇండియా పెట్టుబడుల ఉపసంహరణ(డిజిన్వెస్ట్‌మెంట్) ప్రక్రియను చేపట్టనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. త్వరలో బిడ్డర్లను ఆహ్వానించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అయితే మూడు విమాన సంస్థలు ఎయిర్ ఇండియా పట్ల ఆసక్తి చూపిస్తున్నాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఎయిర్ ఇండియా పెట్టుబడుల ఉపసంహరణలో జెట్ ఎయిర్వేస్‌తో పాటు మరో రెండు అంతర్జాతీయ విమాన సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. దీనిపై జెట్ ఎయిర్వేస్‌ను సంప్రదించగా.. స్పందించడానికి నిరాకరించింది.

బోయింగ్ డీల్ పూర్తి : 23వ బోయింగ్ 777 విమానాల డెలివరీని ఎయిర్ ఇండియా తీసుకుంది. వీటిని సుదూర ప్రయాణాలకు వినియోగించనున్నారు. దీంతో దశాబ్దం క్రితం అమెరికా విమాన తయారీ సంస్థతో కుదుర్చుకున్న 68వ ఎయిర్‌క్రాఫ్ట్ ఆర్డర్లు పూర్తయ్యాయి. బి777–300 ఇఆర్ దాదాపు 300 మంది ప్రయాణికులను తీసుకెళ్లగలదు.

ఆర్థిక గణాంకాలు కీలకం

- అంతర్జాతీయ పరిణామాలపైనా దృష్టి పెట్టాలి
- ఈవారం మార్కెట్‌పై విశ్లేషకుల సూచనలు



ముంబై: ఈ వారం కూడా అంతర్జాతీయ పరిణామాలతో పాటు దేశీయంగా ఆర్థిక గణాంకాలు మార్కెట్లను శాసించనున్నాయి. ఇన్వెస్టర్లు ఆర్థిక గణాంకాలపై దృష్టి పెట్టాలని ఎస్ఎంసి ఇన్వెస్ట్‌మెంట్ అండ్ అడ్వైజర్స్ సిఎండి డి.కె.అగర్వాల్ సూచిస్తున్నారు. నేడు (12న) ఫిబ్రవరి నెలకు గాను సిపిఐ (వినియోగ ధరల సూచీ) ఆధారిత ద్రవ్యోల్బణం గణాంకాలను ప్రభుత్వం వెల్లడించనుంది. అలాగే జనవరి నెలకు గాను ఐఐపి (పారిశ్రామికోత్పత్తి సూచీ) గణాంకాలను కూడా ప్రభుత్వం విడుదల చేయనుంది. జనవరిలో వినియోగ ధరల సూచీ ద్రవ్యోల్బణం 5.07 శాతం పుంజుకోగా.. ఫిబ్రవరిలో ఎలా ఉండనుందో వేచిచూడాలి. ఇక డిసెంబర్‌లో ఐఐపి 7.1 శాతం వృద్ధిని చూపింది. అదే సమయంలో ఫిబ్రవరి డబ్ల్యుపిఐ(టోకు ధర సూచీ) ఆధారిత ద్రవ్యోల్బణం గణాంకాలను ఈనెల 14న ప్రభుత్వం ప్రకటించనుంది. జనవరి నెలలో డబ్ల్యుపిఐ 2.84 శాతం పెరిగింది. ఆర్థిక గణాంకాలతో పాటు విదేశీ పోర్ట్‌పోలియో ఇన్వెస్టర్ల పెట్టుబడులు, ముడి చమురు ధరలు, డాలరుతో రూపాయి మారకం వంటివి ఈవారం స్టాక్‌మార్కెట్లకు కీలకమైనవి. వీటితోపాటు ఇతర అంశాలు కూడా స్టాక్‌మార్కెట్‌ను ట్రెండ్‌ను నిర్దేశిస్తాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈనెలలో అమెరికా వెల్లడించినున్న ఆర్థిక గణాంకాలు, అలాగే యుఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయాలు వంటివి.. ప్రపంచ మార్కెట్లను ప్రభావితం చేసే అవకాశముందని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు.

2.17 శాతం పతనమైన సెన్సెక్స్

గత వారం విదేశీ స్టాక్‌మార్కెట్లు దేశీయంగా ప్రతికూల ప్రభావానికి కారణమయ్యాయి. సెన్సెక్స్ గతవారం రికార్డు స్థాయిలో 739.80 పాయింట్లు అంటే 2.17 శాతం మేరకు పతనమై 33,307 వద్ద ముగిసింది. నిఫ్టీ 231 పాయింట్లు అంటే 2.2 శాతంపైగా నష్టపోయి 10,227 వద్ద స్థిరపడింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ స్టీల్, అల్యూమినియం దిగుమతులపై సుంకాలను పెంచడం, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ పెంపు అంచనాలు ఇన్వెస్టర్లలో ఆందోళనలను పెంచాయి. దీంతో గతవారం అమ్మకాలు వెల్లువెత్తగా.. దీనికి తోడు దేశీయంగా బ్యాంకింగ్ రంగాన్ని కుంభకోణాలు కుదుపేస్తుండటంతో మార్కెట్లు నేలచూపులు చూశాయి. మార్కెట్ల బాటలో చిన్న షేర్లలోనూ అమ్మకాలు ఊపందుకున్నాయి. ఫలితంగా బిఎస్ఇలో మిడ్ క్యాప్ ఇండెక్స్ దాదాపు 3 శాతం, స్మాల్ క్యాప్ 4.3 శాతం పతనమైంది.

టి ప్రైడ్, స్టాండప్ ఇండియా రుణాలు

సద్వినియోగం చేసుకోండి : ఆంధ్రాబ్యాంక్ ఏజీఎం దీన్ దయాళ్



మన తెలంగాణ / హైదరాబాద్ : దళిత యువతను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వాలు అందిస్తున్న ఔటి ప్రైడ్', 'స్టాండప్ ఇండియా' పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు పిలుపు నిచ్చారు. 'టి ప్రైడ్' పథకం ఉన్నది దళితులకోసమేనని, అయితే కొందరు అగ్రవర్ణాలవారూ దళిత విద్యార్థులకు ఆశ చూపి వారి సర్టిఫికెట్లతో దరఖాస్తు చేయించి రుణాలను పొందే ప్రయత్నం చేస్తున్నారని, ఇది ప్రభుత్వ స్ఫూర్తికి విరుద్ధమని ఆంధ్రా బ్యాంక్ ఏజిఎం దీన్ దయాళ్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల సంఘం (పిఈపిఎస్‌వై) సంయుక్త ఆధ్వర్యంలో 'యూత్ అండ్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ స్పెషల్ ఫోకస్ ఎస్‌సి, ఎస్‌టిస్ ఆంత్రప్రెన్యూర్‌షిప్' అనే అంశంపై ఫ్యాప్సీలో ఆదివారం జరిగిన సదస్సులో దీనదయాళ్ మాట్లాడుతూ, 'ప్రభుత్వ చేయూతను అందుకుని మీ కాళ్లపై మీరు నిలబడండి. ఆ తర్వాత ఇతరులకూ ఉపాధి కల్పించండి' అని దళిత నిరుద్యోగ యువతకు పిలుపునిచ్చారు. నిరుద్యోగ యువత ప్రభుత్వ పథకాలపై సంపూర్ణ అవగాహనతో ఉండాలని, సరైన ప్రాజెక్టులతో వస్తే బ్యాంకులు తప్పని సరిగా రుణాలు ఇస్తాయన్నారు. పిఇపిఎస్‌వై ఛైర్మన్ ఇనుగాల భీమారావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిజిఎం వి. మణిమారన్ , సిడ్బీ బ్యాంక్ ఏజిఎం ఏఎస్. రామయ్య, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఎండి లచ్చిరామ్ భూక్యా, ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ సభ్యులు సుంకర దేవయ్యతో పాటు దళిత ఔత్సాహిక యువత హాజరైనారు. ఎస్‌బిఐ డిజిఎం వి. మణిమారన్ మాట్లాడుతూ యువత కోసం రూపొందిస్తున్న కార్యక్రమాల్లో ఎప్పటికప్పుడు నూతన పథకాలు వస్తున్నాయని, వీటిని తెలుసుకుని దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏ పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నా సమాచారం అంతా వెబ్‌సైట్లలో ఉంటోందన్నారు.

నిధుల విడుదల ఏదీ? : సుంకర దేవయ్య

దళిత సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ప్రభుత్వం ఒక పక్క చెబుతూనే ఎస్‌సి, ఎస్‌టిలకు కేటాయించిన నిధులను విడుదల చేయడం లేదని ఎస్‌సి,ఎస్‌టి కమిషన్ సభ్యులు సుంకర దేవయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తాను కమిషన్ సభ్యుడినే అయినప్పటికీ దళిత బిడ్డగా ఈ అంశాన్ని తప్పనిసరి పరిస్థితుల్లో ప్రస్తావిస్తున్నానన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈసారి ప్రవేశపెట్టే బడ్జెట్‌లో తమ నిధులను వినియోగించుకునేలా ప్రభుత్వం చూడాలన్నారు.

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్





బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	29210	31240.64	0.55%
ముంబై	29810	31882.35	–0.43%
ఢిల్లీ	29650	31711.23	–0.5%
కోల్‌కతా	29930	32010.70	–0.43%
కేరళ	28200	30160.43	0%
బెంగళూరు	28500	30481.28	–0.35%
హైదరాబాద్	29050	31069.52	0.1%
గల్ఫ్	1402.73	1500.25	–0.65%

వెండి ధర (రూ./ కిలో)


నగరం	ఆదివారం	శనివారం	మార్పు (%)
చెన్నై	41500.00	41800.00	–0.72
ముంబై	41500.00	41800.00	–0.72
ఢిల్లీ	41500.00	41800.00	–0.72
కోల్‌కతా	41500.00	41800.00	–0.72
హైదరాబాద్	41500.00	41800.00	–0.72



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	330	విశాఖపట్నం	330
వరంగల్	332	చిత్తూరు	378
విజయవాడ	320	చెన్నై	385
గోదావరి	320	బెంగళూరు	365

టాప్ 10లో ఎనిమిది కంపెనీలకు రూ.67,153 కోట్ల నష్టం



న్యూఢిల్లీ : గత వారం టాప్ 10 బ్లూచిప్ కంపెనీల్లో దాదాపు ఎనిమిది కంపెనీలు నష్టాలను చవిచూశాయి. మొత్తంగా రూ.67,154 కోట్ల మార్కెట్ విలువ(ఎం–క్యాప్)ను ఈ కంపెనీలు కోల్పోయాయి.హెచ్‌డిఎఫ్‌సి, ఇన్ఫోసిస్ సంస్థలు మినహా మిగతా పది కంపెనీలు మార్కెట్ విలువను కోల్పోయాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఒఎన్‌జిసి, ఎస్‌బిఐ వంటి సంస్థలు భారీగా నష్టపోగా.. మరోవైపు బిఎస్ఇ సెన్సెక్స్ 2 శాతానికి పైగా పతనమైంది. టాప్ 10 కంపెనీల్లో.. రిలయన్స్ ఇండస్ట్రీస్ అత్యధికంగా రూ.22,534 కోట్ల మార్కెట్ విలువను కోల్పోయి రూ.5,77,752 కోట్లకు చేరింది. ఆ తర్వాత ప్రభుత్వరంగ ఆయిల్ దిగ్గజం ఒఎన్‌జిసి రూ.12,705 కోట్ల ఎం–క్యాప్‌ను కోల్పోయి రూ.2,30,549 కోట్లకు చేరింది. ప్రభుత్వరంగ బ్యాంక్ ఎస్‌బిఐ మార్కెట్ విలువ విషయానికొస్తే రూ.8,114 కోట్ల మార్కెట్ విలువను క్షీణించి రూ.2,18,520 కోట్లకు చేరగా.. దేశీయ వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఎం–క్యాప్ రూ.6,394 కోట్లు నష్టపోయి రూ.2,61,736 కోట్లు అయింది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ మార్కెట్ విలువ రూ.6,368 కోట్లు కోల్పోయి రూ.4,80,676 కోట్లు కాగా.. హిందుస్తాన్ యునిలివర్ ఎం– క్యాప్ రూ.5,419 కోట్లు పడిపోయి రూ.2,81,515 కోట్లకు చేరింది. ఎఫ్ఎంసిజి దిగ్గజం ఐటిసి విలువ రూ.5,123 కోట్లు పడిపోయి రూ.3,16,399 కోట్లు అయింది. టిసిఎస్ విలువ స్వల్పంగా రూ.498 కోట్లు తగ్గి రూ.5,80,891 కోట్లు అయింది. వీటికి విరుద్ధంగా హెచ్‌డిఎఫ్‌సి మార్కెట్ విలువ రూ.960 కోట్లు పడిపోయి రూ.3,00,883 కోట్లకు పెరిగింది. ఇక ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్ ఎం–క్యాప్ చూస్తే రూ.688 కోట్లు పెరిగి రూ.2,54,099 కోట్లు అయింది. ర్యాంకింగ్ పరంగా చూస్తే మొదటి స్థానంలో టిసిఎస్, ఆ తర్వాత వరుసగా రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఐటిసి, హెచ్‌డిఎఫ్‌సి, హెచ్‌యుఎల్, మారుతీ సుజుకీ ఇండియా, ఇన్ఫోసిస్, ఒఎన్‌జిసి, ఎస్‌బిఐ సంస్థలు ఉన్నాయి.

పిఎస్‌బి పాలన మెరుగుపర్చాలి

- ఎన్‌పిఎ సమస్యలను పరిష్కరించి రీక్యాపిటలైజేషన్ అందించాలి
- ఐఎంఎఫ్ డిప్యూటీ ఎండి టావో జాంగ్



ముంబై: డైమండ్ వ్యాపారీ నీరవ్ మోడీ వేల కోట్ల రుణాల కుంభకోణం నేపథ్యంలో ప్రభుత్వరంగ బ్యాంకులకు(పిఎస్‌బి) రీక్యాపిటలైజేషన్ అందించి, త్వరితగతిన కోలుకునేలా చర్యలు చేపట్టాలని ఐఎంఎఫ్(అంతర్జాతీయ ద్రవ్య నిధి) పేర్కొంది. ఎన్‌పిఎ(నిరర్థక ఆస్తుల) సమస్యను పరిష్కరించేందుకు ఇటీవల భారత్ చేపట్టిన సంస్కరణలు దోహదం చేస్తాయి. బ్యాంకింగ్, కార్పొరేట్ రంగాల్లో బలహీన పరిస్థితులను ఈ సంస్కరణలు పరిష్కరిస్తాయని ఐఎంఎఫ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ టావో జాంగ్ అన్నారు. భారత్‌లో పర్యటన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 2015 డిసెంబర్‌లో ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) 'అస్సెట్ క్వాలిటీ రివ్యూ'ను ప్రారంభించిందని.. దీని ప్రకారం, 2017 మార్చి ముగింపు నాటికి బ్యాంకుల అన్ని నిరర్థక ఆస్తులను గుర్తించి, తగిన చర్యలు చేపట్టనుందని అన్నారు. 2016 మే నెలలో కొత్తగా దివాలా చట్టంతో పాటు ఇతర ముఖ్యమైన చర్యలు చేపట్టిందని, ఇటీవల పిఎస్‌బిలకు ప్రభుత్వం రీక్యాపిటలైజేషన్‌ను ప్రకటించిందని టావో జాంగ్ అన్నారు.

అసోచామ్–క్రిసిల్ అధ్యయనం ప్రకారం, భారత్ బ్యాంకింగ్ రంగంలో మొండి బకాయిలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్చి ఆఖరునాటికి రూ.9.5 లక్షల కోట్లకు చేరతాయి. 2016–17 బ్యాంకుల్లో ఎన్‌పిఎలు రూ.8 లక్షల కోట్లు ఉండగా.. ఈసారి లక్షన్నర కోట్లు పెరిగింది. అయితే ఎన్‌పిఎ(నిరర్థక ఆస్తుల) తీర్మానాన్ని వేగవంతం చేసేందుకు విస్తృత ఆర్థిక సంస్కరణల ప్యాకేజీలో భాగంగా పిఎస్‌బిలకు మూలధన నిధులను అందించాలని ఐఎంఎఫ్ సూచించింది. అలాగే పిఎస్‌బిల పాలన మెరుగుపర్చి, ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వరంగం పాత్రను తగ్గించాలని, అలాగే బ్యాంకుల రుణ సామర్థ్యాన్ని పెంచాల్సి ఉందని టావో జాంగ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. డైమండ్ వ్యాపారీ నీరవ్ మోడీ, ఆయన మామ మెహుల్ చోక్సీలు పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో రూ.13 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారు. ఈ కేసుకు సంబంధించి మీడియా అడిగిన ప్రశ్నలకు జాంగ్ స్పందించలేదు.


ట్రేడ్ ఫైనాన్స్‌పై నిఘా

పిఎస్‌బిలకు ప్రత్యేక ఆడిట్ : ఆర్‌బిఐ నిర్ణయం



న్యూఢిల్లీ: బ్యాంకింగ్ మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) ప్రభుత్వరం బ్యాంకులపై నిఘా మరింత పెంచింది. వ్యాపార సంస్థల లావాదేవీలు నిర్వహించే పిఎస్‌బిలపై ప్రత్యేక ఆడిట్‌ను ప్రారంభించాలని ఆర్‌బిఐ నిర్ణయించింది. ట్రేడ్ ఫైనాన్సింగ్ కార్యకలాపాలను నిర్వహించే బ్యాంకుల.. లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించనుంది. ఇప్పటికే ప్రభుత్వ రంగ బ్యాంకులు జారీ చేసిన ఎల్ఒయుల జాబితాను పరిశీలించనుంది. అలాగే ముందస్తుగా రుణ అంగీకార పరిమితులను, మార్జిన్ కోసం ఉంచిన నగదు నిల్వలను, గ్యారెంటీల వివరాలను పంపాల్సిందిగా ఆర్‌బిఐ బ్యాంకులకు సూచించింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో వేల కోట్ల రుణాల మోసం నేపథ్యంలో ఆర్‌బిఐ కఠినంగా వ్యవహరిస్తోంది. ఇటీవల కాలంలో ట్రేడ్‌ఫైనాన్స్ విభాగంలో ఉద్దేశపూర్వక పన్ను ఎగవేతదారులు అత్యధికంగా ఉన్నారని గుర్తించిన ఆర్‌బిఐ.. వీటిపై దృష్టి పెట్టింది. నీరవ్‌మోడీ కూడా ట్రేడ్ ఫైనాన్స్ కిందే ఎల్ఒయులను పొందాడు. అందువల్ల భవిష్యత్తులో మోసాలు జరగకుండా ఆర్‌బిఐ కఠిన చర్యలు చేపట్టింది. రూ.50 కోట్లకు పైబడిన అన్ని మొండి బకాయిలను పరిశీలించాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది.

వచ్చే వారం మార్కెట్లోకి షియోమీ కొత్త ఫోన్



న్యూఢిల్లీ: చైనా మొబైల్ కంపెనీ షియోమీ దూకుడు మీద ఉంది. భారత్ మార్కెట్లో సామ్‌సంగ్‌తో దీటుగా మార్కెట్‌ను సంపాదించుకున్న ఈ సంస్థ.. వచ్చేవారం మరో కొత్త ఫోన్‌ను తీసుకొచ్చేందుకు రంగం సిద్ధం చేసింది. ఇ–కామర్స్ వెబ్‌సైట్ అమెజాన్‌లో రెడ్‌మి 5 మొబైల్‌ను ఎక్స్‌క్లూజివ్‌గా విడుదల చేయనున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే కొత్త స్మార్ట్‌ఫోన్‌కు సంబంధించిన వివరాలను షియోమీ తన వెబ్‌సైట్లో ఇచ్చింది. ఈ ఫోనుకు సంబంధించిన ఫీచర్స్‌ను తెలిపేలా 'కాంపాక్ట్ పవర్‌హౌస్' అంటూ ఓ ఫొటోలో పేర్కొంది. ఇక అమెజాన్‌లో మార్చి 14న ఈ ఫోన్ విడుదల కానున్నట్టు తెలుస్తున్నా.. అధికారికంగా ఇంకా ప్రకటన చేయలేదు. ఇప్పటిదాకా స్పష్టంగా రెడ్‌మి 5 అని పేర్కొనలేదు. కాకపోతే అటు షియోమీ వెబ్‌సైట్ సైట్.. ఇటు అమెజాన్‌లో పేర్కొన్న వివరాలను బట్టి రెడ్‌మి 5 మోడల్‌నే విడుదల చేస్తారని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. వెబ్‌సైట్లలో పేర్కొన్న ప్రకారం, ఈ మోడల్ ధర రూ.9,999గా ఉండే అవకాశం ఉంది. రెడ్‌మి 5 ఫీచర్లు.. 5.7 అంగుళాల ఫుల్ హెచ్‌డి టచ్‌స్క్రీన్, స్నాప్‌డ్రాగన్ 450 ప్రాసెసర్, 2జిబి, 3జిబి, 4జిబి ర్యామ్, 16జిబి లేదా 32జిబి అంతర్గత మెమొరీతో విడుదల చేసే అవకాశం ఉంది. వెనక వైపు 12ఎంపి కెమెరా, ముందు వైపు 5 ఎంపి కెమెరా, 3300 ఎంఎహెచ్ బ్యాటరీ, నానో డ్యూయల్ సిమ్,ఆండ్రాయిడ్ నూగట్ వెర్షన్‌తో లభించనుంది.

20న మార్కెట్లోకి లెనోవా 'ఎస్5'



న్యూఢిల్లీ: చైనా మొబైల్ తయారీ సంస్థ లెనోవా కొత్త స్మార్ట్ ఫోన్ 'ఎస్5' వచ్చేవారం మార్కెట్లో రానుంది. బ్లాక్, రెడ్, సిల్వర్ రంగుల్లో ఈ ఫోన్ వినియోగదారులకు లభ్యం కానుంది. ఈనెల 20న విడుదల చేయనున్న ఈ ఫోన్ ధర వివరాలను ఇంకా వెల్లడించలేదు. లెనోవా ఎస్5 ఫీచర్లు.. 5.65 ఇంచ్ ఫుల్ హెచ్‌డి ప్లస్ 2.5డి డిస్‌ప్లే, 2 గిగాహెర్జ్ ఆక్టాకోర్ స్నాప్‌డ్రాగన్ 625 ప్రాసెసర్, 3/4 జిబి ర్యామ్, 32/64 జిబి స్టోరేజ్, 128 జిబి ఎక్స్‌పాండబుల్ స్టోరేజ్, ఆండ్రాయిడ్ 8.0 ఓరియో, హైబ్రిడ్ డ్యుయల్ సిమ్, ఫింగర్‌ప్రింట్ సెన్సార్, 4జి వోల్ట్, బ్లూటూత్, 3000 ఎంఎహెచ్ బ్యాటరీ సామర్థ్యం కలిగి ఉంటుంది.

26న రానున్న ఒప్పో ఎఫ్7



న్యూఢిల్లీ: మొబైల్ తయారీ సంస్థ ఒప్పో కొత్త స్మార్ట్‌ఫోన్ ఎఫ్7 ఈ నెల 26న మార్కెట్లోకి రానుంది. ఒప్పో ఎఫ్ సిరీస్‌లో ఎఫ్5 తరువాత వస్తున్న ఫోన్ ఇదే.. ఒప్పో ఎఫ్7 స్మార్ట్‌ఫోన్‌లో అందివ్వనున్న ఫీచర్లను ఇంకా ఆ సంస్థ వెల్లడించలేదు. అయితే వాటికి సంబంధించిన పలు వివరాలు నెట్‌లో లీకయ్యాయి. దీని ప్రకారం ఈ ఫోన్‌లో 6.2 ఇంచ్ ఫుల్ హెచ్‌డీ ఫుల్ వ్యూ డిస్‌ప్లేను ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఈ ఫోన్ డిస్‌ప్లే ఐఫోన్ 10 తరహాలో ఉంటుందని, డిస్‌ప్లే ఎడ్జ్ టు ఎడ్జ్ తరహాలో ఉంటుందని తెలుస్తోంది. 25 మెగాపిక్సల్ కెపాసిటీ ఉన్న పవర్‌ఫుల్ ఫ్రంట్ సెల్ఫీ కెమెరా, ఈ కెమెరా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా పనిచేస్తుంది. దీన్ని ఫేస్ అన్‌లాక్ చేసేందుకు కూడా ఉపయోగించుకోవచ్చని తెలుస్తోంది. కంపెనీ ఈ ఫోన్‌కు సంబంధించిన వివరాలను త్వరలో విడుదల చేయనుంది.

ఏప్రిల్‌లో 'చంద్రయాన్–2' ప్రయోగం

చెన్నై : చంద్రుడిపై 'చంద్రయాన్–2' ఉపగ్రహం ప్రయోగాన్ని ఏప్రిల్‌లో చేపట్టడానికి ఇస్రో సమాయత్తమవుతోంది. చంద్రుని ఉపరితలాన్ని పరిశీలించేందుకు ఈ ఉపగ్రహంతో పాటు రోవర్‌ను కూడా పంపించాలని భావిస్తోంది. చంద్రయాన్–2' ఉపగ్రహాన్ని ఏప్రిల్‌లో ప్రయోగిస్తే చంద్రునిపై ఇది రెండో ప్రయోగమవుతుంది. ఏప్రిల్‌లో సాధ్యంకాని పక్షంలో అక్టోబరు చివరినాటికి ప్రయోగించాలని ఇస్రో భావిస్తోంది. 'చంద్రయాన్–2' ఉపగ్రహాన్ని ఏప్రిల్‌లో ప్రయోగించాలని అనుకుంటున్నాం. ఒకవేళ అప్పటికీ ఇది సాధ్యం కాకపోతే అక్టోబరు చివరి నాటికి ప్రయోగానికి సిద్ధపడుతున్నాం' అని ఇస్రో చైర్మన్ కె.శివన్ ఆదివారం ఇక్కడ విలేకరులకు తెలిపారు. చాంద్రయణ్–2' ఉపగ్రహం పూర్తిగా ఆర్బిటర్ అని, ఇందులో ల్యాండర్, ఆరు చక్రాలు కలిగిన రోవర్ ఉంటాయని ఆయన వెల్లడించారు. చంద్రునిపై పూర్తిగా తిరిగి అక్కడి సమాచారాన్ని భూమికి చేరవేయడానికి ఇది ఎంతగానో దోహదపడుతుందని, ఈ సమాచారం చంద్రుని ఉపరితలాన్ని విశ్లేషించడానికి చాలా కీలకంగా ఉంటుందని తెలిపారు.



జివిఎల్‌కు బిజెపి రాజ్యసభ సీటు



న్యూఢిల్లీ : రాజ్యసభ ఖాళీ స్థానాల ఎన్నికలకు బిజెపి ఆదివారం నలుగురు ముగ్గురు అభ్యర్థులను ఖరారు చేసింది. ప్రముఖ ఎన్నికల విశ్లేషకులు జివిఎల్ నరసింహారావు, అనిల్ జైన్, సరోజ్ పాండే , అనిల్ బలూనీలను తమ అభ్యర్థులుగా ప్రకటించింది. 59 రాజ్యసభ ఎన్నికలకు ఈ నెల 23న ఎన్నికలు జరుగుతాయి. నామినేషన్ల ప్రక్రియ 12వ తేదీతోనే ముగుస్తుంది. ఎగువ సభకు పోటీ కోసం ఇప్పటికే ఏడుగురు కేంద్ర మంత్రులు , మరొక్క అభ్యర్థి పేరును బిజెపి ఇటీవలే ప్రకటించింది. అరుణ్ జైట్లీ వంటి పలువురు కేంద్ర మంత్రులు రంగంలో ఉన్నారు. జైట్లీ ఈసారి గుజరాత్ నుంచి కాకుండా ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు వెళ్లుతున్నారు. ఇక మరో మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మధ్యప్రదేశ్ నుంచి చోటు దక్కించుకుంటున్నారు.

త్వరలో పార్టీ పేరు ప్రకటన



చెన్నై : అతి త్వరలో పార్టీ పేరును ప్రకటించడంతో పాటు ఈ వారం తరువాత మదురైలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తానని ఎఐఎడిఎంకె అసమ్మతి నేత టిటివి దినకర్ పేర్కొన్నారు. పార్టీ చిహ్నంపై తలెత్తిన చట్టబద్ధ అవరోధాలు తొలగడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఢిల్లీ హైకోర్టు తమ పిటిషన్‌ను అనుమతించడంతో మదురై జిల్లాలోని మేలూర్‌లో ఈనెల 15న ఓ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఉదయం 9 గంటలకు పార్టీ పేరును, పార్టీ జెండాను ఆవిష్కరించనున్నట్లు దినకరన్ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. గత ఏడాది డిసెంబర్‌లో తమిళనాడులోని ఆర్‌కె నగర్ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన దినకర్‌కు ఎన్నికల కమిషన్ ప్రెషర్ కుక్కర్ గుర్తును కేటాయించింది. ఈ ఎన్నికల్లో ఆయన విజయం సాధించారు. ఈ నేపథ్యంలో ప్రెషర్ కుక్కర్ గుర్తునే తాను పెట్టబోయే పార్టీ గుర్తుగా కేటాయించాలని ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశారు. కోర్టు అందుకు అనుమతిచ్చింది.

అయోధ్యపై ఏకాభిప్రాయం కష్టం

నాగ్‌పూర్: అయోధ్య వివాదంపై ఏకాభిప్రాయం సులభం కాదని, అయితే రామాలయ నిర్మాణం జరుగుతుందని ఆర్‌ఎస్‌ఎస్ పేర్కొంది. ఆదివారం అతి ముఖ్యమైన అఖిల భారతీయ ప్రతినిధుల సభలో పాల్గొన్న ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శి భయ్యాజీ జోషి సైడ్‌లైన్స్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఈ అంశం ప్రస్తుతం కోర్టు విచారణలో ఉందన్నారు. కోర్టు తీర్పు వెలువడిని వెంట నే, దాని ఉత్తర్వులకు అనుగుణంగా దేవాలయం నిర్మాణం ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. ఈ అంశంపై ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీ రవిశంకర్ మధ్యవర్తిత్వ ప్రయత్నాలను జోషి స్వాగతించారు. తాము కూడా పరస్పర అంగీకారంతో ఆలయ నిర్మాణం జరపాలని కోరుకున్నామని, అయితే సమాజంలో ఎన్నో వర్గాలు ఉన్నాయని, ఈ అంశంపై ఏకాభిప్రాయం అంత సులభం కాదన్నారు. ఆ వివాదాన్ని సుప్రీంకోర్టు ధర్మాసనం మార్చి 14న విచారించనుంది.

జయప్రద, ఆజంఖాన్ మాటల యుద్ధం

లక్నో : ఉత్తరప్రదేశ్ మాజీ మంత్రి, సమాజ్‌వాదీ పార్టీ నేత అజం ఖాన్, జయప్రద నడుమ మరోసారి మాటల యుద్ధ మొదలైంది. శనివారం నాడు మీడియాతో మాట్లాడిన జయప్రద, పద్మావత్ చిత్రంలో అల్లావుద్దీన్ ఖిల్జీ పాత్ర అజంఖాన్‌ను గుర్తు చేసిందని, తాను ఎన్నికల్లో పోటీ చేసిన సమయంలో ఆయన ఏ విధంగా వేధించేవారో కళ్లకు కట్టినట్టయిందని విమర్శలు ఎక్కుపెట్టారు. అప్పట్లో తన ఫోటోతో కొన్ని పోస్టర్లు కూడా ఆయన విడుదల చేశారని దుయ్యబట్టారు. జయప్రద వ్యాఖ్యల వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం కావడంతో అజంఖాన్ ఆదివారంనాడు బదులిచ్చారు. 'పద్మావత్ చిత్రం వచ్చింది. ఖిల్జీ పాత్ర చెడ్డదని కూడా విన్నా. అయితే ఖిల్జీ రాకముందే పద్మావతి ప్రాణత్యాగం చేసింది. ఇప్పుడు ఒక మహిళ, అందులోనూ ఒక డాన్సర్ నాపై వ్యాఖ్యలు చేస్తోంది. ఆ డాన్సర్ పాటలు వింటూ కూర్చుంటే రాజకీయాలపై నేనెలా దృష్టి సారించగలను?' అంటూ అజం ఖాన్ వ్యాఖ్యానించారు.


బోరుబావిలో పడ్డ బాలుడు



భోపాల్: మధ్యప్రదేశ్‌లో ఓ నాలుగేళ్ల బాలుడు ప్రమాదవశాత్తూ బోరుబావిలో పడిపోయాడు. సమాచారం అందుకున్న వెంటనే స్పందించిన అధికార యంత్రాంగం బాలుడ్ని కాపాడేందుకు సహాయక బృందాలను రంగంలోకి దించింది. దివాన్స్ జిల్లాకు 110 కిలోమీటర్ల దూరంలోని కాటేగావ్‌లో మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. తల్లిదండ్రులు పొలం పనుల్లో ఉండగా అక్కడే ఆడుకుంటున్న బాలుడు ప్రమాదవశాత్తూ 110 అడుగుల లోతున్న బోరుబావిలో పడిపోయాడు. బాలుడి తల్లిదండ్రులు ఇచ్చిన సమాచారం మేరకు వెంటనే సహాయచర్యలు మొదలైయ్యాయి. బాలుడు 40 అడుగుల లోతులో ఉన్నట్లు గుర్తించారు. బోరుబావికి సమాంతరంగా గొయ్యి తవ్వడంతో పాటు లోపలికి ఆక్సిజన్ పంపుతున్నారు. జిల్లా యంత్రాంగం సైనిక సాయం కోరింది.

తెగిన కాలును దిండుగా వాడారు...


యుపిలో వైద్యుల నిర్వాకం



లక్నో: మానవత్వం మచ్చుకైన కనిపించని దారుణ ఘటన ఒకటి ఉత్తరప్రదేశ్‌లో చోటుచేసుకుంది. రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ లారీ క్లీనర్ కాలు తొలిగించారు అక్కడి వైద్యులు. అనంతరం అతడిని అత్యవసర వార్డుకు తరలించాల్సి వచ్చింది. అయితే రోగి విశ్రాంతి తీసుకోవడానికి దిండు లేకపోవడంతో అతని కాలునే తలగడగా వాడారు. ఈ విషయాన్ని బాధితుడితో పాటు వచ్చిన మరో వ్యక్తి అధికారులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటకు వచ్చింది. ఈ అమానవీయ ఘటన యుపిలోని మహరాణి లక్ష్మీ బాయి మెడికల్ కళాశాల ఆస్పత్రిలో చోటు చేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కళాశాల ప్రిన్సిపాల్ సాధనా కౌశిక్ వెంటనే స్పందించారు. క్రమశిక్షణ చర్యల కింద ఆర్థోపెడిక్ వైద్యుడితో పాటు ఇన్‌ఛార్జ్ నర్సులను తొలగించారు. ఈ చర్యకు పాల్పడిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జీవితకాల అధ్యక్షుడు జిన్‌పింగ్

చైనా చరిత్రాత్మక నిర్ణయం, మావో జెడాంగ్ తరువాత తిరుగలేని నేతగా అవతరణ



బీజింగ్ : చైనాలో అధ్యక్షులు జి జిన్‌పింగ్ సూపర్ పవర్‌గా ఎదిగారు. అధ్యక్ష పదవికి ఉండే రెండు పర్యాయాల పరిమితిని ఎత్తివేయడం ద్వారా జిన్‌పింగ్ చైనాకు జీవితకాల అధ్యక్షుడిగా కొనసాగేందుకు వీలు కల్పించే చట్టాన్ని చైనా పార్లమెంట్ ఆమోదించింది. రెండు పర్యాయాల కాలపరిమితిని రద్దు చేస్తూ చారిత్రక రాజ్యాంగ సవరణకు పార్లమెంట్ ఆదివారం ఆమోదం తెలిపింది. జిన్‌పింగ్‌కు అధ్యక్ష కాలపరిమితి నిబంధనలను తొలిగించాలని అంతకు ముందు విస్తృత అధికారాలు ఉన్న చైనా కమ్యూనిస్టు పార్టీ నిర్ణయించింది. సిపిసి పొలిట్ బ్యూరో ఇంతకు ముందే జిన్‌పింగ్ అధికారాల కొనసాగింపును ఆమోదించడంతో ఆదివారం నాటి పార్లమెంట్ భేటీ లాంఛనప్రాయంగానే మారింది. మొత్తం 2964 ఓట్లలో ముగ్గురు గైర్హాజరు కాగా, రెండు వ్యతిరేకంగా వచ్చాయి. దీనితో జిన్‌పింగ్ అధికారం సుస్థిరం అయింది. రెండోసారి అధ్యక్షుడిగా 64 సంవత్సరాల జిన్‌పింగ్ ఐదేళ్ల పదవీకాలం ఈ నెల నుంచి ఆరంభం అవుతుంది. ఇటీవలి దశాబ్దాలలో చైనా కమ్యూనిస్టు పార్టీలో తిరుగులేని నేతగా జిన్‌పింగ్ పేరు తెచ్చుకున్నారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మావో జెడాంగ్ తరువాత జీవితకాల అధికారం హక్కు పొందిన నేతగా జిన్‌పింగ్ నిలిచారు. కీలకమైన సిపిసి అధినేతగా, సైన్యం సర్వాధ్యక్షులుగా జిన్‌పింగ్ ఉన్నారు. నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్‌గా వ్యవహరించే చైనా పార్లమెంట్ రాజ్యాంగ సవరణకు అసాధారణ పద్ధతిని పాటించింది. చేతులు ఎత్తే పద్ధతి కాకుండా, సమ్మతి లేదా అసమ్మతి తెలిపే బ్యాలెట్ పత్రాలను వాడారు. తొలుత ప్రెసిడెంట్ జిన్‌పింగ్ బ్యాలెట్ పత్రాన్ని చేతపట్టుకుని గ్రేట్ హాల్ ఆఫ్‌ది పీపుల్ వద్ద వరుసక్రమంలో నిలిచారు. ఈ రాజ్యాంగ సవరణతో దేశాధ్యక్షుడితో పాటు ఉపాధ్యక్షుడి పదవీకాల పరిమితి కూడా తొలిగిపోయింది. 1954లో చైనా రాజ్యాంగం రూపొందింది. ఇప్పటి రాజ్యాంగం 1982 నుంచి అమలులో ఉంది, అప్పటి నుంచి ఇప్పటివరకూ నాలుగుసార్లు రాజ్యాంగ సవరణలు జరిగాయి. ఇప్పుడు జరిగింది అత్యంత కీలకమైన ఐదవ సవరణ. ప్రస్తుత రాజ్యాంగ సవరణతో దేశంలో ఇప్పటివరకూ ఉన్న సమిష్టి నాయకత్వ విధానం పూర్తిస్థాయిలో సమసిపోయింది. దేశంలో నియంతృత్వ ధోరణులు తలెత్తకుండా ఉండేందుకు, మావో దశలో ఏక పార్టీ దశలో జరిగిన కొన్ని పరిణామాలు తలెత్తకుండా ఉండేందుకు సమిష్టి నాయకత్వం పాటిస్తూ వస్తున్నారు. అయితే ఇప్పుడు దీనికి చెల్లుచీటి పడింది.

ఇండియాకు ఆందోళన

జిన్‌పింగ్‌కు అపరిమిత అధికారాల అంశం యావత్ ప్రపంచంలో, అందులోనూ చైనా ఇరుగుపొరుగు దేశాలకూ, ప్రత్యేకించి ఇండియాకు కలవరం కల్గించాయి. డోక్లామ్ తదితర వివాదాస్పద అంశాలు, నేపాల్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి దేశాలతో విస్తరిస్తున్న చైనా సంబంధాల నేపథ్యంలో ఏకైక నాయకత్వం ప్రభావం తీవ్రంగానే ఉంటుందని ఇండియా విదేశాంగ వ్యవహారాల నిపుణులు విశ్లేషించారు. భారత్‌కు సమీపంలో నుంచే భూటాన్‌కు చేరుకునే అత్యంత కీలకమైన రహదారిని నిర్మించుకునేందుకు చైనా యత్నిస్తోందని, ఇది డోక్లామ్ వివాదానికి దారితీస్తోందని, మరో వైపు పాకిస్థాన్‌ను భాగస్వామ్యం చేసుకుని వాణిజ్య రాదారిని నిర్మించాలనే ప్రతిపాదన, అంతకు మించి అంతర్జాతీయ సముద్ర జలాలలో ఆధిపత్యం వంటి అంశాలు జిన్‌పింగ్‌కు బలీయమైన పగ్గాలతో జటిలం కావచ్చునని భావిస్తున్నారు. అయితే వీటి సత్వర పరిష్కారానికి కూడా అవకాశాలు లేకపోలేదనే వాదన కూడా విన్పిస్తోంది. దేశాధ్యక్షుడితో పాటు ఉపాధ్యక్షుల జీవితకాల అవకాశాలను కల్పించడం కేవలం పార్టీలో జిన్‌పింగ్‌కు అసమ్మతి లేకుండా చేసేందుకు అని భావిస్తున్నారు. ద్వితీయ శ్రేణిలో అసమ్మతి రాకుండా చేసేందుకు ఎప్పటికప్పుడు అధికార కేంద్రీకృత బలోపేతానికి పార్టీలో అధికార వ్యవస్థలో తమ అనుచరుల ఉనికికి జిన్‌పింగ్ కీలక చర్యలు చేపట్టారని వెల్లడైంది. రాబోయే రోజులలో అత్యున్నత స్థాయిలో ప్రభుత్వ అధికారులలో మార్పులు చేర్పులకు రంగం సిద్ధం చేశారు. మంత్రి మండలిని కూడా ప్రక్షాళించనున్నారు.

ఏక పార్టీ వ్యవస్థ నుంచి ఏక నేత దశకు

ఇప్పటి రాజ్యాంగ సవరణతో చైనాలో అత్యంత కీలకమైన మార్పు జరిగిందని పరిశీలకులు విశ్లేషించారు. ఇప్పటికే దేశం ఏకపార్టీ ఆధిపత్యంలో ఉందని, ఇక ఏక నేతకు అత్యంత బలం సమకూర్చడం జరిగిందని, జీవితకాల అధ్యక్ష అవకాశం కీలకమైన అంశం అని తెలిపారు. కొందరు విమర్శకులు ఇది రాజరిక ధోరణికి దారితీస్తుందని అభిప్రాయపడ్డారు. జిని ఇప్పుడు చైనా పరిభాషలో లింగ్ జియూగా వ్యవహరిస్తారు. అంటే అత్యున్నత స్థాయి ప్రతిష్టగల నేతగా గౌరవం దక్కుతుంది. ప్రపంచపు అత్యధిక సైనిక బలగాలను మరింత బలోపేతం చేసేందుకు, ఆధునిక యుద్ధాలలో కూడా విజయం సాధించే దిశకు మార్చేందుకు పూర్తి అధికారాలు ఇప్పుడు జిన్‌పింగ్‌కు దక్కాయి.



నాన్న హంతకులను క్షమించేశాం : రాహుల్

న్యూఢిల్లీ : 'నాన్నను చంపిన హంతకులను నేను, నా సోదరి ప్రియాంక క్షమించేశాం' అని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తెలిపారు. రాజకీయాల్లో తప్పుడు శక్తులకు వ్యతిరేకంగా నిలిచినా, దేని గురించైనా మనం పోరాడినా మనం చనిపోతాం. నా తండ్రి, నానమ్మ చనిపోతారని మా కుటుంబం ముందే ఊహించింది' అని పేర్కొన్నారు. తెలిపారు. భద్రతా గార్డుల చేతిలో రాహుల్ నానమ్మ ఇందిరాగాంధీ, తండ్రి రాజీవ్ 1991 మే 21న ఆత్మాహుతి దాడిలో మృతి చెందిన విషయంపై సింగపూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో రాహుల్ పై విధంగా స్పందించారు. తన తండ్రి మరణాన్ని రాహుల్ ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ, నాన్న చనిపోయిన తర్వాత తాము చాలాకాలం బాధపడ్డామని, ఎంతో ఆగ్రహానికి గురయ్యామని చెప్పారు. క్రమంగా, ఆ తర్వాత పూర్తిగా ఆయనను (రాజీవ్) చంపిన వారిని తాను, తన సోదరి ప్రియాంక క్షమించేశామని రాహుల్ తెలిపారు. తాను విశేషమైన అధికారాలతో పుట్టానంటూ కొందరు అభిప్రాయపడుతుంటారని, అయితే ఇందులో నిజం లేదని ఆయన చెప్పారు. 'నేను 14 ఏళ్ల వయసులో ఉండగా అమ్మమ్మను చంపేశారు. నా తండ్రి హత్యకు గురయ్యారు. మా చుట్టూ ఎప్పుడూ 15 మంది రేయింబవళ్లూ ఉండేవారు. ఇది మాకున్న విశేషాధికారం అని ఏనాడూ అనుకోలేదు' అని రాహుల్ వ్యాఖ్యానించారు.

శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయి : కమల్

ఈరోడ్: తమిళనాడులో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని మక్కల్ నీతి మైయమ్ (ఎంఎన్‌ఎం) వ్యవస్థాపకుడు కమల్ హాసన్ ఆరోపించారు. మహిళల భద్రతకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమాజం మహిళలతో వ్యవహరిస్తున్న తీరు సిగ్గు చేటైన విషయమని, రోడ్లపైన వారు సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. చెన్నైలో ఇటీవల కాలేజ్ విద్యార్థిని హత్యతోపాటు మహిళలపై దాడులను ఆయన ఉదాహరించారు. క్రిస్టియన్ మిషనరీ నుంచి విరాళాలు తీసుకుంటున్నారన్న ఆరోపణలను కమల్ హాసన్ తోసిపుచ్చారు.

ముంబయిలో టెన్షన్ టెన్షన్

- ఆర్థిక రాజధానికి చేరుకున్న 30వేల మంది రైతులు
- నేడు అసెంబ్లీ ముట్టడి



ముంబయి : రుణ విమోచనతో పాటు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ భారతీయ కిసాన్ సభ ఆధ్వర్యంలో 30 వేల మంది రైతులు చేపట్టిన యాత్ర ఆదివారం ముంబయి చేరుకుంది. వీరంతా సియోన్‌లోని సోమయ్య గ్రౌండ్‌కు చేరుకుంటున్నారు. ఇక్కడ నుంచే తదుపరి ఆందోళన కార్యక్రమంపై నిర్ణయం తీసుకుంటారు. దక్షిణ ముంబయిలోకి చొచ్చుకుపోవాలని రైతులు యోచిస్తున్నారు. రుణాలను మొత్తం మాఫీ చేయాలని, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాట ధర కల్పించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని తదితర డిమాండ్లతో రాష్ట్ర అసెంబ్లీని ఘెరావ్ చేయబోతున్నారు.
ప్రస్తుతం అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాలు జరుగుతుండడంతో రైతుల ఆందోళనతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆదివారం వేలాది మంది ముంబయికి చేరుకోవడంతో నిర్వాహకులు అంచనా ప్రకా రం ఆందోళనలో పాల్గొంటున్న రైతుల సంఖ్య ప్రస్తుతానికి 34వేలకు చేరింది. ఈ నేపథ్యంలో ముంబయి పోలీసులు ఆది, సోమవారాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. అయిన్పటికీ మోర్చా, హెచ్‌ఎస్‌సి, సిబిఎస్‌ఇ, ఐసిఎస్‌ఇ, ఐఎస్‌సి పరీక్షలు జరుగుతున్న ప్రాంతాల్లో విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే, సోమవారం జరిగే పరీక్షలకు విద్యార్థులు ముందుగానే బయలు దేరి వెళ్లాల్సిందిగా పోలీసులు సూచిస్తున్నారు. ఆలిండియా కిసాన్ సభ (ఎఐకెఎస్) ఈ ర్యాలీకి నేతృత్వం వహిస్తోంది. వేలాది మంది రైతులు, తమ భార్యలు, తల్లిదండ్రులతో ఆందోళనకు తరలివచ్చారని ఎఐకెఎస్ తెలిపింది. రైతులంతా ఎంతో కష్టనష్టాలు భరిస్తూ ఇంత దూరం నడుచుకుంటూ వచ్చారని, వారి డిమాండ్లు వాస్తవమైనవి కాకపోతే ఇలా ఇంత దూరం వస్తారా? అని ఎఐకెఎస్ నేత అజిత్ నవాలే ప్రశ్నించారు. ప్రభుత్వానికి తమ డిమాండ్లు వినిపించేందుకే వారు ఇక్కడికి వచ్చారని ఆయన చెప్పారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామి అయిన శివసేన రైతుల ర్యాలీకి మద్దతు ప్రకటించింది. ఉద్ధవ్ థాక్రే తరుపున శివసేన సీనియర్ నేత ఏక్‌నాథ్ సాహాపూర్‌లో శనివారం రైతులను కలుసుకున్నారు. మొదటి దశ రుణ విమోచన పథకం కింద రూ.4వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తున్నట్టు మహారాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది ప్రకటించిన విషయం విదితమే.

'మాకు టయోటా ఇన్నోవా కార్లే కావాలి'

అసెంబ్లీ కమిషనర్, కార్యదర్శులకు లేఖ రాసిన ఎన్‌పిఎఫ్ ఎంఎల్‌ఎలు

నాగాలాండ్ : వారు నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పిఎఫ్)కు చెందిన కొత్తగా ఎన్నికైన ఎంఎల్‌ఎలు, ఇంకా ప్రమాణ స్వీకారం కూడా చేయలేదు. అప్పుడే సౌకర్యాల ఏర్పాటులో నిమగ్నమయ్యారు. తమకు రినాల్ట్ డస్టర్ వాహనాలకు బదులుగా సౌకర్యవంతంగా ఉండే టయోటా ఇన్నోవా కార్లను కేటాయించాలని అసెంబ్లీ కమిషనర్, కార్యదర్శులకు లేఖ రాశారు. ప్రతిపక్ష పార్టీకి చెందిన మొత్తం 27 మంది ఎంఎల్‌ఎలలో 11 మంది ఈమేరకు లేఖలు రాసినట్టు సమాచారం. 'ఎంఎల్‌ఎలకు డస్టర్ వాహనాలను కేటాయించేందుకు అసెంబ్లీ కార్యదర్శి యోచిస్తున్నట్టు మాకు తెలిసింది. నిర్వహణపరంగా సరిగా లేని డస్టర్ వాహనాలను కేటాయిస్తే స్వీకరించడానికి ఎన్‌పిఎఫ్ శాసనసభ్యులమైన మేం సిద్ధంగా లేం' అని ఆ లేఖలో వారు పేర్కొన్నారు. వీటికి బదుగా టయోటా ఇన్నోవా క్రిస్టా (టాప్ మోడల్) కార్లను కేటాయించాలని అని కోరారు. 'రూ.13 లక్షల విలువైన కారు కంటే రూ.22 లక్షలకు పైగా ధర ఉండే టయోటా ఇన్నోవా క్రిస్టాను ఇవ్వాలని కోరుతున్నాం. డస్టర్ వాహనాలను తీసుకోవడానికి ఎంఎల్‌ఎలు ఎవరూ సిద్ధంగా లేరు. ఆ లేఖలో నేను కూడా సంతకం చేశాను' అని ఎన్‌పిఎఫ్‌కు చెందిన మోకోక్‌చుంగ్ జిల్లా కొరిడాంగ్ ఎంఎల్‌ఎ ఇంకాంగ్ ఎల్ ఇంచెన్ పేర్కొన్నారు.

ఓటర్ల నమోదుకు ఏడాది పొడవునా అవకాశముందా?

న్యూఢిల్లీ : 'ఏడాది పొడవునా 18 ఏళ్ల నిండిన యువత ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అనుమతించే అవకాశం ఏమైనా ఉందా' అని కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం (ఇసి)ను అడిగింది. ప్రస్తుతం జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువతీయువకులు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు అర్హులు. ఈ తేదీ తర్వాత జన్మించిన వారు ఆ తరువాత సంవత్సరంలోనే ఓటరు జాబితాలో చేరేందుకు అవకాశముంది. దీంతో 2018 జనవరి 1 తర్వాత 18 ఏళ్ల వయస్సు నిండిన వారు ఒకవేళ ఈ ఏడాది ఎన్నికలు జరిగితే ఓటు వేసే అవకాశాన్ని కోల్పోతున్నారు. 70వ దశకం మధ్య నుంచి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు పలు తేదీలు ఉండాలని ఇసి నిర్దేశిస్తోంది. అయితే జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబరు మొదటి తేదీలను ఇందుకుగాను ఇసి ప్రతిపాదించింది.న జనవరి 1, జూలై 1 తేదీలు అయితే బాగుంటాయని న్యాయ మంత్రిత్వశాఖ 2016లో తెలియజేసింది. ఎన్నికల చట్టాన్ని సవరించేందుకు ఉద్దేశించి బిల్లు ఇప్పటికే సిద్ధం చేశారు. అయితే, 18 ఏళ్ల నిండిన యువత ఏడాది పొడవునా ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ఉన్న అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోందని ప్రభుత్వ, ఇసి సీనియర్ అధికారులు తెలిపారు. ఇందుకు గాను ఇసి సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయాలని కోరినట్టు తెలిపారు

సౌర శక్తి కీలకం

70 కోట్ల యూరోల సాయానికి ఫ్రాన్స్ సిద్ధం




న్యూఢిల్లీ : కొత్తసౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ఫ్రాన్స్ ముందుకు వచ్చింది. ఫ్రాన్స్ నుంచి అభివృద్ధి చెందుతున్న దేశాలకు 70 కోట్ల యూరోల సాయం సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు అందిస్తామని ఫ్రాన్స్ అధ్యక్షులు ఎమ్మాన్యుయెల్ మెక్రాన్ హామీ ఇచ్చారు. భారతదేశ పర్యటనలో ఉన్న మెక్రాన్ పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులు అవసరం అని తెలిపారు. ఆదివారం ఇక్కడ ఇంటర్నేషనల్ సోలార్ అలయెన్స్ ప్రారంభోత్సవంలో ఫ్రాన్స్ నేత మాట్లాడారు. ఇది అంతర్జాతీయంగా సౌర కూటమి వ్యవస్థగా పని చేస్తుంది. సౌర విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటుంది. సౌర విద్యుత్ ద్వారా ప్రపంచానికి ప్రత్యామ్నాయ ఇంధన వనరులకు అవకాశం ఉందని, ఈ దిశలో అన్ని దేశాలు ఆలోచించాల్సి ఉందని , సౌర విప్లవం కీలకమైన దశలో 23 దేశాలు కలిసి ఒక వేదికగా ఏర్పడటం కీలకమైన విషయం అని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు, ఇంధన అవసరాలను తీర్చేందుకు ప్రపంచవ్యాప్తంగా సౌర విప్లవం రావాల్సి ఉందని ప్రధాని మోడీ పిలుపు నిచ్చారు. భారత్‌తో కలిసి ఫ్రాన్స్ ఈ సౌర కూటమిని ఏర్పాటు చేసింది. 2015లో దీని ఏర్పాటుపై ప్రకటన వెలువరించినప్పుడు వ్యవస్థాపక నిధిగా 30 కోట్ల యూరోల సాయం చేస్తామని ఫ్రాన్స్ తెలిపిందని మెక్రాన్ గుర్తు చేశారు. ఇప్పుడు ఇండియాలో భారీ స్థాయిలో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు సహకరిస్తామని ప్రకటించారు. సౌర ఇంధన ప్రక్రియలో పలు అడ్డంకులు ఉన్నాయని వీటిని అధిగమించాల్సి ఉందని చెప్పారు. సౌర కూటమి ఏర్పాటు సందర్భంగా ఎక్కువగా ఆఫ్రికా దేశాల నేతలు ఇక్కడికి వచ్చారు.

అందరికీ అందుబాటులోకి సౌర శక్తి : మోడీ

సౌర శక్తి ద్వారా ఇంధన సృష్టికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం సరళీకృతం కావాలని, తక్కువ వ్యయంతో కూడుకుని అందరికీ అందుబాటులోకి రావాలని ప్రధాని మోడీ పిలుపు నిచ్చారు. ఇప్పుడున్న ఇంధన వనరులలో సరికొత్తగా సౌర ఇంధనాన్ని చేర్చాల్సి ఉందని ,పర్యావరణ విపరీతాలకు అడ్డుకట్ట చెప్పడంలో సౌర ఇంధనం బాగా దోహదం చేస్తుందని మోడీ తెలిపారు. వేదాలలో అనేక చోట్ల పర్యావరణ పరిరక్షణ ఉందని, దీనిని నిశితంగా పరిశీలించాల్సి ఉందని చెప్పారు.

సోలార్ రంగంలో ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు

2030 నాటికి 121 దేశాలలో 1 ట్రిలియన్ డాలర్ల మేర పెట్టుబడులతో సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటుకు వీలేర్పడుతుందని ప్రధాని మోడీ, ఫ్రాన్స్ అధ్యక్షులు ఆశిస్తున్నారు. ఈ దిశలో రెండు దేశాల మధ్య మరింత సహకారం ఉండేలా ఒప్పందం చేసుకున్న విషయాన్ని ఇరువురు నేతలు గుర్తు చేశారు. పలు దేశాలలో సూర్యరశ్మి అపారంగా ఉంటుంది కానీ ఆయా దేశాలు సరైన విధంగా సౌర శక్తిని తమ ఇంధన అవసరాలకు వాడుకోలేకపోతున్నారని ఈ సౌర కూటమి ప్రారంభ కార్యక్రమానికి వచ్చిన ఫ్రెంచ్ మాజీ మంత్రిఒకరు తెలిపారు.



విశ్వాస తీర్మానం నెగ్గిన నేపాల్ ప్రధాని ఓలి

ఖాట్మండు: నేపాల్‌లో కొత్తగా ఎన్నికైన ప్రధాని కె.పి.ఓలి ఆదివారం పార్లమెంటు దిగువ సభలో చారిత్రక విశ్వాస తీర్మానంలో మూడింట రెండు వంతుల మెజారిటీతో గెలుపొందారు. ఫిబ్రవరి 15 ఓలి ప్రధాని పదవిలో నియుక్తులయ్యారు. పార్లమెంటులోని మొత్తం 268 మంది సభ్యులలో 208 మంది ఓట్లు గెలుచుకున్నారు. 66 ఏళ్ల ఓలికి అన్ని పార్టీల మద్దతు ఉంది. ప్రధాన ప్రతిపక్షమైన నేపాలీ కాంగ్రెస్, మరికొన్ని చిన్నాచితక పార్టీలు ఆయన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఆయనకు సిపిఎన్–యుఎంఎల్ నుంచి 121 ఓట్లు, సిపిఎన్(మావోయిస్ట్ సెంటర్) నుంచి 52 ఓట్లు, రాష్ట్రీయ జనతా పార్టీ నేపాల్, ఫెడరల్ సోషలిస్ట్ ఫోరం నేపాల్ నుంచి చెరో 16 ఓట్లు,రాష్ట్రీయ జనమోర్చా, రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ, నేపాల్ వర్కర్స్ పీజెంట్స్ పార్టీ, స్వతంత్ర శాసనకర్త నుంచి చెరో ఓటు లభించాయి. మూడింట రెండు వంతుల మెజారిటీని పొంది ఓలి తన స్థానాన్ని పటిష్టపరుచుకున్నారని అధికారులు తెలిపారు. తదుపరి పార్లమెంటు సమావేశం శుక్రవారం ఉండగలదని పార్లమెంట్ స్పీకర్ కృష్ణ బహదూర్ మహర ప్రకటించారు. నేపాల్ కొత్త రాజ్యాంగం ప్రకారం ప్రధానిగా ఎన్నికైన ఆరు నెలల లోపు ప్రధాని విశ్వాస తీర్మానం నెగ్గాల్సి ఉంటుంది. నేపాల్‌లో ముందు ఎవరైతే వారు(ఫస్ట్ పాస్ట్ ద పోస్ట్) అన్న లేక ప్రత్యక్ష ఎన్నికల కేటగిరి కింద ఎన్నికైన 165మంది సభ్యులు, దామాషా నిష్పత్తిలో ఎన్నికైన 110 మంది సభ్యులు కలుపుకుని మొత్తం 275 మంది పార్లమెంటు సభ్యులున్నారు.

గౌటాకు రాకపోకలు బంద్

తాజా దాడిలో 20 మంది పౌరులు మృతి

డౌమా : తిరుగుబాటుదారుల ఆధీనంలో ఉన్న గౌటా పట్టణానికి ఇతర ప్రాంతాలతో రాకపోకలను సిరియా ప్రభుత్వ బలగాలు తెంచేశాయి. అక్కడ గత 20 రోజులుగా జరుగుతున్న దాడిలో 1000కి పైగా పౌరులు చనిపోయారు. హింసాకాండను ఆపాలని ప్రపంచ దేశాలు విజ్ఞప్తి చేసినా సిరియా బలగాలు పట్టించుకోలేదు. పైగా విభజించి గెలవాలి అన్న వ్యూహాను అనుసరిస్తూ దాడి చేశాయి. ఒక్కొక్కటిగా తిరుగుబాటుదారుల ప్రాంతాలను కైవసం చేసుకున్నారు. సిరియా ప్రభుత్వ బలగాలు శనివారం డౌమాకు చెందిన గౌటా ప్రధాన నగరాన్ని విజయవంతంగా ఏకాకిని చేశాయి. హరస్తా పట్టణం పశ్చిమ ప్రాంతంతో డౌమా రహదారులను తెంచేయడమేకాక, మిస్రబా పట్టణాన్ని కైవసం చేసుకున్నారని బ్రిటన్‌లోని సిరియా మానవ హక్కుల పర్యవేక్షక సంస్థ పేర్కొంది. డౌమా పట్టణంపైన శనివారం కూడా బాంబుల వర్షం కురిసింది. అక్కడి ప్రజలు అనేక గంటలపాటు కదలకుండా తమ ప్రాంతాల్లోనే ఉండిపోయారు. శనివారం డౌమా పట్టణంలో నలుగురు బాలలతోపాటు కనీసం 20 మంది పౌరులు చనిపోయారని సమాచారం.

శ్రీలంకలో ముస్లిం రెస్టారెంట్‌పై దాడి

కొలంబో: శ్రీలంకలో ఆదివారం తాజాగా హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. కాండీ జిల్లాలో ముస్లింలకు వ్యతిరేకంగా చెలరేగిన మతఘర్షణపై దర్యాప్తుకు కమిషన్‌ను శ్రీలంక అధ్యక్షుడు సిరిసేన మైత్రిపాల ఏర్పాటు చేసిన మరునాడే ఓ ముస్లిం రెస్టారెంట్‌పై దాడి జరిగింది. కొలంబోకు 130 కిమీ. దూరంలో పుట్లలం జిల్లాకు చెందిన అనమదువ నగరంలో ఉన్న ముస్లిం రెస్టారెంట్‌పై ఆదివారం తెల్లవారు జామున 4.00 గంటలకు ఈ దాడి జరిగింది. శ్రీలంకలో సింహళీయుడు మరణించాక గత వారం ఉద్రిక్తతలు బాగా పెరిగాయి. కాండీలో చెలరేగిన మతఘర్షణలపై దర్యాప్తుకు ముగ్గురు సభ్యుల కమిషన్‌ను సిరిసేన నియమించారు. పైగా ఆయన గత మంగళవారం దేశవ్యాప్తంగా అత్యవసరస్థితిని కూడా ప్రకటించారు. మిలిటరీ, పోలీసులను మోహరించారు. 2.1 కోటి జనాభా ఉండే శ్రీలంకలో ముస్లింలు 10 శాతం ఉన్నారు. బౌద్ధ ధర్మానికి చెందిన సింహళీయులే మెజారిటీగా ఉన్నారు.మార్చి 3 నుంచి ఇప్పటి వరకు కాండీలో146 మంది అనుమానితులను, హింసాత్మక ఘటనలకు పాల్పడిన 135 మందిన, కర్ఫ్యూను ఉల్లంఘించినందుకు 11 మందిని అరెస్టు చేశారు.

నిషేధిత పుస్తకం ఇప్పుడు ఆంగ్లంలో..



న్యూఢిల్లీ : తస్లీమా నస్రీన్ వివాదాస్పద పుస్తకం 'ద్విఖండితో' ఇప్పుడు ఆంగ్ల అనువాదంతో వచ్చింది. ద్విఖండితో పుస్తకాన్ని 2003లో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నిషేధించింది. దీని ఆంగ్ల ప్రతి ఇప్పుడు స్ప్లిట్ ఇన్ టూ పేరిట మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చింది. మహిళల హక్కులు, మత ఛాందసవాదంపై ఘాటైన విమర్శలే తస్లీమా రచనలకు నేపథ్యంగా మారాయి. ఈ క్రమంలో ఆమె పలు సమస్యలు ఎదుర్కొన్నారు. చివరికి ఆమెకు వ్యతిరేకంగా ఇస్లామిస్టులు ఫత్వా కూడా జారీ చేశారు. ఈ దశలో ప్రవాసంలో ఉన్న తస్లీమా ఇప్పుడు ఆంగ్ల తర్జుమాతో ముందుకు వచ్చారు. బెంగాల్‌లోని అప్పటి వామపక్ష ప్రభుత్వం, బంగ్లాదేశ్ ప్రభుత్వం కూడా ఈ పుస్తకం బెంగాలీ మాతృకను నిషేధించాయి. 2005లో హైకోర్టు నిషేధాన్ని తొలిగించింది.

ఉప ఎన్నికల్లో అత్యల్ప పోలింగ్


ఓటర్లలో నిరాసక్తత... యోగి ధీమా

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో రెండు కీలక ఎంపి స్థానాలకు జరిగిన ఉప ఎన్నికలలో అత్యల్స స్థాయిలో ఓటింగ్ జరిగింది. గోరక్‌పూర్, ఫుల్పూర్ స్థానాలకు ఆదివారం ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. గోరక్‌పూర్‌లో 43 శాతం, ఫుల్పూరులో అత్యల్పంగా 37.39 శాతం ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని రాష్ట్రఎన్నికల సంఘం అధికారి తెలిపారు. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ మొదలైంది. సాయంత్రం5 గంటలకు ముగిసింది.కొన్ని చోట్ల ఇవిఎంల పనితీరుపై ఫిర్యాదు లు అందాయి. అయితే వెంటనే వాటిని మార్చివేసినట్లు వివరించారు. ముఖ్యమంత్రి ఆదిత్యానాథ్, ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్‌ల రాజీనామాలతో ఉప ఎన్నికల అవసరం ఏర్పడింది. ఈ రెండు ఎంపిఉప ఎన్నికలు బిజెపికి, రాష్ట్రంలోని ప్రతిపక్షాలకు కీలకమైనవే అయినప్పటికీ ఓటర్లు ఎక్కువగా ఆసక్తి చూపకపోవడం ఓటింగ్ శాతం తగ్గడానికి కారణం అని వెల్లడైంది.వచ్చే ఏడాదే లోక్‌సభ ఎన్నికలు ఉన్న దశలో వచ్చిన ఈ ఉప ఎన్నికల పట్ల పెద్దగా ప్రతిస్పందన లేదని వెల్లడైంది. గోరక్ పూర్‌లో ఓటు వేసిన తరువాత ముఖ్యమంత్రి ఆదిత్యానాథ్ స్పం దిస్తూ బిజెపి పట్ల ప్రజల మద్దతు విశేషంగా ఉందన్నారు.

బీహార్ ఎన్నికలలో 50 శాతానికి మించి

బీహార్‌లోని అరారియా లోక్‌సభ స్థానానికి, భాబూవా,జెహానాబాద్ అసెంబ్లీ స్థానాలకు ఆదివారం ఉప ఎన్నికలు జరిగాయి. అరారియాలో 57శాతం, భాబూవాలో 55 శాతం, జెహానాబాద్‌లో దాదాపు 51 శాతం ఓటింగ్ నమోదు అయిందని ఎన్నికల అధికారి అజయ్ వి నాయక్ పాట్నాలోతెలిపారు. ఎన్నికలు మొత్తం మీద ప్రశాంతంగా ముగిశాయని చెప్పారు. ఓట్ల లెక్కింపు 14న జరుగుతుంది. బీహార్‌లో మహాకూటమిని వీడి బిజెపి సహకారంతో అధికారంలోకి వచ్చిన సిఎం నితీశ్‌కుమార్ ప్రభుత్వానికి ఈ ఉప ఎన్నికల ఫలితాలు సవాలుగా మారాయి.

చట్టసభలో వ్యక్తులు లక్ష్యం కావద్దు



న్యూఢిల్లీ: శాసన చర్చల్లోవ్యక్తులను కాకుండా అంశాలను లక్ష్యంగా ఎంచుకుని దాడి చేయాలని చట్ట సభల సభ్యులను ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీ హెచ్చరించారు. ఇతరులపై ఆరోపణలు చేసే సభ్యులు, వాటిని నిరూపించకపోయినట్లైతే విశ్వసనీయతనుకోల్పోతారని, కేవలం ప్రకటనలు చేయడంమానులకోవాలన్నారు. ఆదివారం పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఎంపిలు, ఎంఎల్‌ఎల సదస్సునుద్దేశించి ఆయన ప్రసంగించారు. పార్లమెంట్‌లో జరిగిన తీవ్ర చర్చ కంటే గందరగోళానికి విస్తృతంగా న్యూస్ కవరేజీ వస్తోందన్నారు.ప్రపంచ వ్యాప్తంగా పార్లమెంట్ల లో జరుగుతున్న చర్చల్లోవ్యక్తులను కాకుండా అంశాలను లక్ష్యంగా చేసుకుని చర్చిస్తున్నారని జైట్లీ తెలిపారు. కేంద్ర పన్నుల్లో అన్ని రాష్ట్రాలు సమాన వాటా పొందుతున్నాయని, తమకు అన్యాయం జరుగుతందని కొందరు తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నారన్నారు.

బీహార్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

సమస్తిపూర్: బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లాలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది.ఆటో రిక్షా, ట్రక్కు ఢీకొట్టుకోవడంతో 8 మంది మృతి చెందారు. నలుగురు గాయపడ్డారు. మృతుల్లో ముగ్గురు మహిళలు ఉన్నారు. కారును ఓవర్‌టేక్ చేసే క్రమంలోఆటో రిక్షా ప్రమాదానికి గురైందని, మృతులంతా ఆటోలో ప్రయాణిస్తున్నారని స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ కమల్‌రామ్ తెలిపారు. గాయపడ్డవారిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగాఉంది.ట్రక్కు డ్రైవర్, క్లీనర్ పరారీలో ఉన్నారని, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుల వారసులకు ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ రూ.4 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు.

పిల్లల చదువులు.. హోంవర్క్‌లు

● వీటిపైనే భారతీయ తల్లిదండ్రుల శ్రద్ధ ఎక్కువ ● గ్లోబల్ పేరెంట్స్ సర్వే



లండన్ : పిల్లల స్కూల్‌వర్క్‌లో భారతీయ తల్లిదండ్రులు ఎక్కువగా శ్రద్ధ చూపుతారని, పిల్లలు ఇంటికి రాగానే వారి చదువు గురించి ఎక్కువ సమయం కేటాయిస్తారని వెల్లడైంది. బ్రిటన్‌కు చెందిన వార్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్లోబల్ పేరెంట్స్ సర్వే నిర్వహించారు. ఇందులో ఇతర దేశాలతో పోలిస్తే భారతదేశంలోనే పిల్లల చదువులపై తల్లిదండ్రుల శ్రద్ధ గురించి వెల్లడైంది. అంతేకాకుండా దేశంలోని విద్యా ప్రమాణాలపై తల్లిదండ్రులు పూర్తి ఆశాభావంతో ఉన్నారని, అంతేకాకుండా తమ పిల్లలు బాగా చదువుకుంటే జీవితంలో ఎంతో రాణిస్తారనే నమ్మకంతో ఉంటారని వెల్లడైంది. 29 దేశాల్లోని 27 వేల మంది తల్లిదండ్రుల ధోరణి, వారి జీవన ప్రాధాన్యతక్రమాలపై సర్వే నిర్వహించారు. భారతదేశంలో 95 శాతం మంది పేరెంట్స్ పిల్లల విద్యాబోధన గురించి శ్రద్ధ తీసుకోవడమే కాకుండా, వారి స్కూల్ వర్క్‌లో సహకరిస్తారని సర్వేలో తేలింది. టీచర్లు ఇచ్చే వర్క్ పూర్తి చేయడంలో వీరు ఎక్కువగా తోడ్పాటు అందిస్తుంటారు. ఇక పిల్లల చదువుల విషయంలో భారత్‌లో 62 శాతం మంది వారానికి కనీసం ఏడు గంటలు అంతకు మించి కేటాయిస్తారని వెల్లడైంది. భారత్‌తో పోలిస్తే బ్రిటన్‌లో అతితక్కువగా పిల్లల చదువులపై కేంద్రీకరిస్తారు. పిల్లల స్కూల్ వర్క్ విషయంలో రోజుకు గంట కూడా కేటాయించడం లేదని వెల్లడైంది. ఇక గత పది సంవత్సరాలలో దేశంలో విద్యా ప్రమాణాలు పెరిగాయని, , ఇతర దేశాలతో పోలిస్తే మెరుగ్గా ఉన్నాయని భారతీయ తల్లిదండ్రులు అత్యధికంగా భావిస్తున్నారని కూడా స్పష్టం అయింది. ఇండియాలో బడులలో విద్యా బోధన బాగా ఉందని దాదాపు 87 శాతం మంది తల్లిదండ్రులు తెలిపారు. అంతర్జాతీయంగా చూస్తే ఇది సగటున 78 శాతంగా ఉందని వార్కే ఫౌండేషన్ ముఖ్య కార్యనిర్వాహకాధికారి వికాస్ పోటా తెలిపారు. అర్జెంటినియా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, చైనా, కాంబోడియా, ఫిన్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, ఇండోనేషియా , ఇండియా , ఇటలీ జపాన్ వంటి పలు దేశాలలో అధ్యయనం నిర్వహించినట్లు సంస్థ వారు తెలిపారు. అన్నింటికి మించి పిల్లల చదువులపై ఎక్కువగా ఆశాభావంతో ఉన్న తల్లిదండ్రులు భారత్‌లోనే ఉన్నారని ఈ అధ్యయనంలో స్పష్టం అయింది.

ఉ. కొరియాతో చర్చలు సఫలమవుతాయి : ట్రంప్





వాషింగ్టన్: ఉత్తర కొరియా నేత కిమ్ జోంగ్‌ఉన్‌తో జరగను న్న సంచలనాత్మక చర్చలు విజయవంతం కాగలవన్న ఆశాభావాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యక్తం చేశారు. అయితే చర్చల సమయంలో ఉత్తర కొరియా ఎలాంటి క్షిపణి పరీక్షలు జరపకుండా కట్టుబాటును గౌరవిస్తుందని విశ్వసిస్తున్నట్లు కూడ చెప్పారు. కిమ్ జోంగ్ ఉన్‌తో చర్చలు జరపనున్నానని ట్రంప్ శుక్రవారం ప్రకటించి అందరినీ ఆశ్చర్యచకితులను చేశారు. పెన్సిల్వేనియాలోని మూన్ టౌన్‌షిప్‌కు ఓడలో బయలుదేరే ముందు ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని చెప్పారు. జపాన్ ప్రధాని షింజో అబే, చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్‌లతో కూడా టెలిఫోన్‌లో మాట్లాడానని, అమెరికా వాణిజ్య లోటు గురించి వారితో చర్చించానని ట్రంప్ తన ట్వీట్‌లో తెలిపారు. వేరే ప్రత్యామ్నాయ మార్గంలో కాకుండా దౌత్యపరంగా సమస్యను పరిష్కరించాలని అమెరికా కోరుకోవడాన్ని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రశంసించారని, పైగా సాయాన్ని కొనసాగిస్తానన్నారని ట్రంప్ చెప్పారు. అయితే ఉత్తర కొరియాపై ట్రంప్ వైఖరిపట్ల అమెరికా మీడియా సందేహాలను వ్యక్తం చేసింది. 'న్యూయార్క్ టైమ్స్' తన ప్రధాన వార్తలో జూదంగా అభివర్ణించింది. వైట్ హౌస్‌లోని ఓవల్ ఆఫీసులో దక్షిణ కొరియా జాతీయ భద్రతా సలహాదారు చుంగ్ యుయియంగ్‌తో సమావేశమైనప్పుడు ట్రంప్ అప్పటికప్పుడు చర్చలకు ఆమోదాన్ని తెలిపి అందరినీ ఆశ్చర్యచకితులను చేశారని రాసింది. కాగా 'వాషింగ్టన్ పోస్ట్' తన సంపాదకీయంలో ఉత్తర కొరియాతో చర్చలు జరపాలని ట్రంప్ నిర్ణయించుకోవడం సరైనదేనని రాసింది. 'ఒకవేళ ఉత్తర కొరియా అణు రహితం కావడానికి సిద్ధమేనని ట్రంప్ భావిస్తున్నట్లయితే అది ఆయన పొరపాటే కాగలదు. అమెరికా ప్రయోజనాల మేరకు ట్రంప్ కు వ్యూహం అనేది ఉందా?' అని కూడా ఆ దినపత్రిక తన సంపాదకీయంలో రాసింది. ఇదిలా ఉండగా ఉత్తర కొరియా తో జరిపే కొత్త దౌత్యంలో ట్రంప్ సఫలీకృతుడు కాలేడని అమెరికా విదేశాంగ శాఖ మాజీ ప్రతినిధి జాన్ కిర్బీ అన్నారు.

నవాజ్ షరీఫ్‌పై షూ విసిరివేత

లాహోర్: లాహోర్‌లో ఆదివారం జరిగిన ఓ ఇస్లామీ యధార్మిక విద్యాసంస్థ సదస్సులో పాకిస్థాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌పై ఓ మత తీవ్రవాది షూ విసిరాడు. లాహోర్‌కు సమీపంలో ఉన్న ఘరి షాహులోని జామియా నీమియా ధార్మిక విద్యా సంస్థ(మదర్సా)లోముఖ్య అతిథిగానవాజ్ షరీఫ్ పాల్గొనప్పుడు ఈ ఘటన జరిగింది. షరీఫ్ వేదికపై మాట్లాడుతుండగా తీవ్ర మతభావాలున్న ఓ విద్యార్థి అతడిపై షూను విసిరాడు. అది ఆయన భుజానికి, చెవికి తాకింది. షూ విసిరిన విద్యార్థి షరీఫ్ ముందుకు వచ్చి 'లబ్బయిక్ యా రసూలుల్లాహ్' అని కూడా నినదించాడు.దాంతో అక్కడ ఉన్న భద్రతా సిబ్బంది అతడిని, అతడి మరో సహచరుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. తర్వాత వారిని పోలీసులకు అప్పగించారు. షూ విసిరిన వ్యక్తి ఆ ధార్మిక విద్యా సంస్థ పూర్వ విద్యార్థి అబ్దుల్ గఫూర్‌గా గుర్తించారు. అతడి సహచరుడిని సజ్జాద్‌గా గుర్తించారు.పాకిస్థాన్ రాజ్యాంగంలో ప్రవక్త మహ్మద్ ప్రస్తావనను మార్చడంలో షరీఫ్, ఆయ న పిఎంఎల్–ఎన్ పార్టీకారణమని మత పార్టీలు. ముఖ్యంగా తెహ్రీక్–ఎ–లబ్బయిక్ తప్పుపడుతున్నాయి. ఇదిలా ఉండగా ఈ ఘటనను ప్రధాన పార్టీలైన పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ, పాకిస్థాన్ తెహ్రీక్–ఎ–ఇన్సాఫ్ ఖండించాయి. ఈ ఘటన వెనుక పిఎంఎల్–ఎన్ ప్రజాదరణకు వెరుస్తున్న వ్యక్తులు ఉన్నారని పిఎంఎల్–ఎన్ నాయకుడు,రైల్వే మంత్రి ఖ్వాజా సాద్ రఫీక్ అన్నారు.

శాంతి ర్యాలీకి శ్రీనివాస్ కూచిభోట్ల భార్య నేతృత్వం

హూస్టన్: గత ఏడాది అమెరికాలోని కాన్సస్ బార్ లో జాతి వివక్ష హత్యకు గురైన భారతీయ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ శ్రీనివాస్ కూచిభోట్ల భార్య సునయన దూమల ఆయన 34వ జయంతి సందర్భంగా శుక్రవారం శాంతి ర్యాలీని నిర్వహించింది. ఇందులో శ్రీనివాస్ కూచిభోట్ల సహ ఉద్యోగులు,మిత్రులు వందలాదిగా పాల్గొన్నారు. ఈసందర్భంగాసునయన మాట్లాడుతూ 'ఓ వ్యక్తి జాతి విద్వేషం అమాయకుడి ప్రాణాన్ని తీసుకుందని తెలియజేయడానికే మేము సమావేశం అయ్యాం' అన్నారు. గత వారం ఆడం ప్యూరిటన్(52)కాన్సస్ కోర్టులో తన నేరాన్ని అంగీకరించాడన్నది ఇక్కడగమనార్హం. అతడికి మే నెలలో యావజ్జీవ శిక్ష పడవచ్చని తెలుస్తోంది. శ్రీనివాస్ కూచిభోట్లను కాల్చి చంపడానికి ముందు అతడు'నాదేశం నుంచి వెళ్లిపొండి'అని అరిచాడు.వలసదారుల వ్యథల కథనాలు మరిన్ని పంచుకోడానికే ఈ శాంతి ర్యాలీని నిర్వహించినట్లు సునయన తెలిపారు.

ఇంగ్లాండులో బార్ నుంచి సిక్కు విద్యార్థి గెంటివేత

లండన్: సిక్కుల సంప్రాదాయం ప్రకారం తలపాగ ధరించిన ఓ సిక్కు లా విద్యార్థిని నైట్‌క్లబ్ బార్ నుంచి లాకొచ్చి గెంటేశారు. తలపాగ ధరించినందుకు శనివారం రాత్రి నాటింగ్హాంషైర్‌లోని మ్యాన్స్‌ఫీల్డ్ రష్ లేట్ బార్ నుంచి వెళ్లిపొమ్మనారని 22 ఏళ్ల అమ్రిక్ సింగ్ చెప్పాడు. ఆ బారులోకి తలపాగ ధరించి రాకూడదన్న పాలసీ కూడా లేదని, తాను బౌన్సర్‌కు వివరించేందుకు ప్రయత్నించినా లాగి పారేశారని చెప్పుకొచ్చాడు. తలపాగ నిర్మూలించడానికి నిరాకరించినందుకు నన్ను గెంటివేసినందుకు చాలా నొచ్చుకున్నానని అతడు చెప్పాడు. తాను, తన తల్లిదండ్రులు బ్రిటన్‌లోనే పుట్టిపెరిగామని, అక్కడి విలువలను గౌరవిస్తామని చెప్పాడు. ఏదిఏమైనప్పటికీ ఆ బార్ యాజమాన్యం క్షమాపణ చెప్పింది. దుడుకుగా ప్రవర్తించిన సిబ్బందిపై దర్యాప్తు కొనసాగుతున్నందున వారి సస్పెన్షన్‌ను పెండింగ్‌లో ఉంచింది.తలపాగ ధరించి రాకూడదన్నది తమ విధానం కాదని రష్ లేట్ బార్ తెలిపిందని మ్యాన్స్‌ఫీల్డ్ లేబర్ కౌన్సిలర్ సోన్యా వార్డ్ తెలిపారు.

టిడిపి రాజ్యసభ అభ్యర్థులు ఖరారు

సీఎం రమేష్, కనకమేడల రవీంద్రకుమార్‌కు అవకాశం





అమరావతి : తెలుగుదేశం పార్టీ నుంచి రాజ్యసభకు వెళ్లే అభ్యర్థుల పేర్లు ఖరారయ్యాయి. రెండు స్థానాలకు గాను సీఎం రమేష్, కనకమేడల రవీంద్రకుమార్ పేర్లను పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. సీఎం రమేష్ ఇప్పటికే రాజ్య సభ సభ్యుడిగా కొనసాగుతుండగా, కనకమేడల రవీంద్ర కుమార్ టిడిపి లీగల్ సెల్ అధ్యక్షుడిగా ఉన్నారు. ముందు గా సీఎం రమేష్‌తో పాటు వర్ల రామయ్య పేరు రాజ్యసభ రేసులో వినిపించింది.వారిద్దరి పేర్లు ఖరారై నట్లు తొలుత వార్తలు వచ్చాయి. అయితే అనూహ్య పరిస్థి తుల మధ్య కనకమేడల రవీంద్రకుమార్ పేరు తెరపైకి రావడం.. ఖరారు కావడం చకాచకా జరిగిపోయాయి. రాయలసీమలో ఇప్పటికే కర్నూలు జిల్లా నుంచి టీజీ వెంకటేష్ రాజ్యసభ సభ్యునిగా ఉన్నా రు.అనంతపురం నుంచి ఇద్ద రు మంత్రివర్గంలోనూ, మరో ఇద్దరు ప్రభుత్వ చీఫ్ విప్ పదవుల్లోనూ ఉన్నారు. చిత్తూరు సీఎం సొంత జిల్లా. ప్రతిపక్ష నేత జగన్ సొంత జిల్లా కడప టిడిపికి కీలకం. ఈ దృష్ట్యా అక్కడి నుంచి ప్రస్తుతం రాజ్యసభకి ప్రాతినిథ్యం వహిస్తున్న సి.ఎం.రమేష్‌కి మరోసారి అవకాశమివ్వాలని చంద్రబాబు భావించారు. ఇటీవలి వరకు కేంద్రంలో సహాయమంత్రిగా వ్యవహరించిన సుజనాచౌదరికి రెండేళ్ల కిందట రాజ్యసభ సభ్యత్వాన్ని పునరుద్ధరించిన నేపథ్యం లో తాజాగా సీఎం రమేష్‌కి కూడా అదే సూత్రం మేరకు రెండోసారి అవకాశం కల్పించినట్లు పార్టీ వర్గాల సమాచారం. మరోవైపు కడప జిల్లా నుంచి సీఎం రమేష్‌కు పోటీగా జిల్లా పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసుల రెడ్డి తీవ్రంగా ప్రయత్నించారు. ప్రతిపక్ష నేత జగన్‌పై తెలుగుదేశం తరపున ఎన్నికల్లో పోటీ చేయటంతో పాటు జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేసిన తీరు తనకు తెలుసునని, ఆయ న రాజకీయ భవిష్యత్తు తాను చూసుకుంటానని సీఎం నుంచి హామీ వచ్చిన కారణంగా శ్రీనివాసులరెడ్డి రేసు నుంచి తప్పుకున్నారు. గత మంత్రివర్గ విస్తరణలో రాయలసీమ నుంచి రెడ్డి సామాజిక వర్గానికి ఇచ్చిన ప్రాధాన్యతను ఈ సందర్భంగా సీఎం గుర్తు చేసినట్లు తెలిసింది. చిత్తూరు, కడప, కర్నూలు జిల్లాల నుంచి అమర్‌నాథ్ రెడ్డి, ఆదినారాయణరెడ్డి, అఖిలప్రియకు మంత్రివర్గంలో చోటు కల్పించటంతో పాటు తూర్పు రాయలసీమగా పిలిచే నెల్లూరు నుంచి సోమిరెడ్డికి అవకాశం ఇచ్చిన విషయాలను ఈ సందర్భంగా ప్రస్తావించినట్లు సమాచారం. తెలుగుదేశం పార్టీ రెడ్డి సామాజికవర్గానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిందని ఇప్పుడు రాజ్యసభకు రెండు స్థానాలు మాత్రమే ఉండటంతో సమీకరణాల దృష్ట్యా సాధ్యప డటం లేదని చంద్రబాబు ఆయనకు నచ్చజెప్పారు.

చంద్రబాబు హామీతో వెనక్కి తగ్గిన బీద మస్తాన్‌రావు

కోస్తా జిల్లాల నుంచి బీసీ, ఎస్సీ వర్గానికి అవకాశం ఇవ్వాలని చంద్రబాబు భావించడంతో.. బీసీల నుంచి నెల్లూరు జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్ రావు జిల్లా నాయకులందరితో కలిసి ముఖ్యమంత్రిని కలిసి తనకు అవకాశమివ్వాలని కోరారు. చివరి వరకు ఆయన పేరు పరిశీలనలో ఉన్నా తర్వాత అవకాశాలు సన్నగిల్లాయని సమాచారం. గత ఎన్నికల్లో ఆయనకు పార్టీ టిక్కెట్టు కేటా యించటం, ఆయన సోదరునికి ఎమ్మెల్సీగా అవకా శమివ్వటం తదితర కారణాలు కూడా పరిగణనలోకి తీసుకున్నారు. ఆదివారం సాయంత్రం అభ్యర్థుల పేర్లను అధికారికంగా ప్రకటిం చనున్నారు. వచ్చే ఎన్నికల్లో బీదా మస్తాన్ రావుకి తగిన ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు. దీంతో బీదా కూడా రేసు నుంచి తప్పుకున్నారు.

ఓటరు కార్డులకు ఆధార్‌కు లింక్ తప్పదా?

పట్టువీడని ఎన్నికల సంఘం, సుప్రీంలో పిటిషన్

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ఓటరు గుర్తింపు కార్డులు (ఐడి)లతో ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేయాలని ఎన్నికల సంఘం ప్రతిపాదించింది. ఓ వైపు ఆధార్ చట్టబద్ధతతో సంవాదం నెలకొన్న దశలో భారత ఎన్నికల సంఘం(ఇసి) తాజాగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఇందులో అన్ని ఓటరు గుర్తింపు కార్డులతో ఆధార్ లింక్ అనివార్యం చేయాలని అభ్యర్థించింది. ఒక వ్యక్తికి ఒకే ఓటు, తద్వారా ఎన్నికల అవకతవకల ఆటకట్టుకు ఎన్నికల సంఘం పలు కసరత్తులు చేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పుడు సవరించిన పిటిషన్‌లో ఐడి కార్డులు– ఆధార్ లింక్ ఆవశ్యకతను తెలిపింది. ఓట్ల అవకతవకలను నివారించేందుకు ఇది కీలక చర్య అవుతుందని స్పష్టం చేసింది. ఇంతకు ముందే వీటి అనుసంధానానికి అనుకూలంగా ఎన్నికల సంఘం ప్రతిపాదనలు చేసింది. అయితే 2016లో ఎకె జోతి సిఇసిగా బాధ్యతలు తీసుకున్న తరువాత వైఖరిలో మార్పు వచ్చింది. అయితే పలు అక్రమాల నివారణకు ఆధార్ లింకేజీ అత్యవసరం అని ఎన్నికల సంఘం భావిస్తోంది. ఒక్కరోజు క్రితమే కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి ఒపి రావత్ ఎన్నికల సంస్కరణల గురించి ప్రస్తావించారు. బెంగళూరులోఎడిఆర్ చేపట్టిన ఒక కార్యక్రమంలో వచ్చినప్పుడు ఆయన ప్రత్యేకంగా ఐడి కార్డుల అనుసంధానం గురించి వివరించారు. మొత్తం మీద ఆధార్‌తో లింక్ పట్ల ఎన్నికల సంఘం స్పష్టతతో ఉందని వెల్లడించారు. 2015 ఫిబ్రవరిలోనే ఆధార్– ఓటరు గుర్తింపు కార్డుల అనుసంధానంపై ఎన్నికల సంఘం మార్గదర్శక సూత్రాలు వెలువరించింది. అయితే అదే ఏడాది ఆగస్టులో ఈ చర్యను నిలిపివేస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు వెలువరించింది. జాతీయ ఎన్నికల జాబితా ప్రక్షాళన, నిర్ధారణల కార్యక్రమం పరిధిలో ఇసి తీసుకున్న చర్యకు అప్పట్లో బ్రేక్ పడింది. విశిష్ట ప్రాధికారిక సంస్థ గుర్తింపు సంఖ్య లేదా ఆధార్ కార్డులు కేవలం ప్రజా పంపిణీ పథకాలు, వంట గ్యాసు , కిరోసిన్ కోటాల వినియోగానికి వాడుకోవల్సి ఉంటుందని, ఇతర కార్యక్రమాలకు వాటిని వినియోగించరాదని అప్పట్లో సుప్రీంకోర్టు తెలిపింది. 2017లో సుప్రీంకోర్టుకు ఇసి సమర్పించుకున్న దరఖాస్తులో ఓటర్ల ఆధార్ వివరాలను ఎన్నికల సంఘం చిట్టాలలో పొందుపర్చాల్సి ఉందని, ఇందుకు అనుమతించాలని కోరింది. ఈ దశలో ఆధార్ సంబంధిత వ్యవహారాలను, వ్యాజ్యాలన్నింటినీ సుప్రీంకోర్టు ధర్మాసనం రాజ్యాంగ ధర్మాసనానికి బదలాయించింది. ఓటరు గుర్తింపు కార్డు ఓటర్ల హక్కును నిర్దేశిస్తుందని, దీనికి మరేదీ ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేసింది. ఐడి కార్డుతో ఆధార్ అనుసంధానం చేసుకుంటారని, అయితే ఓటు వేసేందుకు వచ్చినప్పుడు కేవలం ఆధార్ కార్డును ఐడి కార్డుగా చూపించడం కుదరదంది.

ఆర్థిక సేవల్లో బ్యాంకులది కీలక పాత్ర



మన తెలంగాణ /హైదరాబాద్ : వినియోగదారులకు ఆర్థిక పరమైన సేవలందించడంలో బ్యాంకులు కీలక పాత్ర పోషిస్తున్నాయని మాజీ ఎంఎల్సీ, సికింద్రాబాద్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ ఛైర్మన్ ఖాన్ లతీఫ్‌ఖాన్ అన్నారు. ఈ బ్యాంక్ ఏర్పాటై 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బ్యాంక్ సర్వసభ్యసమావేశం ఖాన్ లతీఫ్‌ఖాన్ అధ్యక్షతన ఆదివారం ముషీరాబాద్‌లోని బ్యాంక్ ప్రాంగణంలో జరిగింది. బ్యాంకింగ్ రంగంలో కేంద్ర ప్రభుత్వ సంస్కరణలు, నోట్ల రద్దు, ప్రస్తుతం ఆర్‌బిఐ జారీ చేస్తున్న కొత్త నోట్ల సరఫరా, లబ్ధిదారులకు అందుతున్న సౌకర్యాలపై చర్చించింది. పెద్ద నోట్ల రద్దు, మార్కెట్ సంక్షోభం, జిఎస్‌టి టాక్సేషన్ వంటి కాలంలోనూ వినియోగదారులు తమకు సంపూర్ణంగా సహకరించడం పట్ల వారికి కృతజ్ఞతలు తెలిపింది. ఇక ముందు కూడా వినియోగదారులకు సౌలభ్యంగా ఉంటూ రుణాల మంజూరు, రికవరీ తదితర అంశాలపై ఎప్పటికప్పుడు వారి తోడ్పాటుతో ముందుకు సాగాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఇంకా ఈ సమావేశంలో బ్యాంక్ వైస్ ఛైర్మన్ సయ్యద్ జహూరొద్దీన్‌తో పాటు డైరెక్టర్లు పాల్గొన్నారు.



ఉగాది పురస్కారాల ప్రదానం

మన తెలంగాణ/న్యూఢిల్లీ: ఢిల్లీ తెలుగు అకాడమీ(డిటిఎ) 30వ ఉగాది పురస్కారాల ప్రదాన కార్యక్రమం ఆదివారం ఢిల్లీలోని మౌలాంకర్ ఆడిటోరియంలో ఘనం గా జరిగింది. ఈ కార్యక్రమానికి భారత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రము ఖ సినీ నటుడు జగపతిబాబు,ఉదయశంకర్ అవాస్తిలను ఢిల్లీ తెలుగు అకాడమీ జీవన సాఫల్య పురస్కారంతో సత్కరించిం ది. మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్‌తో పాటు మరో ఏడుగురికి 'ఉద్యోగ రతన్', ప్రముఖ సినీ న టి రమ్యకృష్ణ, సంగీత దర్శకులు ఆర్పీ పట్నాయక్, ఎంఎం శ్రీలేఖ, డాక్టర్ సుధారాణితో పాటు మొ త్తం 8 మందికి 'ప్రతిభా భారతి' పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయు డు మాట్లాడుతూ 'దేశ రాజధాని నగరంలో తెలు గు వికాసానికి కృషి చేస్తున్న ఢిల్లీ తెలుగు అకాడమీ నిర్వహిస్తున్న ఈ పురస్కారాల కార్యక్రమానికి హాజరుకావడం సంతోషంగా ఉందని అన్నారు. తెలుగువారు ఎక్కడ ఉన్నా సమష్టిగా పండగలను జరుపుకోవడానికి ఇష్టపడతారని ఆయన చెప్పారు. సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు పండగలు దోహదం చేస్తాయన్న వెంకయ్యనాయుడు, భారతీయ సంస్కృతి, కుటుంబ వ్యవస్థ విశిష్టమైనదని మన సంస్కృతి ఇతర దేశాలకు భిన్నమైనదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పురస్కార గ్రహీతలు శైలజా కిరణ్, జగపతిబాబు,రమ్యకృష్ణ తదితరులు తమను అవార్డుతో సత్కరించిన ఢిల్లీ తెలుగు అకాడమీకి కృతజ్ఞతలు తెలిపారు.

పాకిస్థాన్ పర్యటనకు విండీస్ రెడీ



కరాచీ: విండీస్ క్రికెట్ జట్టు పాకిస్థాన్‌లో పర్యటించేందుకు సిద్ధమైంది. ఈ టూర్‌లో భాగంగా విండీస్ జట్టు పాకిస్థాన్ గడ్డపై మూడు ట్వంటీ–20 మ్యాచ్‌లు ఆడుతుంది. ఏప్రిల్ ఒకటిన ఇరు జట్ల మధ్య తొలి మ్యాచ్ జరుగుతుంది. ఏప్రిల్ 2న రెండో, 4న చివరి టి–20 మ్యాచ్‌ను నిర్వహిస్తారు. కాగా, అన్ని మ్యాచ్‌లకు కరాచీ నగరం ఆతిథ్యం ఇవ్వనుంది. శ్రీలంక క్రికెట్ జట్టుపై టెర్రరిస్టుల దాడి తర్వాత పాకిస్థాన్‌లో పర్యటించేందుకు అంతర్జాతీయ క్రికెట్ జట్లు భయపడుతున్నాయి. ఇటీవల కాలంలో వరల్డ్ ఎలెవన్ జట్టుతో పాకిస్థాన్ మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో తలపడింది. అంతేగాక శ్రీలంక జట్టు కూడా లాహోర్ వేదికగా ఒక అంతర్జాతీయ టి–20 మ్యాచ్ ఆడిన విషయం తెలిసిందే. తాజాగా విండీస్ జట్టు మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో తలపడేందుకు పాకిస్థాన్ రానుంది. ఈ విషయాన్ని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చైర్మన్ నజమ్ సేథి ఆదివారం అధికారికంగా ప్రకటించారు. తొలుత పాక్‌లో పర్యటించేందుకు విండీస్ నిరాకరించింది. అయితే పలు దఫాలుగా జరిపిన చర్చల తర్వాత ఇక్కడ పర్యటించేందుకు విండీస్ సమ్మతించింది. కాగా, విండీస్ కోరిక మేరకు మ్యాచ్‌లను లాహోర్ నుంచి కరాచీ నగరానికి మార్చారు. కాగా, పాక్‌లో పర్యటించే విండీస్ జట్టుకు పూర్తి రక్షణ కల్పిస్తామని నజమ్ స్పష్టం చేశారు.

ప్రతీకారం కోసం భారత్

నేడు లంకతో కీలక పోరు, ముక్కోణపు టోర్నీ

కొలంబో: ముక్కోణపు ట్వంటీ–20 టోర్నమెంట్‌లో భాగంగా సోమవారం జరిగే కీలక మ్యాచ్‌లో భారత్ ఆతిథ్య శ్రీలంక జట్టుతో తలపడనుంది. తొలి మ్యాచ్‌లో శ్రీలంక చేతిలో ఎదురైన ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలనే లక్ష్యంతో టీమిండియా ఈ మ్యాచ్‌కు సిద్ధమైంది. మరోవైపు కిందటి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ చేతిలో అనూహ్య ఓటమి పాలైన లంకకు ఈ మ్యాచ్ కీలకంగా మారింది. తొలి మ్యాచ్‌లో భారత్‌ను ఓడించిన లంక ఈసారి కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగించేందుకు తహతహలాడుతోంది. అయితే రెండో మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై ఘన విజయం సాధించిన టీమిండియా జోరుమీదుంది. అంతేగాక తొలి మ్యాచ్‌లో తమను ఓడించిన లంకపై బదులు తీర్చుకునేందుకు అతృతతో ఎదురు చూస్తోంది. రెండు జట్లు కూడా విజయమే లక్ష్యంగా పెట్టుకోవడంతో ఈ పోరు కూడా హోరాహోరీగా సాగడం ఖాయం. కాగా టోర్నీలో భాగంగా ఇప్పటివరకు మూడు మ్యాచులు జరిగాయి. ఇందులో శ్రీలంక, భారత్, బంగ్లాదేశ్ ఒక్కో మ్యాచ్‌లో విజయం సాధించడంతో ఫైనల్ రేసు ఆసక్తికరంగా మారింది. ఇదిలావుండగా ఈ మ్యాచ్‌లోనూ కూడా గెలిచి ఫైనల్ స్థానాన్ని మరింత పదిలం చేసుకోవాలనే లక్ష్యంతో ఇరు జట్లు ఉన్నాయి. కాగా, చివరి వరకు నిలకడైన ఆటను కనబరిచిన జట్టుకే విజయం వరిస్తుందని చెప్పక తప్పదు.

తీరు మారాలి...

మిగతా బ్యాట్స్‌మెన్ కూడా తమ తీరును మార్చుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది. ముఖ్యంగా సీనియర్ ఆటగాడు సురేశ్ రైనా తన బ్యాట్‌కు పదును పెట్టక తప్పదు. ఇప్పటివరకు ఆడిన రెండు మ్యాచుల్లోనూ రైనా విఫలమయ్యాడు. ఈ సారైన తన రైనా మెరుగ్గా ఆడాల్సి ఉంది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా కలిగిన రైనా వైఫల్యం భారత్‌కు ప్రతికూలంగా మారింది. యువ ఆటగాళ్లతో తీవ్ర పోటీ నెలకొన్న నేపథ్యంలో వరుస వైఫల్యాలు చవిచూస్తే తుది జట్టులో స్థానం కాపాడుకోవడం చాలా కష్టం. ఈ మ్యాచ్‌లో రాణించడం ద్వారా సెలెక్టర్లు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టేందుకు రైనా సిద్ధమయ్యాడు. కాగా, మనీష్ పాండే నిలకడగా రాణిస్తున్నా అతని బ్యాటింగ్‌లో మెరుపులు ఉండడం లేదు. పొట్టి ఫార్మాట్‌కు అనుగుణంగా వేగంగా ఆడడంలో మనీష్ విఫలమవుతున్నాడనే చెప్పాలి. ఈ మ్యాచ్‌లో కాస్త వేగంగా ఆడాల్సిన అవసరం అతనిపై ఉంది. అంతేగాక యువ ఆటగాడు రిషబ్ పంత్ రెండు మ్యాచుల్లోనూ నిరాశ పరిచాడు. ధోని వరసుడిగా పరిగణిస్తున్న పంత్ అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో విఫలమయ్యాడనే చెప్పాలి. కనీసం ఈ మ్యాచ్‌లోనైన తన బ్యాటింగ్‌ను మెరుగు పరుచుకోక తప్పదు. లేకుంటే టీమిండియాలో చోటు కాపాడుకోవడం చాలా కష్టం. ఇక, విజయ్ శంకర్, దినేష్ కార్తీక్‌లు కూడా మెరుగ్గా ఆడాల్సి ఉంది.



ముఖ్యంగా దినేష్ తన బ్యాట్‌కు పనిచెప్పక తప్పదు. ఇక, బౌలింగ్‌లో కూడా భారత్‌కు ఇబ్బందులు తప్పడం లేదు. ఒక్క వాషింగ్టన్ సుందర్ తప్ప మిగతావారు అంతంత మాత్రంగానే రాణిస్తున్నారు. విజయ్ శంకర్, శార్దూల్ ఠాకూర్, జైదేవ్ ఉనద్కట్ వంటి యువ బౌలర్లు ఉన్నా ఫలితం లేకుండా పోతోంది. పొదుపుగా బౌలింగ్ చేయడంలో వారు విఫలమవుతున్నారు. అంతేగాక కీలక సమయంలో వికెట్లు తీయలేక పోతున్నారు. కీలక బౌలర్ చాహల్ కూడా సత్తా చాటలేక పోతున్నాడు. అతని వైఫల్యం వల్లే తొలి మ్యాచ్‌లో భారత్‌కు ఓటమి తప్పలేదు. కనీసం ఈ మ్యాచ్‌లోనైన చాహల్ మెరుగ్గా బౌలింగ్ చేయాల్సిన అవసరం ఉంది.

గెలుపే లక్ష్యంగా...

మరోవైపు తొలి మ్యాచ్‌లో భారత్‌ను చిత్తు చేసిన శ్రీలంక ఈసారి కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగించాలనే పట్టుదలతో ఉంది. ఇందులోనూ టీమిండియాను ఓడించి ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకోవాలని భావిస్తోంది. అయితే రెండో మ్యాచ్‌లో బంగ్లాదేశ్ చేతిలో అనూహ్యంగా ఓడిన లంకకు ఈ మ్యాచ చాలా కీలకంగా మారింది. బౌలర్ల వైఫల్యం జట్టును కలవర పెడుతోంది. బంగ్లాపై 214 పరుగులు సాధించినా ఫలితం లేకుండా పోయింది. బౌలర్ల వైఫల్యంతో బంగ్లాదేశ్ ఈ భారీ లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. ఈసారి కూడా లంకకు ఓటమి భయం పట్టుకుంది. కిందటి మ్యాచ్‌లో ఎదురైన ఓటమికి బదులు తీర్చుకోవాలనే ఉద్దేశంతో భారత్ పోరుకు సిద్ధమైంది. దీంతో భారత్‌ను ఎలా కట్టడి చేయాలో లంకకు అంతుబట్టకుండా మారింది. అయితే కుశాల్ పెరీరా, కుశాల్ మెండిస్‌లో భీకర ఫాంలో ఉండడం లంకకు ఊరటనిచ్చే అంశం. భారత్‌పై పెరీరా మెరుపు ఇన్నింగ్స్ ఆడిన విషయం తెలిసిందే. ఈసారి కూడా అతనిపై జట్టు భారీ ఆశలు పెట్టుకుంది. మెండిస్ కూడా జోరుమీదున్నాడు. కెప్టెన్ చండీమల్, మాజీ కెప్టెన్ ఉపుల్ తరంగ, గుణతిలక, తిసారా పెరీరా తదితరులతో లంక చాలా బలంగా ఉంది. దీంతో భారత్‌కు గట్టి పోటీ ఎదురు కావడం ఖాయంగా కనిపిస్తోంది.

రోహిత్‌కు పరీక్ష!

వరుస వైఫల్యాలతో సతమతమవుతున్న టీమిండియా స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మకు ఈ మ్యాచ్ కీలకంగా మారింది. ఇప్పటి వరకు ఆడిన రెండు మ్యాచుల్లో కూడా రోహిత్ విఫలమైన విషయం తెలిసిందే. తొలి మ్యాచ్‌లో డకౌట్ అయిన రోహిత్ తర్వాతి మ్యాచ్‌లో కూడా నిరాశ పరిచాడు. వరుస వైఫల్యాల నేపథ్యంలో రోహిత్ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాడు. అతని వైఫల్యాలపై మాజీ క్రికెటర్లు, నెటిజన్లు, అభిమానులు సైతం తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వీరి విమర్శలకు బ్యాట్‌తో సమాధానం చెప్పేందుకు రోహిత్ సిద్ధమయ్యాడు. అయితే ఇది అనుకున్నంత తేలిక కాదనే చెప్పాలి. తరచు విఫలమవుతున్నా రోహిత్ గుణపాఠం నేర్చుకోవడం లేదు. ప్రతి మ్యాచ్‌లోనూ నిర్లక్ష్యంగా ఆడుతూ వికెట్‌ను పారేసుకుంటున్నాడు. కనీసం ఈ మ్యాచ్‌లోనైన మెరుగైన బ్యాటింగ్‌ను కనబరచాల్సిన బాధ్యత అతనిపై ఉంది. ఇందులో కూడా విఫలమైతే రానున్న రోజుల్లో రోహిత్ కష్టాలు పెరగడం ఖాయం. మరోవైపు శిఖర్ ధావన్ భీకర ఫాంలో ఉండడం భారత్‌కు



కలిసి వచ్చే అంశం. రెండు మ్యాచుల్లో కూడా ధావన్ మెరుగైన బ్యాటింగ్‌తో జట్టుకు అండగా నిలిచాడు. ఈసారి కూడా జట్టు అతనిపై భారీ ఆశలు పెట్టుకుంది. ఈ మ్యాచ్‌లో ధావన్ రాణిస్తే జట్టుకు మరో సారి భారీ స్కోరు ఖాయం.



జట్ల వివరాలు:

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), శిఖర్ ధావన్ (వైస్ కెప్టెన్), లోకేష్ రాహుల్, సురేశ్ రైనా, మనీష్ పాండే, దినేష్ కార్తీక్, దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్, చాహల్, అక్షర్ పటేల్, విజయ్ శంకర్, శార్దూల్ ఠాకూర్, జైదేవ్ ఉనద్కట్, మహ్మద్ సిరాజ్, రిషబ్ పంత్.

శ్రీలంక: దినేష్ చండీమల్ (కెప్టెన్), ఉపుల్ తరంగ, దనుష్క గుణతిలక, కుశాల్ మెండిస్, దాసున్ శనక, కుశాల్ పెరీరా, జీవన్ మెండిస్, సురంగ లక్మల్, ఇసురు ఉడనా, అకిల ధనంజయ, అమిలా అపొన్సో, నువాన్ ప్రదీప్, దుష్మంత చమీరాచమీరా, ధనంజయ డిసిల్వా, తిసారా పెరీరా.

రాత్రి 7 గంటల నుంచి డిడి స్పోర్ట్స్, డిడి నేషనల్‌లలో ప్రత్యక్షప్రసారం

DD SPORTS

చండీమల్‌పై రెండు మ్యాచ్‌ల నిషేధం

కొలంబో: శ్రీలంక కెప్టెన్ దినేష్ చండీమల్‌పై ఐసిసి రెండు మ్యాచ్‌ల నిషేధాన్ని విధించింది. బంగ్లాదేశ్‌తో శనివారం జరిగిన టి–20 మ్యాచ్‌లో స్లో ఓవర్ రేటు కారణంగా దినేష్ చండీమల్‌పై ఈ చర్య తీసుకున్నట్టు ఐసిసి ఓ ప్రకటనలో వెల్లడించింది. దీంతో చండీమల్ సోమవారం భారత్‌తో జరిగే మ్యాచ్‌తో పాటు బంగ్లాదేశ్ పోరుకు కూడా దూరం కానున్నాడు. బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక బౌలర్లు నిర్ణీత సమయానికి నాలుగు ఓవర్లు తక్కువ వేశారు. దీంతో మ్యాచ్ నిర్ణీత వ్యవధికంటే అధికంగా సాగక తప్పలేదు. స్లో ఓవర్ రేటు కారణంగా లంక క్రికెటర్ల ఫీజుపై పది శాతం కోతను విధించారు. ఈ సందర్భంగా ఈ మ్యాచ్‌కు రిఫరీగా వ్యవహరించిన క్రిస్ బ్రాడ్ మాట్లాడుతూ ఐసిసి నిబంధనల ప్రకారం శ్రీలంక బౌలర్లు నిర్ణీత సమయంలో ఓవర్లను పూర్తి చేయడంలో విఫలమయ్యారన్నారు. దీంతో ఐసిసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోక తప్పడం లేదన్నారు. స్లో ఓవర్ రేటు కారణంగా శ్రీలంక కెప్టెన్ చండీమల్‌పై రెండు ట్వంటీ–20 మ్యాచ్‌లలో పాల్గొన కుండా నిషేధాన్ని విధిస్తున్నట్టు వివరించారు. ఇది తక్షణమే అమలులోకి వస్తుందన్నారు. మరోవైపు స్లో ఓవర్ రేటు కారణంగా బంగ్లాదేశ్ క్రికెటర్లపై కూడా రిఫరీ చర్యలు తీసుకున్నారు. బంగ్లాదేశ్ ఆటగాళ్ల ఫీజులో పది శాతం కోత విధిస్తున్నట్టు రిఫరీ పేర్కొన్నారు. కాగా, మరోసారి స్లో ఓవర్ రేటు నమోదైతే బంగ్లాదేశ్ కెప్టెన్‌పై కూడా నిషేధాన్ని విధిస్తామని ఐసిసి హెచ్చరించింది.



వీనస్‌తో సెరెనా పోరు

ఇండియన్‌వెల్స్: చాలా కాలం తర్వాత మళ్లీ రాకెట్ పట్టిన అమెరికా దిగ్గజం సెరెనా విలియమ్స్ ప్రతిష్టాత్మకమైన బిఎన్‌పి పరిబాస్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో మూడో రౌండ్‌కు దూసుకెళ్లింది. ఈ క్రమంలో మూడో రౌండ్‌లో తన సోదరి వీనస్ విలియమ్స్‌తో సమరానికి సిద్ధమైంది. హోరాహోరీగా సాగిన రెండో రౌండ్‌లో మాజీ నంబర్‌వన్ సెరెనా 7–6(5), 7–5 తేడాతో డచ్ క్రీడాకారిణి కికి బెర్టెన్స్‌ను ఓడించింది. ఇటీవల ఓ బిడ్డకు జన్మనిచ్చిన సెరెనా చాలా రోజుల తర్వాత మళ్లీ బరిలోకి దిగింది. కాగా, ఆడిన తొలి టోర్నమెంట్‌లోనే స్ఫూర్తిదాయక ఆటతో ఆకట్టుకుంది. బెర్టెన్స్‌తో జరిగిన పోరులో తీవ్ర పోటీ నెలకొన్నా చివరి వరకు పట్టుదలతో ఆడుతూ విజయాన్ని అందుకుంది. 23 సార్లు గ్రాండ్‌స్లామ్ విజేతగా నిలిచిన సెరెనా తర్వాతి రౌండ్‌లో సోదరి వీనస్‌తో తలపడుతుంది. 1998 తర్వాత వీరిద్దరూ ఓ టోర్నమెంట్‌లో మూడో రౌండ్‌లో తలపడడం ఇదే తొలిసారి కావడం విశేషం. రెండో రౌండ్‌లో వీనస్ రుమేనియా క్రీడాకారిణి సొరానా క్రిస్టిను ఓడించింది. ఏకపక్షంగా సాగిన



పోరులో వీనస్ 6–3, 6–4తో విజయం సాధించింది. కాగా, సోదరి వీనస్‌తో పోరుకు ఎంతో అతృతతో ఎదురు చూస్తున్నట్టు సెరెనా తెలిపింది. వీరిద్దరూ చివరి సారిగా 2017లో ఆస్ట్రేలియా ఓపెన్ ఫైనల్లో తలపడ్డారు. ఆ ఫైనల్లో సెరెనా విజయం సాధించింది. ఇద్దరి మధ్య జరిగిన మ్యాచుల్లో సెరెనాదే పైచేయిగా ఉంది. సెరెనా 17 సార్లు విజయం సాధించగా, వీనస్ కేవలం 11 సార్లు మాత్రమే జయకేతనం ఎగుర వేసింది.

భారత మహిళలకు హాకీ సిరీస్



సియోల్: దక్షిణ కొరియాతో జరిగిన ఐదు మ్యాచ్‌ల హాకీ సిరీస్‌ను భారత మహిళా జట్టు 3–1తో కైవసం చేసుకుంది. ఆదివారం ఇరు జట్ల మధ్య జరిగిన ఆఖరి టెస్టు 1–1తో సమంగా ముగిసింది. అయితే ఇప్పటికే మూడు విజయాలు సాధించిన భారత జట్టు సిరీస్‌ను సొంతం చేసుకుంది. కాగా, చివరి మ్యాచ్‌లో నెగ్గి భారత్ ఆధిక్యాన్ని కాస్త తగ్గించాలని భావించిన కొరియాకు నిరాశే మిగిలింది. సిరీస్‌లో భారత్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. వరుస విజయాలతో కొరియాను కోలుకోలేని దెబ్బతీసింది. కాగా, ఆఖరి మ్యాచ్‌లో మాత్రం కొరియా నుంచి భారత్ తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. దూకుడైన ఆటను కనబరిచిన కొరియా మ్యాచ్‌ను డ్రాగా ముగించడంలో సఫలమైంది. ప్రథమార్థంలో రెండు జట్లు డిఫెన్స్‌కే ప్రాధాన్యత ఇచ్చాయి. దీంతో ఈ సెషన్‌లో ఒక్క గోల్ కూడా నమోదు కాలేదు. ద్వితీయార్థంలో రెండు జట్లు జోరును పెంచాయి. 48వ నిమిషంలో వందన భారత్‌కు మొదటి గోల్‌ను అందించింది. ఈ ఆనందం భారత్‌కు ఎక్కువ సేపు నిలువలేదు. రెండు నిమిషాల తర్వాత బోమి కిమ్ గోల్ చేసి స్కోరును సమం చేసింది. చివరి వరకు మరో గోల్ నమోదు కాక పోవడంతో మ్యాచ్ డ్రాగా ముగియక తప్పలేదు.

ప్రపంచకప్ షూటింగ్‌లో అఖిల్‌కు స్వర్ణం



మెక్సికో: ఇక్కడ జరుగుతున్న ఐఎస్‌ఎస్‌ఎఫ్ వరల్డ్ కప్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ అఖిల్ షెరాన్ స్వర్ణ పతకం సాధించాడు. పురుషుల 50 మీటర్ల రైఫిల్ పోజిషన్ ఫైనల్లో ప్రథమ స్థానంలో నిలిచిన అఖిల్ పసిడి పతకాన్ని సొంతం చేసుకున్నాడు. ఈ ప్రపంచకప్‌లో భారత్‌కు ఇది నాలుగో పసిడి పతకం కావడం విశేషం. 22 ఏళ్ల అఖిల్ అసాధారణ ప్రతిభతో స్వర్ణం గెలిచి చరిత్ర సృష్టించాడు. అత్యంత చిన్న వయసులో ప్రపంచకప్ షూటింగ్‌లో పతకం సాధించిన నాలుగో షూటర్‌గా కొత్త రికార్డును నెలకొల్పాడు. ఈ విభాగంలో అద్భుతంగా రాణించిన అఖిల్ 455.6 పాయింట్లతో ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణం దక్కించుకున్నాడు. ఆస్ట్రియాకు చెందిన బెర్న్‌హార్డ్ పికల్‌కు రజతం లభించింది. ఇస్ట్‌వాన్ పెనికు కాంస్యం దక్కింది. కాగా, ప్రపంచకప్‌లో స్వర్ణం సాధించడంపై అఖిల్ ఆనందం వ్యక్తం చేశాడు. కఠోర సాధన వల్ల స్వర్ణం సాధించాలనే తన కల నెరవేరిందన్నాడు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించేందుకు ఈ విజయం దోహదం చేస్తుందనే నమ్మకాన్ని అఖిల్ వ్యక్తం చేశాడు. కాగా, ఈ ప్రపంచకప్‌లో భారత్‌కు ఇది నాలుగో స్వర్ణం. షాజర్ రిజ్వి, మను బాకర్, మెహూలి ఘోష్‌లు కూడా ప్రపంచకప్‌లో స్వర్ణ పతకాలు సాధించిన విషయం తెలిసిందే.

చరిత్రాత్మక ప్రదర్శన ఇది

అభినవ్ బింద్రా

న్యూఢిల్లీ: మెక్సికోలో జరుగుతున్న ప్రపంచకప్ షూటింగ్‌లో భారత షూటర్ల ప్రదర్శనపై ఒలింపిక్ స్వర్ణ పతక విజేత అభినవ్ బింద్రా ఆనందం వ్యక్తం చేశాడు. భారత షూటర్లు ఏకంగా నాలుగు స్వర్ణాలు గెలుచుకోవడం చారిత్రాత్మకమైన ప్రదర్శన అని పేర్కొన్నాడు. ఈ పతకాలు భారత షూటింగ్‌కు శుభపరిణామమని తెలిపాడు. రానున్న ఒలింపిక్స్‌లో భారత షూటర్లు



మరింత మెరుగ్గా రాణించేందుకు ఈ ప్రదర్శన దోహదం చేస్తుందనే నమ్మకాన్ని బింద్రా వ్యక్తం చేశాడు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రపంచకప్ షూటింగ్ భారత షూటర్లు నాలుగు పసిడి పతకాలు గెలుచుకోవడం ఎంతో ఆనందం కలిగించే అంశమన్నాడు. పతకాలు సాధించిన షూటర్లను బింద్రా అభినందించాడు. కఠోర సాధన, అంకితభావం వల్లే పతకాలు దక్కాయని పేర్కొన్నాడు. ఈ పతకాలు భారత షూటింగ్‌కు కొత్త దిశను నిర్దేశించడం ఖాయమని బింద్రా జోస్యం చెప్పాడు.

కష్టాల్లో ఆస్ట్రేలియా





పోర్ట్ ఎలిజబెత్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టులో ఆస్ట్రేలియా ఎదురీదుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యం సాధించిన దక్షిణాఫ్రికా మ్యాచ్‌పై పట్టు సాధించింది. భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్ చేపట్టిన ఆస్ట్రేలియా 180 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో చిక్కుకుంది. ఆస్ట్రేలియాకు ఇప్పటి వరకు కేవలం 41 పరుగుల ఆధిక్యం మాత్రమే లభించింది. ఇప్పటికే కీలక ఆటగాళ్లందరూ పెవిలియన్ చేరడంతో ఆసీస్ కష్టాల్లో చిక్కుకుంది. ఇక, జట్టు ఆశలన్ని స్టార్ ఆటగాడు మిచెల్ జాన్సన్, వికెట్ కీపర్ పైన్‌పై ఆధారపడి ఉన్నాయి. సోమవారం నాలుగో రోజు వీరిద్దరూ నిలదొక్కుకుంటేనే ఆస్ట్రేలియా కష్టాల్లో నుంచి బయటపడుతోంది. లేకుంటే ఇబ్బందులు తప్పక పోవచ్చు. భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్ చేపట్టిన ఆసీస్‌కు ప్రారంభం నుంచే కష్టాలు మొదలయ్యాయి. ఓపెనర్ డేవిడ్ వార్నర్ (13) విఫలమయ్యాడు. మరో ఓపెనర్ కామెరూన్ బెన్‌క్రాఫ్ట్ (24) కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలువలేక పోయాడు. కెప్టెన్ స్మిత్ (11), షాన్ మార్ష్ (1) కూడా జట్టును ఆదుకోలేక పోయారు. అయితే ఒకవైపు వికెట్లు పడుతున్నా ఉస్మాన్ ఖ్వాజా పోరాటం కొనసాగించాడు. అతనికి మిచెల్ మార్ష్ అండగా నిలిచాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన ఖ్వాజా 14 ఫోర్లతో 75 పరుగులు చేసి జట్టును ఆదుకున్నాడు. మిచెల్ మార్ష్ 39 పరుగులతో నాటౌట్‌గా ఉన్నాడు. అంతకుముందు దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 382 పరుగులకు ఆలౌటైంది. స్టార్ ఆటగాడు డివిలియర్స్ శతకంతో జట్టుకు అండగా నిలిచాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన డివిలియర్స్ 20 ఫోర్లు, సిక్స్‌తో 126 పరుగులు చేశాడు. చివర్లో ఫిలాండర్ (36), కేశవ్ మహారాజ్ (30) రాణించడంతో సఫారీలో భారీ ఆధిక్యం లభించింది.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.